PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 82 | విజయవాడ, గురువారం 23 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 23 October 2025 | Rs

తాగునీటి కోసం రాస్తారోకో

- గుంతకల్లు ఎమ్మెల్యేను అడ్డుకున్న మహిళలు
- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- సిపిఎం, ఐద్వా మద్దతు

3

గెలిస్తే సెమీస్ బెర్త్

- నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా కీలక పోరు
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

8

షరాఫ్ గ్రూప్ అధినేతలతో సమావేశమైన సిఎం చంద్రబాబునాయుడు

పారిశ్రామిక బంధం బలోపేతమయ్యేలా
సహకరించండి

- దుబాయ్‌లో భారత ఎంబసీ ప్రతినిధులతో సిఎం
- పలు సంస్థలతో పెట్టుబడులపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయ ప్రతినిధులను కోరారు. మూడురోజులపాటు దుబాయ్ పర్యటనకు వెళ్లిన ఆయన తొలిరోజు ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్‌కుమార్ శివన్, అబుదాబీలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సమావేశమైనారు. రాష్ట్రంలో పెటుబడులకు ఉన్న అవకాశాలను వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, అతిథ్యరంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా రాష్ట్రంలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వారికి వివరించారు. గూగుల్ సంస్థ విశాఖలో 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ సముద్రతీర ప్రాంతంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. లాజిస్టిక్స్ రంగం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. యుఎఇ సావరిన్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై వారితో చర్చించారు.. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సిఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు హైదరాబాద్ నుండి దుబాయ్ చేరుకున్న సిఎంకు అక్కడ ఘనస్వాగతం లభించింది.

అమరావతికి రూ.100 కోట్ల విరాళం

దుబాయ్‌లోని ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూపు అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయ నిర్మాణానికి రూ.100 కోట్ల విరాళం ప్రకటించింది. దీనికి స్పందించిన చంద్రబాబునాయుడు అమరావతి నిర్మాణంలో శోభా గ్రూపు భాగస్వామి కావాలని కోరారు. ఎపికి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. మూడేళ్లలో రాజధానిలో అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ ఎఐహబ్, అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తామని అన్నారు.

మరో మైలురాయి చేరుకున్న కేరళ

- తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా ఘనత
- 1న ప్రకటించనున్న సిఎం పినరయి విజయన్

7

దిగొచ్చిన పసిడి

- ఒక్క రోజులోనే రూ.10వేలు తగ్గిన బంగారం

న్యూఢిల్లీ : దేశంలో బంగారం ధర భారీగా దిగివచ్చింది. బుధవారం ఒక్కరోజే రూ.10 వేల మేర తగ్గింది. 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,800కు చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,483కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,58,000కు చేరుకుంది. అయితే, దేశంలోని వివిధ నగరాల్లో ఈ తగ్గుదలలో మార్పులున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ప్రస్తుతం గోల్డ్ రేటు తగ్గడానికి కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ స్పాట్ గోల్డ్ (31.10 గ్రాములు) ధర సోమవారం 4,190 డాలర్లు ఉండగా, మంగళవారం 4045 డాలర్లకు తగ్గింది. స్పాట్ వెండి ధర కూడా 3.9 డాలర్లు తగ్గి 47.84 డాలర్లకు దిగివచ్చింది. 2013 తరువాత ఒక్కరోజులోనే ఈ స్థాయిలో ధరలు తగ్గడం ఇప్పుడేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బంగారం ధర 60 శాతానికి పెరిగి గరిష్ట స్థాయికి చేరింది. త్వరలోనే ఔన్స్ బంగారం ధర ఏకంగా 5,000 డాలర్లకు పెరిగే అవకాశం ఉందని భావించారు. పెట్టుబడిదారులు లాభాల స్వీకరణతో ఒక్కసారిగా అమ్మకాలు పెరిగి, ధరలు 6 శాతం వరకు పడిపోయాయి. బుధవారం ఆసియా మార్కెట్లలో కూడా ఈ పతనం కొనసాగింది. ఒక దశలో బంగారం ఔన్సు ధర 4,000 డాలర్ల వరకు తగ్గింది. వెండి కూడా అదే దారిలో నష్టపోయింది. దీని ప్రభావం బంగారం ఉత్పత్తిదారుల షేర్లపై తీవ్రంగా కనిపించింది. ఆసియా మార్కెట్లు కూడా బలహీనంగా ప్రారంభమయ్యాయి. హాంకాంగ్, షాంఘై, సిడ్నీ, వెల్లింగ్టన్, తైపీ, మనీలా సూచీలు నష్టపోయాయి. బంగారం, వెండి వంటి వాటి ధరలు అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగానే ఉంటాయి.

తిరుపతి జిల్లాలో కుండపోత

కడప, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరులో భారీ వర్షాలు

- రాష్ట్రంలో మరో 5 రోజులు ఇదే స్థితి
- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సమీక్ష
- అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు : హోమ్ శాఖ మంత్రి అనిత

తిరుపతి జిల్లా పుత్తూరు మండల పరిధిలో నది ఉధృతంగా ప్రవహించడంతో కల్లూరు గ్రామానికి పూర్తిగా స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లాలో బుధవారం కుంభవృష్టి కురిసింది.కడప, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. అల్పపీడనం కారణంగా ఈ జిల్లాలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది , వర్షాలు, వరదల పరిస్థితులపై డిప్యూటి సిఎం పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి అనిత సూచించారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి ప్రకాశం, కడప, తిరుపతి, నెల్లూరుల్లో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

తిరుపతిలో 14 మండలాల్లో వంద మిల్లీమీటర్లకుపైగా...

తిరుపతి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, వాగులు నిండి ప్రవహిస్తున్నాయి. ఈ జిల్లాలోని 14 మండలాల్లో వంద మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శ్రీకాళహస్తి మండలంలో 184.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తొట్టంబేడులో 176.6, బిఎన్ కండ్రిగలో 149.4, వడమాలపేటలో 141.8, దొరవారిసత్రంలో 143.8, ఎల్లకూరులో 144.2, సూళ్లూరుపేటలో 135.6, ఏర్పేడులో 132.8, దక్కిలిలో 124.2, బాలయ్యపల్లిలో 112.4, గూడూరు 107.2, తిరుపతి రూరల్‌లో 108.8, వరదయ్యపాలెంలో 103.2, రేణిగుంటలో 100.6, వర్షపాతం రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. కొత్త వీరాపురం, మునగలపాలెం స్వర్ణముఖి నది కాజ్‌వేలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఉధృతంగా గార్గేయ

చిత్తూరు జిల్లాలో విజయపురంలో 99.2 మిల్లీమీటర్లు, పెనుమూరులో 86.6, కార్వేటినగరంలో 80.4, వెదురుకుప్పంలో 79.4, పూతలపట్టులో 79.2, నింద్రలో 70.4 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదైంది. సదుం మండలం పట్రపల్లి-కొత్తూరు మార్గమధ్యలోని గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమల మండలం ఆవులపల్లె వద్ద వరద నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. పలమనేరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద చెరువు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వెదురుకుప్పం మండలం తంగేళిమిట్ట సమీపంలోని మద్దేలవంక దగ్గర వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో జనజీవనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయి. ప్రకాశం జిల్లాలో పాఠశాలలకు బుధవారం మధ్యాహ్నం నుంచి సెలవు ఇచ్చారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో వర్షాలకు వేలాది ఎకరాల్లో టమోటా, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లాలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది.

నేడు వాయుగుండం ..!

నైరుతి బంగాళాఖాతంలో తమిళనాడు తీరంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయువ్యదిశగా కదులుతూ గురువారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. రానున్న ఐదు రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం మిగతా 7లో

విద్యార్థి, యువజన సంఘాల జెఎసి ర్యాలీలో పాల్గొన్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాల్సిందే

- విద్యార్థి, యువజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన 'శంఖారావం'

2

మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.665 కోట్లు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా రూ.665 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.166 కోట్లు జత చేసి, మొత్తం రూ.831 కోట్లతో ఈ ఏడాది



మార్చి 31వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియర్ చేసే అవకాశం ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో పంచాయతీ భవనాల నిర్మా ణం, రికార్డుల కంప్యూటరీకరణ, సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు శిక్షణ, ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ మరో రూ.50 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది.

ఆరోగ్యశ్రీ వైద్యసేవలు పునరుద్ధరణకు చర్యలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి వైద్యసేవలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఎన్‌టిఆర్ వైద్యసేవలు కొన్ని రోజులుగా నిలిచిపోయి రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని వివరించారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ కింద ఎవరూ ఆస్పత్రుల్లో చేర్చుకోవడం లేదని, పేదల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని తెలిపారు. వెంటనే స్పందించి ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేసుకుంటున్న రోగులు అది నిలిచిపోవడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక, ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకునే స్తోమత లేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రులకు కొంత మంది షిఫ్ట్ అవుతున్నారని, తగిన డాక్టర్లు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేక సరైన వైద్యం అందడం లేదని వివరించారు. బడా కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తలకు వేలకోట్ల రూపాయల రాయితీలు ప్రకటిస్తున్న కూటమి ప్రభుత్వం పేదల వైద్యం కోసం అవసరమైన నిధులు విడుదల చేయకపోవడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి ఆస్పత్రుల యాజమాన్యంతో చర్చించి, పేదలకు వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగేటట్లు చూడాలని కోరారు. వేలాది మంది రోగుల ప్రాణాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గురుకుల విద్యార్థినిపై అత్యాచారం

- టిడిపి నాయకుని పాశవికం
- సుమోటోగా మహిళా కమిషన్ కేసు నమోదు

ప్రజాశక్తి- తుని (కాకినాడ జిల్లా), అమరావతి బ్యూరో

టిడిపి నాయకుడు పాశవికంగా ప్రవర్తించాడు. మనవరాలి వయస్సున్న మైనర్ విద్యార్థినిపై అత్యాచారం చేశాడు. కాకినాడ జిల్లా తుని మండలం జగన్నాథగిరిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై సుమోటోగా మహిళా కమిషన్ కేసు నమోదు చేసింది. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తుని మండలం కొండావారిపేటకు చెందిన బాలిక జగన్నాథగిరిలోని గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతోంది. బాలిక ఇంటి సమీపంలోనే టిడిపి మాజీ కౌన్సిలర్ తాటిక నారాయణరావు (60) కుటుంబం ఉంటోంది. ఆయన తరచూ బాలిక చదువుతున్న వసతిగృహానికి వెళ్లి తాతయ్యను అని చెప్పి బయటకు తీసుకెళ్తుండేవాడు. పలుమార్లు ఇలా బయటకు తీసుకెళ్లి తినుబండారాలు కొనిచ్చి మంచివానిగా నమ్మించాడు. ఇదే విధంగా ఈ నెల 21న హాస్టల్‌కు వెళ్లి బాలికను స్కూటీపై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలకు తొండంగి మండలం పైడికొండ గ్రామ శివారున ఉన్న సపోటా తోటలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ సమయంలో బాలిక కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి నారాయణరావును గద్దించాడు. దీంతో, నారాయణరావు హుటాహుటిన బాలికను స్కూటీపై ఎక్కించుకుని గురుకులంలో దింపేసి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక దళితులు, ప్రజాసంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులు బుధవారం గురుకులం వద్ద ఆందోళనకు దిగారు. పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, తుని రూరల్ సిఐ జి.చెన్నకేశవరావు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. తుని రూరల్ పోలీసులు నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షలకు తరలించారు. నిందితుడిని జగన్నాథగిరిలోని అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద మిగతా 7లో

ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త చిట్నీస్ కన్నుమూత



పూణె : ప్రముఖ భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఏక్‌నాథ్ వసంత్ చిట్నీస్ (100) బుధవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం ఉదయం గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. భారత జాతీయ అంతరిక్ష పరిశోధన కమిటీలో చిట్నీస్ కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత ఈ కమిటీనే అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)గా రూపాంతరం చెందింది. కేరళలోని తుంబాలో భారతదేశపు మొట్టమొదటి రాకెట్ ప్రయోగానికి సంబంధించిన స్థలాన్ని ఎంచుకోవడంలో డాక్టర్ చిట్నీస్ ప్రధాన పాత్ర పోషించారు. 1981 నుంచి 1985 వరకు అహ్మదాబాద్‌లోని ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్‌ఎసి)కి ఆయన రెండో డైరెక్టర్‌గా పనిచేశారు. భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయి సహచరుల్లో ఆయన ఒకరు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్‌కు చిట్నీస్ మార్గనిర్దేశం చేశారు. డాక్టర్ చిట్నీస్‌కి కుమారుడు డాక్టర్ చేతన్ చిట్నీస్, కోడలు అంబికా, మనవరాళ్లు తరిణి, చందిని ఉన్నారు.

జీవికా దీదీలకు నెలకు రూ.30వేలు

- తేజస్వీ యాదవ్ భారీ హామీ
- లాలూ, తేజస్వీతో అశోక్ గెహ్లాట్ భేటీ
- సిబిఐ కోర్టు దోషిగా తేల్చిన సహాని బిజెపిలో చేరిక

అశోక్‌గెహ్లాట్‌తో మాట్లాడుతున్న లాలూప్రసాద్ యాదవ్, చిత్రంలో తేజస్వియాదవ్, రబ్రీదేవి

పాట్నా : బీహార్ ఎన్నికలకు సమయం ముంచుకొస్తుండటంతో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఎన్నికల ముందు మహిళల ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున వేసిన అధికార జెడి(యు), బిజెపిలకు ఆర్‌జెడి నాయకులు తేజస్వీ యాదవ్ దీటుగా బదులిచ్చారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే జీవికా దీదీ కమ్యూనిటీ మొబిలైజర్లకు నెలకు రూ.30 వేలు చొప్పున నెలవారీ వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు. వారిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. వారు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతోపాటు రూ.5 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. ఎన్నికలకు ముందు నితీష్ ప్రభుత్వం మహిళల ఖాతాలో రూ.10 వేలు వేయడాన్ని లంచంగా తేజస్వీయాదవ్ అభివర్ణించారు. ఇది సాయం కాదని రుణం అని, అమిత్‌షా చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ... ఎన్‌డిఎ అధికారంలోకి వస్తే... ఆ మొత్తాన్ని తిరిగి వసూలుచేస్తారని హెచ్చరించారు.

ఎవరీ జీవికా దీదీలు?

బీహార్‌లో 2007లో జీవిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయం సహాయక సమూహాలు ఏర్పాటుచేయడం, వారికి రుణాలు, శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. బీహార్ సుమారు 10 లక్షల మంది వరకు జీవికా దీదీలు ఉన్నారు. ఎన్నికలకు ముందు నితీష్ కుమార్ ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను తెరపైకి తెచ్చింది. ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకాన్ని ప్రారంభించింది. దీని కింద స్వయం ఉపాధి కోసం ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున 1.21 కోట్ల మంది మహిళల ఖాతాలకు నగదు బదిలీ చేశారు. నితీష్‌కుమార్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ కార్మికులు, వంటపనివారి గౌరవ వేతనాన్ని కూడా పెంచింది.

ఎన్‌డిఎలోనే ఎక్కువ సమస్యలు : అశోక్ గెహ్లాట్, లాలూ భేటీ

ఇండియా బ్లాక్‌లో కన్నా ఎన్‌డిఎలో ఎక్కువ సమస్యలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. ఇండియా బ్లాక్‌లోని పార్టీల మధ్య ఉన్న సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని చెప్పారు. గెహ్లాట్ ఆర్‌జెడి అధ్యక్షులు లాలూ ప్రసాద్‌తో బుధవారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'బీహార్‌లో ప్రతిపక్ష కూటమి గెలవడం ఎంతో ముఖ్యం. బీహార్ ఎన్నికలు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాయి. సమాజంలో విభజనలకు కారణమై, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న అధికార ఎన్‌డిఎను ఓడించాల్సిన అవసరం ఉంది. బీహార్ ప్రజలు ఈ పని చేయగలరు" అని గెహ్లాట్ చెప్పారు. గురువారం నిర్వహించనున్న మీడియా సమావేశంలోనే అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతామన్నారు.

'రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ మధ్య మంచి అనుబంధం ఉంది. బీహార్‌లో ఇటీవల నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇది నిరూపితమైంది. ఇరువురు నేతలు రాష్ట్రమంతా పర్యటించారు. వారు సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారు' అని గెహ్లాట్ తెలిపారు. ఇండియా బ్లాక్ మిగతా 7లో

సిపిఎం రాష్ట్ర కమిటీకి భూరి విరాళం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం శ్రేయోభిలాషి శ్రీమతి వి సుమతి తనకొచ్చే పెన్షన్ నుంచి సిపిఎం రాష్ట్ర కమిటీకి 2025 అక్టోబరు నుంచి ప్రతినెలా రూ.50 వేలు చొప్పున పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆమెకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున కార్యదర్శి వి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం పార్టీ ప్రజా ఉద్యమాలకు ఎంతగానో తోడ్పడుతుందని కమ్యూనిస్టు ఉద్యమ సత్సంప్రదాయాలను అనుసరించి ఆమె తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్ఎస్ పాయింట్లు హమాలీలకు

దసరా బోనస్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌరసరఫరాలశాఖ ఎంఎల్ఎస్ పాయింట్లలోని హమాలీలకు ఆగస్టు, సెప్టెంబరు బిల్లులు, నెలల పెండింగ్, దసరా బోనస్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ కృష్ణ, ఎస్ ఉదయ భాస్కరరావు పౌరసరఫరాలశాఖ ఎమ్‌డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. హమాలీ బిల్లులు ప్రకాశం జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు బకాయిలు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఏలూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఉన్నాయన్నారు. కాంట్రాక్టరు ద్వారా చెల్లించాల్సిన బిల్లులు పశ్చిమగోదావరి, అనంతపురం, సత్యసాయి, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు ప్రకాశం జిల్లాలో సెప్టెంబరు నెలకు, ఎన్‌టిఆర్ జిల్లాలో స్వీపర్స్, అనంతపురం జిల్లాలో దసరా కానుక, యూనిఫామ్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కర్నూలు పాయింట్ హమాలీలకు 2023లో ఇన్‌ఛార్జి మారిన నేపథ్యంలో 2 గోడౌన్లలో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహించిన రూ.2.60 లక్షల బకాయిలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

కల్తీ మద్యానికి కారకుడు జగనే

- మంత్రి సవిత ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యంతో రాష్ట్ర ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిన వ్యక్తి మాజీ సిఎం జగన్ అని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్టపై బురద జల్లేందుకు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా కల్తీ మద్యం కుట్రలు చేస్తున్నారని వెల్లడించారు. ఐదేళ్ల జగన్ పాలనలో జె బ్రాండ్ పేరుతో కల్తీ మద్యానికి అధికారిక ముద్ర వేసి విచ్చల విడిగా అమ్మకాలు చేశారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లలో కల్తీ మద్యం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 30 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ బార్‌లో కల్తీ మద్యం తాగి ఆరుగురు మృతి చెందడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం తయారీలో జోగి రమేష్, జనార్ధన్‌రావు.. జగన్ నివాసంలోనే ప్రణాళికలు రచించారన్నారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరులో నూతన మద్యం పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మద్యం నాణ్యతను పరిరక్షించడానికి 13 రకాల ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించండి

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ఈ పథకాన్ని ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. పథకం అమలులో భాగంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.2,700 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ వద్ద ఈ అంశంపై బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 14 రోజులుగా నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను నిలిపేసినా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని తెలిపారు. రోజుకు 8 వేల మంది ఈ పథకం కింద నమోదు చేసుకుంటున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. వీరు వైద్య సేవలు అందకుండా ఇబ్బందుపలు పడుతున్నారని, వీరికి సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతినెలా రూ.350 కోట్లు మేర ఆస్పత్రులకు బిల్లులు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం 2024 ఏప్రిల్ నాటికి బకాయిలు రూ.2 వేలకోట్లు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ప్రస్తుత బకాయిలు మరో రూ.700 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ పథకం సేవలు వెంటనే పునరుద్ధరించకుంటే ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ, ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ, తదితర నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి సమన్వయంతో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గత 16 నెలల్లో రాష్ట్రానికి ఇప్పటి వరకు కేంద్రం రూ.లక్షన్నర కోట్ల సాయం చేసిందన్నారు. విజయవాడ బందరు రోడ్డు లెమన్‌ట్రీ హోటల్‌లో బుధవారం ఆ పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రాయితీల కోసం

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తల నిరసన

- పరిశ్రమల డైరెక్టర్‌తో చర్చలు
- నూరుశాతం ఇవ్వకుంటే పరిశ్రమలు నడుపలేమని వినతి



పరిశ్రమల శాఖ డైరెక్టర్‌తో చర్చిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

తమకు రావాల్సిన రాయితీలు మొత్తం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని పరిశ్రమల శాఖ కార్యాలయం వద్ద ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామిక వేత్తలు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం ఇచ్చి 40 నిమిషాలకు పైగా చర్చించారు. జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఈడ్పుగంటి అనార్‌బాబు, ఈరా రాజశేఖర్ నాయకత్వంలో ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామిక వేత్తల బృందం పలు అంశాలను వివరించింది. తాము అత్యంత దయనీయ స్థితిలో ఉన్నామని, తమకు రావాల్సిన రాయితీల బకాయిలు 30 శాతమే విడుదల చేస్తే అస్సలు సరిపోవని, వంద శాతం విడుదల చేస్తేనే పరిశ్రమలను కొనసాగించగలమని చెప్పారు. ఈ సమస్యపై గత ఆగస్టులో ధర్నాతో పాటు సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, అడిషనల్ డైరెక్టర్‌కూ పలుమార్లు విన్నవించామని చెప్పారు. జిఒ ఏడుపై ఉన్న అభ్యంతరాలను తొలగించాలని కోరారు. ఎపిఐఐసి ఆధ్వర్యంలో ప్లాట్లు కేటాయించే సందర్భంలో ఇచ్చే రాయితీని పెరుగుతున్న భూముల ధరలకు అనుగుణంగా రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలు పెంచాలని, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు కేటాయించిన బడ్జెట్‌ను దారిమళ్లించొద్దని కోరారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... నెలాఖరులోగా రాయితీలను విడుదల చేస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులనూ సత్వరం రాష్ట్ర కార్యాలయానికి తెప్పించుకుంటామని, పల్నాడు జిల్లాకు జిఎంని నియమిస్తామని హామీనిచ్చినట్లు జెఎసి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పినమాల నాగకుమార్, జంగా త్రిమూర్తులు, చినమౌలాలి, వి.భక్తవత్సలం, కారెం శ్రీనివాస్, అన్నవరపు అవినాష్, నాగులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాల్సిందే

విద్యార్థి, యువజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన 'శంఖారావం'

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని విశాఖ జిల్లా విద్యార్థి, యువజన సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి ఆధ్వర్యంలో 'విశాఖ ఉక్కు పరిరక్షణ శంఖారావం' పేరుతో బుధవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దీక్షా శిబిరం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎం.వినోద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అచ్యుతరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడారు.

స్టీల్ ప్లాంటు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా ప్రజా, కార్మిక సంఘాలు పోరాడుతుంటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉంటామని చెప్పిన రాష్ట్రంలోని టిడిపి కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు అనుకూలంగానే ఉంటున్నారని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇఒఐని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని సంకీర్ణ ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రంలోని టిడిపి కూటమి మద్దతుతో ఏర్పడిందని, దీన్ని ఉపయోగించుకొని విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగేందుకు ప్రయత్నించాలని కోరారు. స్టీల్‌ప్లాట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగులు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితుల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని, ప్లాంట్‌కు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయాలని కార్మిక, ప్రజాసంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు అజయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెట్ మినహాయింపుపై చొరవ తీసుకోవాలి

- సిఎం, డిప్యూటీ సిఎంలను కోరిన టిఎన్‌యుఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌డిఎ కూటమిలో కీలకంగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సర్వీసుల్లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017 పార్లమెంట్ తీర్మానం ప్రకారం సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి అని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ)కి ఉపాధ్యాయ సంఘాలు విన్నవించినా తిరస్కరించిందని వివరించారు. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఆందోళన, ఒత్తిడి చెందుతున్నారని తెలిపారు. టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా పార్లమెంట్‌లో తీర్మానం చేసేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్స్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌టిఎ

ఎపి మోడల్ స్కూల్స్ రెగ్యులర్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపి ఎస్‌టిఎ) కోరింది. సర్వీస్ రూల్స్ అమలు చేయడం ద్వారా ఉద్యోగుల హక్కులు పరిరక్షించబడతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కారుణ్య నియామకాల పాలసీ ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కూడా కల్పించబడుతుందని పేర్కొన్నారు.

ఆక్వాకల్చర్ అభివృద్ధికి సహకారం అందించండి

- ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి లోకేష్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆక్వా కల్చర్ అభివృద్ధికి సహకారం అందించాలని జేమ్స్‌కుక్ యూనివర్సిటీ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ప్రొఫెసర్ క్యాల్ జెంజర్‌ను కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ బుధవారం క్యాల్ జెంజర్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో రొయ్యలు, చేపల పెంపకం సామర్థ్యాన్ని పెంచేందుకు సెంటర్ ఫర్ సస్టయినబుల్ ట్రోపికల్ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ ద్వారా ఆక్వా కల్చర్ జెనెటిక్స్ నైపుణ్యాలను అందించాలని కోరారు. బ్లాక్ టైగర్ రొయ్యలతో భారత్‌లో ప్రధానంగా ఉత్పత్తి చేసే ఆక్వా రకాల్లో వ్యాధి నిరోధకత, వృద్ధిరేటు కోసం జన్యుపరమైన మెరుగుదలకు కృషి చేయాలని తెలిపారు. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి వాటర్ రీ సైక్లింగ్, ఫీడ్ ఆప్టిమైజేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు. ఆధునిక ఆక్వా సాగు పద్ధతులు, జన్యుపరమైన ఎంపిక, స్థిరమైన నిర్వహణ పద్ధతులపై ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతుల కోసం శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఎంపిక చేసిన బ్రీడ్ల ద్వారా ఉత్పాదకత పెంపుదలకు అభివృద్ధి చేసిన జెనెటిక్ టూల్స్‌ను తమ ఆక్వా రైతులకు అందించాలని కోరారు.

భారత్‌లో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎపి

భారత్‌లో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ఉందని మంత్రి లోకేష్ అన్నారు. బ్రిస్బేన్‌లోని భారత రాయబార కార్యాలయంలో బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (ఎఐబిసి) ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ.. భారత్-ఆస్ట్రేలియా మధ్య స్నేహపూర్వక ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతోందని చెప్పారు. భారత్ నుంచి ఆస్ట్రేలియాకు కీలకమైన ఎగుమతుల్లో శుద్ధి చేసిన పెట్రోలియం, ఔషధాలు, ఇంజినీరింగ్ వస్తువులు, విద్యుత్ యంత్రాలు, వస్త్రాలు, ఆభరణాలు, వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయని, ఇందులో ఎపి ప్రముఖ పాత్ర పోషిస్తోందని తెలిపారు. 2022 డిసెంబర్‌లో అమల్లోకి వచ్చిన ఆస్ట్రేలియా-భారత్ ఎకనమిక్ కో-ఆపరేషన్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ ఇరుదేశాల నడుమ వాణిజ్య సంబంధాలకు గేమ్ ఛేంజర్‌గా మారిందని తెలిపారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే పార్ట్‌నర్ షిప్ సమ్మిట్-2025కు హాజరై రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక పాలసీలు, ప్రోత్సాహకాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను తెలుసుకోవాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలను కోరారు. గ్రిఫిత్ యూనివర్సిటీని సందర్శించిన లోకేష్ రాష్ట్రంలో వర్సిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ మార్నీ వాట్సన్‌ను కోరారు. అనంతరం విద్యారంగంపై క్వీన్స్ ల్యాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో హైస్కూల్ స్థాయి నుంచే ఎఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని, ఎఐ ల్యాబ్‌లు, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత కాన్సులేట్ జనరల్ (బ్రిస్బేన్) నీతూ భాగోటియా తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం కోసం పోరాటం

అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలిని నది దాటించిన గ్రామస్తులు

అనారోగ్యానికి గురైన వృద్ధురాలిని మంచంపై ఉంచి నది దాటిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-గజపతినగరం (విజయనగరం)

మారు మూల పల్లెలో అనారోగ్యం బారిన పడిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రాణాలు తెగించి చంపావతి నది దాటించారు. ఈ ఘటన విజయనగరం జిల్లా గజపతినగరం మండల కేంద్రానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని మర్రివలస గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గత కొంతకాలంగా భారీ వర్షాలకు ఆండ్ర జలాశయం నీటిమట్టం పెరగడంతో రెండురోజుల కిందట గేట్లు ఎత్తారు. నది దాటేందుకు బ్రిడ్జి లేకపోవడంతో మర్రివలస గ్రామానికి ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. ఇదే సమయంలో ఆ గ్రామానికి చెందిన ముగడ రమణమ్మ (70) అకస్మాత్తుగా అనారోగ్యం పాలయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదమని తెలిసినప్పటికీ ఆస్పత్రికి తరలించేందుకు తన ఇద్దరి కుమారులతో పాటు గ్రామస్తులు మంచంపై ఆమెను పడుకోబెట్టి ఉధృతంగా నడుములోతున ప్రవహిస్తున్న చంపావతి అవతల ఒడ్డుకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి ఆమె ప్రాణాలు కాపాడారు.

బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

మర్రివలస బ్రిడ్జి లేకపోవడంతో చంపావతిలో నీరు ఉధృతంగా ప్రవహించినప్పుడల్లా ఇదే పరిస్థితి ఎదురవుతోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఏటా వర్షాలు అధికంగా కురిసిన ప్రతిసారీ విద్య, వైద్యం, నిత్యవసర సరుకులు వినియోగానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని గత నెల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో దత్తిరాజేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు.

నేడు ఎన్‌టిఆర్ వైద్య సేవ ఆస్పత్రుల ధర్నా

- రూ.250 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) గురువారం ధర్నా నిర్వహించనుంది. బకాయిల విడుదల కోసం ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ హాస్పిటల్స్ 13 రోజుల నుంచి ఉచిత వైద్య సేవలను నిలిపివేశాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడంతో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని ఆషా వెల్లడించింది. గురువారం జరిగే ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్, ఐఎంఎ, ఎపిఎన్ఎ, ఎపి జూడా, ఎపి ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నుంచి ప్రతినిధులు హాజరవుతారని పేర్కొంది. అయితే ఎన్‌టిఆర్ వైద్య సేవ అనుబంధ (నెట్‌వర్క్) ఆస్పత్రుల బకాయిల్లో రూ.250 కోట్లను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. త్వరలో మరో రూ.250 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవల్ని కొనసాగించాలని ఎపి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులను కోరారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.3 వేల కోట్ల బకాయిల వరకు ఆస్పత్రులకు రావాల్సి ఉంది. అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం చర్చలు నిర్వహించి రూ.250 కోట్లు విడుదల చేస్తామని వెల్లడించింది. బకాయి నిధుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌మ్యాప్ విడుదల చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. చర్చలు విఫలం కావడంతో ధర్నాకు ఆషా పిలుపునిచ్చింది.

డిఎ బకాయిలపై ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి

- చర్చనీయాంశంగా మారిన సర్కారు తీరు
- త్వరలో ఉద్యోగ సంఘాల భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం డిఎ ఇచ్చిన తీరుపై ఉద్యోగుల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. . నాలుగు డిఏలు బకాయిలు చెల్లించాల్సి ఉండగా కంటితుడుపుగా ఒకే ఒక డిఏను ప్రకటించడంతో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉద్యోగుల్లో ఈ విషయంపైనే పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కొన్ని ఉద్యోగ సంఘాల పైనా, వాటి నేతలపైన కూడా ఉద్యోగులు ఆగ్రహంతో స్పందిస్తున్నారు. తమతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే ఒక డిఎకి ఎలా అంగీకరిస్తారని వీరు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి 2024 జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగు డిఏలు ప్రకటించాల్సి ఉంది. 2024 జూలై, 2025 జనవరి, 2025 జూలైల్లో ఈ డిఏలు రావాల్సి ఉంది. నాలుగు డిఏలతో కలిపి ఇప్పటివరకు 44.59 శాతానికి చేరుకోవాల్సి ఉంది. అయితే కేవలం 2024 నాటి ఒక డిఏ మాత్రమే ప్రకటించడంతో ఇప్పటివరకు ఉద్యోగులకు అందే కరవుభత్యం 37.31 శాతానికి మాత్రమే చేరుకున్నట్టయిందని ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో దాదాపు ఏడు శాతానికిపైగా తాము నష్టపోవాల్సి వచ్చిందని వారు వాపోతున్నారు. ఉద్యోగుల తరపున గట్టిగా పోరాడాల్సిన కొన్ని ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడంలో విఫలమవుతున్నారన్న అభిప్రాయం కూడా ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. 'వారిలో వారు మాట్లాడుకోవడం తప్ప మేం ఏం చెబుతున్నామో వినడం లేదు.' అని ఆర్థికశాఖకు చెందిన మధ్య తరగతి అధికారి ఒకరు అన్నారు. తమతో వాస్తవ పరిస్థితిని కూడా నేతలు చర్చించడం లేదని ఇంకో ఉద్యోగి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్న తీవ్ర అసంతృప్తి నేపథ్యంలో సంఘాల నేతలు మరోసారి త్వరలో భేటీ కానున్నారని సమాచారం

ట్రంప్ సుంకాలకు లొంగిపోయిన మోడీ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

సదస్సులో మాట్లాడుతున్న రాంభూపాల్

ప్రజాశక్తి - పెద్దాపురం(కాకినాడ జిల్లా)

అమెరికా అధ్యక్షుడు ఎడాపెడా విధిస్తున్న సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. 'ట్రంప్ సుంకాలు - భారత్‌పై ప్రభావం' అనే అంశంపై కాకినాడ జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సిపిఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో రాంభూపాల్ మాట్లాడుతూ.... అమెరికా విధిస్తున్న 50 శాతం సుంకాలు భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఒక్క రొయ్యల వ్యాపారంలోనే రూ.34 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. సినిమాలపైనా సుంకాల దెబ్బ పడిందని, అమెరికాలో చదువుకునే భారత విద్యార్థులపైనా ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు. ట్రంపు సుంకాలపై ప్రధాని మోడీ నేటికీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. అమెరికాలో ఉన్న భారతీయుల కాళ్లకు, చేతులకు బేడీలు వేసి తిప్పి పంపినా మోడీలో చలనం లేదన్నారు. దేశానికి నష్టం చేకూర్చే ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్, నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- సమాచార కమిషనర్‌కు ఎపియుడబ్ల్యుజె వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌ను ఎపియుడబ్ల్యుజె ప్రతినిధులు కోరారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చావా రవి, కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివల నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సమాచార శాఖ కమిషనర్‌ను బుధవారం సాయంత్రం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుందరికీ అక్రిడిటేషన్ సదుపాయం కల్పించాలని, ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ, ప్రొఫెషనల్ ఎథిక్స్ కమిటీ వెల్ఫేర్ ఫండ్ కమిటీ వంటి వివిద జర్నలిస్ట్ ప్రొఫెషనల్ కమిటీలను ఏర్పాటు చేయాలని వారు కమిషనర్‌ను కోరారు. ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ పథకాన్ని పునరుద్దరించాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డుల పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయింపులు చేయాలని కమిషనర్‌ను కోరారు.

పలు జిల్లాలకు

అంబుడ్స్ పర్సన్ల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో జిల్లా స్థాయిలో ఫిర్యాదులను పరిష్కరించేందుకు అంబూడ్స్ పర్సన్లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాకు బి వెంకటరాణి, గుంటూరు జిల్లాకు చల్లా లలిత, కాకినాడ జిల్లాకు కె మల్లేశ్వరరావు, నంద్యాల జిల్లాకు జి మద్దిలేటి స్వామి, తిరుపతి జిల్లాకు బి మురళి, విజయనగరం జిల్లాకు ఎం అబ్దుల్ యాకూబ్ బాషా, పార్వతీపురం మన్యం జిల్లాకు ఎం తిరుపతిరావు, ప్రకాశం జిల్లాకు కె మనోహరరావు, చిత్తూరు జిల్లాకు కె వరదరాజులు, అన్నమయ్య జిల్లాకు కె శ్రీరాములు, అనకాపల్లి జిల్లాకు బి వేణుగోపాల్, శ్రీకాకుళం జిల్లాకు ఐ గురుమూర్తి, అనంతపురం జిల్లాకు బి పద్మనాభరెడ్డిని అంబూడ్స్ పర్సన్‌లుగా నియమిస్తున్నట్లు విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీ కాలం రెండేళ్లుగా పేర్కొన్నారు. కర్నూలు జిల్లాకు ఆర్ సురేంద్ర కుమార్ పదవీ కాలాన్ని మూడేళ్లకు పొడిగించారు. వీరికి రూ.45 వేలు రెమ్యూనరేషన్ చెల్లించనున్నారు. వీరు ఈ పథకం అమలుపై ప్రతి మూడు నెలలకు నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. తప్పు చేసిన సిబ్బంది, అధికారులపై చర్యలకు సిఫార్సు చేసే అవకాశం ఉంది.

ఓర్వలేకే వైసిపి కుట్రలు

- టిడిపి నేత పిల్లి మాణిక్యరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తున్నారని, దీనిని ఓర్వలేని వైసిపి నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని టిడిపి అధికార ప్రతినిధి, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరులో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణను కులచిచ్చుగా పెట్టాలని వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య చేసిన హరిశ్చంద్ర ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని తెలిపారు. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచిందని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా దేవళంపాడు గ్రామంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి సర్పంచ్ గోవిందప్ప పెట్రోల్ పోసి తగలబెట్టి, పోలీసులకు గుర్తుతెలియని వ్యక్తులు చేశారని ఫోన్ చేశారని వివరించారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన గోవిందప్పను జగన్ ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు.

ఉద్యోగోన్నతుల జిఓ విడుదల పట్ల

ఎపిపిటిడి కార్మిక పరిషత్ హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిపిటిడి ఉద్యోగుల ఉద్యోగోన్నతులకు సంబంధించి జిఓ ఎంఎస్ నెంబరు 44 విడుదల చేయడం హర్షణీయమని ఎపిపిటిడి కార్మిక పరిషత్తు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వి శేషగిరిరావు, వై శ్రీనివాసరావు, సిసిఎస్ పాలకవర్గ సభ్యులు కోసూరి సురేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్ ప్రయోజనాలు కల్పించిన సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తిరుపతిలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:
ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర 13వ మహాసభ తిరుపతిలో ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజులు పాటు జరగనుంది. తిరుపతి నగరంలోని యశోదనగర్ వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉదయం పది గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభం కానుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్ప రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు జరిగే బహిరంగ సభకు ఆల్ ఇండియా రోడ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జిబాన్ షా, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవుతారని, గత మూడేళ్ల కాలంలో ఆర్‌టిసిలో జరిగిన పోరాటాలు, విజయాలు సమీక్షించుకుని, మరో మూడేళ్లకు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోనట్లు తెలిపారు. 1990 సెప్టెంబర్ 9, 10 తేదీల్లో తిరుపతిలో ఎస్‌డబ్ల్యుఎఫ్ మూడోవ మహాసభ నిర్వహించుకున్నామని, 25 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ తిరుపతిలో జరుగుతోందని పేర్కొన్నారు.

కర్ణాటకలో స్వచ్ఛాంధ్ర బృందం పర్యటన

- ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఆంధ్రప్రదేశ్‌లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల పరిశీలనలో భాగంగా పట్టాభిరామ్ ఆధ్వర్యాన ప్రతినిధి బృందం కర్ణాటకలోని మంగుళూరు, దక్షిణ కన్నడ జిల్లాల్లో పర్యటిస్తోంది. పలు కేంద్రాలను పరిశీలించింది. దీనిపై పట్టాభి మాట్లాడుతూ.. కడపడవు, ఉజురే పంచాయ తీల్లో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ల పనితీరును స్వయంగా పరిశీలించినట్లు పేర్కొ న్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల స్థాపన కోసం కర్ణాటకలో ప్లాంట్లనూ పరిశీలిం చామని వివరించారు.

బంగ్లాదేశ్ చెరలో మత్స్యకారులు

- భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన 8 మంది

ప్రజాశక్తి - పూసపాటిరేగ
విజయనగరం జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు బంగాళాఖాతంలో వేట చేస్తుండగా బంగ్లాదేశ్ సముద్రంలోనికి పొరపాటున వెళ్లారు. దీంతో బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డులు మత్సకారులతో పాటు వారి బోటను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి మత్సకారులు బంధువులు తెలిపిన వివరాల మేరకు.. భోగాపురం మండలంలోని కొండరాజపాలేంకు చెందిన సూరాడ అప్పలకొండ, మారుపల్లి చిన్నప్పన్న, మారుపల్లి చిన్నప్పన్న, మారుపల్లి ప్రవీణ్, మారుపల్లి రమేష్, సురపతి రాము, పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలసకు చెందిన వాసుపల్లి సీతయ్య, నక్కా రమణ ఈ నెల 13న విశాఖపట్నం నుండి సముద్రంలో వేటకు వెళ్లారు. సముద్ర జలాల్లో వేటాడుతుండగా బంగ్లాదేశ్ జలాల్లోకి పొరపాటున వెళ్లారు. దీంతో వారిని బంగ్లాదేశ్ కోస్టుగార్డులు అదుపులోకి తీసున్నారు. తమను కోస్ట్‌గార్డ అదుపులోకి తీసుకున్నారని, సమీపంలో వేరొక బోటులో ఉన్న సభ్యులకు వాకీటాకీలో మత్స్యకారులు సమాచారం అందించారు. వారు వెంటనే బంధువులకు, అధికారులకు సమాచారం తెలియజేశారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

అండగా ఉంటాం

బాధిత కుటుంబాలను ఏపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగారాజు పరామర్శించారు. ఆందోళన చెందొద్దని, మంత్రులు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడానని తెలిపారు. వారు కేంద్ర మత్స్యశాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి సురక్షితంగా ఇంటికి తీసుకువస్తామంటూ హామీ ఇచ్చారని బంగార్రాజు చెప్పారు.

ఎసిబి డైరెక్టర్ జనరల్ లేఖపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంది? : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి
గత వైసిపి ప్రభుత్వంలో కాకినాడ జిల్లా పరిధిలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద భూసేకరణ అక్రమాలపై విచారణకు అనుమతి కోరుతూ ఎసిబి డైరెక్టర్ జనరల్ రాసిన లేఖపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందో చెప్పాలని హైకోర్టు కోరింది. అక్రమాలు, ఇళ్ల స్థలాలను మెరక చేయడం, స్థలాలను చదును చేయడం, లేఅవుట్ల పేరుతో అక్రమాలు జరిగాయనే వ్యవహారంపై విచారణకు అనుమతి కోరుతూ ఎసిబి డైరెక్టర్ జనరల్ లేఖ రాశారు. దీనిపై వివరణ ఇవ్వాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఎసిబి విచారణకు అనుమతినిచ్చారో లేదో చెప్పాలని కోరింది. విచారణను 2026 ఫిబ్రవరి 4కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలో 5 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు జరిగిన భూసేకరణలో అక్రమాలు జరిగాయంటూ గడిమోగ గ్రామస్తుడు పివి భద్రరావు పిల్ దాఖలు చేశారు. దీనిపై అధికారులకు గతేడాది ఏప్రిల్‌లో వినతిపత్రం ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఇందులో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కాంట్రాక్టర్ కాటంశెట్టి వెంకట రమణమూర్తి ఇతరులను ప్రతివాదులుగా చేర్చారు.

తాగునీటి కోసం రాస్తారోకో

గుంతకల్లు ఎమ్మెల్యేను అడ్డుకున్న మహిళలు

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- సిపిఎం, ఐద్వా మద్దతు

గుంతకల్లు ఎమ్మెల్యేను అడ్డగించిన ఆందోళనకారులు

ప్రజాశక్తి - ఆలూరు (కర్నూలు)
తాగునీటి కోసం కర్నూలు జిల్లా ఆలూరులోని వడ్డే వీధి మహిళలు రోడ్డెక్కారు. 167వ జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. దీంతో, ఆదోని, బళ్లారి, గుంతకల్లు రహదారిపై భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పలువురు మహిళలు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆలూరు ప్రాంతానికి తాగునీరు అందించడంలో విఫలం చెందారని విమర్శించారు. 20 రోజులైనా తాగునీరు రాకపోతే ఏం తాగాలని ప్రశ్నించారు. తాగునీరు వదలాలని అడిగితే లైన్‌మెన్ దురుసుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదలబోమని భీష్మించుకున్నారు. రాస్తారోకో సమయంలో ఆలూరు మాజీ ఎమ్మెల్యే, గుంతకల్లు ప్రస్తుత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కాన్వాయ్ బళ్లారి వైపు వెళ్తుండగా మహిళలు అడ్డగించారు. పదేళ్ల ఆలూరు ఎమ్మెల్యేగా ఉండి నీరందించేందుకు ఏం చేశారని ప్రశ్నించారు. 'నేను మీ ఎమ్మెల్యేను కాను.

గుంతకల్లు ఎమ్మెల్యేను' అంటూ జయరామ్ తెలిపారు. 'ఏ ఎమ్మెల్యే అయితే ఏంటి? ఆలూరులో ఉన్నారా..? లేరా? అని మహిళలు ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మహిళలు ఆగ్రహించారు. అధికారులు వచ్చి హామీ ఇచ్చిన తర్వాతే రాస్తారోకో విరమిస్తామని రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆందోళన వద్దకు చేరుకుని...మళ్లీ ఇలాంటి సమస్య రాకుండా చూస్తామని హామీఇచ్చారు. ఎవరో వచ్చి ఏదో చేస్తామంటే కుదరదని, చేసే వారు అప్పుడే చేయాలని మహిళలు భీష్మించారు. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మల్లికార్జున, ఎఇ రామ్‌లీల, పంచాయతీ కార్యదర్శి జిలానీబాషను ఆందోళన వద్దకు పిలిపించారు. లైన్‌మెన్ నిర్లక్ష్యం వల్ల సమస్య ఏర్పడిందని, గురువారం తాగునీరు వదులుతామని అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఆందోళనకు సిపిఎం నాయకులు పి.హనుమంతు, షాకీర్, ఈరన్న, ఐద్వా నాయకులు షేకున్‌బీ, రాధమ్మ మద్దతు తెలిపారు.

'బలిమెల'పై ఆంధ్ర, ఒడిశా అధికారుల సమావేశం

- నీటి నిల్వలు, వినియోగంపై నిర్ధారణ, అంగీకారం

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి జిల్లా)
ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వల వినియోగంపై ఇరు రాష్ట్ర అధికారులు బుధవారం ఒడిశా రాష్ట్రం బలిమెల హైడ్రో ప్రాజెక్టు సీనియర్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జులై 2025 నుంచి సెప్టెంబర్ 2025 వరకూ ఆంధ్రా తన వాటాగా బలిమెల నుంచి 13.4779 టిఎంసిల నీటిని, ఒడిశా 29.3432 టిఎంసిల నీటిని వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్ర అధికారులు లెక్కలు తేల్చారు. ఆంధ్ర కంటే ఒడిశా ఇప్పటివరకూ 15.8653 టిఎంసిల నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెలలో 79.9800 టిఎంసిలు, జోలాపుట్‌లో 30.3128 టిఎంసి నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు జలాశయాల్లో మొత్తం 105.2928 టిఎంసి నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఈ నెలాఖరుకు బలిమెల జలాశయంలో అదనంగా ఐదు టిఎంసిలు, జోలాపుట్‌లో మరో మూడు టిఎంసిల నీటి నిల్వలు చేరుతాయని అధికారులు లెక్కలు కట్టారు. దీని ప్రకారం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో మొత్తం 113.2928 టిఎంసిల నీటి నిల్వలు ఈ నెల చివరికి చేరుతాయని అంచనా వేశారు. ఇందులో ఆంధ్రా వాటా 64.5790 టిఎంసిలు, ఒడిశా వాటా 48.7138 టిఎంసిలుగా ఇరురాష్ట్ర అధికారులు పంపకాలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం విద్యుదుత్పత్తి, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్రా 1,500 క్యూసెక్కులు, ఒడిశా 3,700 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాలు అంగీకారం కుదుర్చుకున్నాయి.

కార్యక్రమంలో ఆంధ్ర తరపున సివిల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి ఇఇ రత్నకుమార్, ఎఇఇ సిహెచ్ సురేష్, ఒడిశా తరపున బలిమెల సీనియర్ జనరల్ మేనేజర్ దిలీప్‌కుమార్ స్వైన్, బలిమెల టెక్నికల్ వింగ్ హెడ్ జనరల్ మేనేజర్ అక్షయ్ కుమార్ సాహూ, జనరేషన్ డివిజన్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాష్ నాయక్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కైనిస్ బెహరా, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుభదీప్ పాండా, చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ శివప్రసాద్ పాణిగ్రాహి, ఎర్త్ డామ్ ఎస్ఇ రమాకాంత్‌పాత్రో, ఎఇఇలు గడదర్ ప్రధాన్ కేసీ పాణి పాల్గొన్నారు.

'సైరాబాను'ను కస్టడీకి తీసుకున్న ఎన్ఐఎ

- కడప నుంచి విజయవాడకు తరలింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి
అన్నమయ్య జిల్లా రాయచోటిలో జులై ఒకటిన అరెస్టు చేసిన ఉగ్రవాది అబూబకర్ భార్య సైరాబానును ఎన్ఐఎ కస్టడీకి తీసుకుంది. బుధవారం ఎన్ఎఇ అధికారులు ఉగ్రవాది భార్యను పీటీ వారెంట్‌పై విచారించడంలో భాగంగా కస్టడీకి తీసుకున్నారు. అనంతరం విజయవాడకు తరలించారు.

ఈ ఏడాది జులై ఒకటిన తమిళనాడు ఐబి పోలీసులు జిల్లా కేంద్రమైన రాయచోటిలో తలదాచుకున్న ఉగ్రవాదులు అబూబకర్, మహమ్మద్ అలీలను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో అప్పట్లోనే ఉగ్రవాదుల భార్యలైన సైరాబాను, షమీంలను సైతం అరెస్టు చేశారు. అప్పటి నుంచి వీరిద్దరూ కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

పిపిపి అంటే ప్రజలకు కీడు.. కార్పొరేట్లకు మేలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం
- ఏలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద సంతకాల సేకరణ

ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసనలో మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయడం అంటే కార్పొరేట్లకు మేలు, ప్రజలకు కీడు చేయడమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం అన్నారు. మెడికల్ కాలేజీలను పిపిపి విధానం పేరుతో ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ సిపిఎం, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణం, తణుకులో ప్రభుత్వాస్పత్రులు, పలు కూడళ్ల వద్ద ప్రజల నుండి సంతకాలు సేకరించి ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య తొలి సంతకం చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ పెట్టుబడితో నిర్మించిన మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించాల కోరారు. పిపిపి విధానం కారణంగా రిజర్వేషన్ అర్హత కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి విద్యార్థులు నష్టపోతారన్నారు. విద్యవైద్య రంగాలను ప్రభుత్వమే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రవి, డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య మాట్లాడారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్, పిల్లి రామకృష్ణ, నగర కార్యదర్శి పంపన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ విరమించుకోవాలి

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిర్వహించిన సంతకాల సేకరణలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్ మాట్లాడుతూ ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీని నెరవేర్చాల కోరారు. ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గంట సుందర్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ప్రసాద్ మాట్లాడారు. తణుకులో సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రతాప్ మాట్లాడారు. ఇరగవరం మండల కేంద్రంలో సంతకాల సేకరణలో గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడారు.

లక్ష్మీనాయుడు భార్యకు చెక్కును అందజేస్తున్న మంత్రి నారాయణ

లక్ష్మీనాయుడు కుటుంబానికి ఆర్థికసాయం

- చెక్కులను పంపిణీ చేసిన మంత్రి నారాయణ

ప్రజాశక్తి - నెల్లూరు
నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ మేరకు లక్ష్మీనాయుడు భార్య సుజాతకు రూ.ఐదు లక్షలు, కుమార్తెలు లహన్వి శ్రీ, తన్వి శ్రీలకు రూ.ఐదు లక్షల చెక్కును మంత్రి నారాయణ అందజేశారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. లక్ష్మీనాయుడు కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు ఆరు ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బ తగిలి చికిత్స పొందుతున్న తిరుమల శెట్టి పవన్ కుమార్‌కు రూ.ఐదు లక్షలు, నాలుగు ఎకరాల భూమిని పంపిణీ చేస్తామన్నారు. గాయలతో బాధపడుతున్న తిరుమల శెట్టి భార్గవ నాయుడుకు రూ.మూడు లక్షలు చెల్లించామని చెప్పారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సుజాత మాట్లాడుతూ.. ఇది కేవలం వ్యక్తిగత కక్షలతోనే హత్య జరిగిందని, రాజకీయ అంశాలు ఏమీ లేవని తెలిపారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స

బల్క్ డ్రగ్ ఉద్యమానికి అండగా నిలుస్తాం

- కేసులకు భయపడొద్దు.. అధికారంలో రాగానే ఎత్తివేస్తాం
- చలో రాజయ్యపేటలో వైసిపి మాజీ మంత్రులు

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)
అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో మత్స్యకారులు తలపెట్టిన బల్క్ డ్రగ్ ఉద్యమానికి అండగా నిలుస్తామని వైసిపి నాయకులు మద్దతు ఇచ్చారు. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు రాజయ్యపేటలో తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు సంఘీభావం తెలిపేందుకు బుధవారం వైసిపి శ్రేణులు చలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్టాయి. శాసనమండలి ప్రతిపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు తరలివచ్చి మత్స్యకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకే పరిశ్రమలు ఏర్పాటు చెయ్యాలన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు వల్ల ఉపాధి, ఉనికి పోతుందని మత్స్యకారులు ఆందోళన చేస్తుంటే, ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకు వెళ్లాలని చూస్తే ప్రజలపక్షాన నిలబడి, రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హోంమంత్రి వంగలపూడి అనిత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పరిశ్రమ ఏర్పాటు వల్ల కాలుష్యం, మత్స్యకారుల అనారోగ్య సమస్యల గురించి మాట్లాడారని, ఇప్పుడు మత్స్యకారులకు అండగా ఎందుకు నిలవలేదని ప్రశ్నించారు. కేసులకు, పోలీసుల ఆంక్షలకు భయపడవద్దని, 2029లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, కేసులు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

అవసరమైతే మత్స్యకారులకు సంఘీభావం తెలిపేందుకు జగన్ వస్తారని చెప్పారు. వైసిపి చలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్టడంతో పోలీసు బలగాలను మొహరించారు. నక్కపల్లి నుండి రాజయ్యపేట వరకు పలు జంక్షన్ల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. రాజయ్యపేట వెళ్లేందుకు 48 మంది వైసిపి నాయకులకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు.

విశాఖ కలెక్టరేట్‌లో పుస్తక మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తదితరులు

అనకాపల్లిలో 28 నుండి పుస్తక మహోత్సవం

- పోస్టర్ ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)
అనకాపల్లిలో ఈ నెల 28 నుండి నవంబర్ ఐదవ తేదీ వరకు పుస్తక మహోత్సవం జరగనుంది. ఈ మహోత్సవ పోస్టర్‌ను విశాఖ కలెక్టరేట్‌లో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్రం విడిపోయి, కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత, అన్ని జిల్లాల్లో సాహిత్య, సాంస్కృతిక, సైన్సు ప్రదర్శనలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మొదటిసారి అనకాపల్లి జిల్లాలో పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్నామని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె లక్ష్మయ్య తెలిపారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (విబిఎఫ్ఎస్), రాష్ట్ర సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ పరిషత్ సహకారంతో 35 సంవత్సరాలుగా పుస్తక మహోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో వందమంది ప్రచురణకర్తల పుస్తకాలు తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిరోజూ సాహిత్య, సాంస్కృతిక, సైన్సు ప్రదర్శనలు, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శన జరిగే పది రోజులు సాహిత్యం, పుస్తకాలు, గ్రంథాలయాలు, విద్యా విధానం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. అనకాపల్లి జిల్లా ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

దస్తగిరిని బెదిరించిన కేసులో విచారణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిటెక్ రవి

ప్రజాశక్తి - కడప
మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని బెదిరించిన ఘటనపై బుధవారం అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి 2023 నవంబర్ 28న కడప జైలులో దస్తగిరిని బెదిరించినట్లు కేసు నమోదైంది. తమకు అనుకూలంగా సాక్ష్యం చెబితే రూ.20 కోట్లు ఇస్తామని చైతన్యరెడ్డి ప్రలోభపెట్టారని, మాట వినకపోవడంతో బయటకొచ్చాక చంపేస్తామని ఆయన బెదిరించినట్లు పోలీసులకు దస్తగిరి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణకు కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో కడప జైలులో మూడోసారి ఈ కమిటీ విచారణ చేపట్టింది. ఈ విచారణకు దస్తగిరి, ఆయన భార్య షబానా, పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి హాజరయ్యారు. దస్తగిరిని చైతన్యరెడ్డి బెదిరించే సమయంలో ఓ కేసులో రిమాండ్ ఖైదీగా బిటెక్ రవి ఉండటంతో ఆయన్ను విచారణకు పిలిచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

ఆ రోజే అధికారిని ప్రశ్నించాను : బిటెక్ రవి

దస్తగిరి బ్యారక్‌లోకి చైతన్యరెడ్డి వెళ్లడాని తాను చూశానని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి తెలిపారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దస్తగిరిని బెదిరించిన సమయంలో వేరే కేసులో అదే జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నందున విచారణకు హాజరయ్యానన్నారు. దస్తగిరి బ్యారక్‌లోకి నిందితుడి కుమారుడిని ఎలా పంపిస్తారని ఆ రోజే జైలు అధికారి ప్రకాష్‌ను ప్రశ్నించానని చెప్పారు. నేను చెప్పిన విషయాన్ని అధికారులు పట్టించుకోలేదన్నారు. కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ విచారించి నా వాంగ్మూలం తీసుకున్నారని, ఆ రోజు అక్కడ జరిగిన విషయాలన్నీ చెప్పానని తెలిపారు.

ఛాంపియన్‌గా నిలిచిన చిత్తూరు జిల్లా జట్టు

స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాలికల ఫ్రీస్టైల్ కుస్తీ ఛాంప్ చిత్తూరు

- తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ, తృతీయ స్థానాలు

ప్రజాశక్తి - విజయవాడ స్పోర్ట్స్
స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాలికల ఫ్రీ స్టైల్ కుస్తీ ఛాంపియన్‌గా చిత్తూరు జిల్లా జట్టు నిలిచింది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు రెండు, మూడు స్థానాలను సాధించాయి. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎపిఎస్‌జిఎఫ్), సమగ్ర శిక్ష (ఎస్ఎస్), ఎన్‌టిఆర్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న అశోక ఫంక్షన్ హాల్‌లో మూడు రోజులపాటు 69వ స్కూల్ గేమ్స్ అండర్ - 19 అంతర్ జిల్లాల కుస్తీ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహిస్తోంది. బాలికల విభాగం పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలికల జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. మూడు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకాలతో ఆ జట్టు 22 పాయింట్లు పొందింది. 17 పాయింట్లతో తూర్పు గోదావరి జిల్లా జట్టు రెండో స్థానం, పశ్చిమ గోదావరి జట్టు మూడో స్థానం సాధించాయి. బాలుర, బాలికల విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి మొత్తం 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వ్యక్తిగత బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు చిటికిన రమేష్, ఎపి రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి భూషణం, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి శ్రీలత, పోటీల సాంకేతిక అధికారి పి ఆనంద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు టి విజయ వర్మ, ఎస్ రమేష్, ఎంవి సత్య ప్రసాద్, నున్న పాఠశాల హెచ్‌ఎం సూరపనేని రవి ప్రసాద్, పలువురు కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

జెడిఎ కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొన్న రైతులు, నాయకులు

సబ్సిడీపై పప్పుశనగ విత్తనం పంపిణీ చేయాలి

- జెడిఎ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
అనంతపురం జిల్లాలోని రైతులకు 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యవసాయ శాఖ జెడి కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.రామిరెడ్డి మాట్లాడుతూ... గత సంవత్సరం రబీలో సాగు చేసిన పంటలను పూర్తిగా నష్టపోయారని, కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పుల ఊబిలో రైతులు కూరుకుపోయారన్నారు. 40 శాతం సబ్సిడీని 25 శాతానికి తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

బయట మార్కెట్‌లో పప్పు శనగ రూ.5800 నుంచి రూ.ఆరు వేల వరకు ఉందన్నారు. కానీ ప్రభుత్వం రూ.7800 ధర నిర్ణయించి 25 శాతం సబ్సిడీ ఇస్తామనడం రైతులకు అన్యాయం చేసినట్లేనని తెలిపారు. 25 శాతం సబ్సిడీ సవరించి 90 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం నష్టపోయిన రైతులకు పంటనష్టపరిహారం ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సంపాదకీయం

తీవ్ర ఆందోళనకరం

దేశ రాజధాని నగరం ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) బుధవారం ఉదయం విడుదల చేసిన నివేదిక ప్రకారం కాలుష్య కారక సూక్ష్మ కణాల స్థాయి (పిఎం 2.5) గడిచిన ఐదేళ్ల కాలంలోనే అత్యధికంగా నమోదైంది. దీపావళి తరువాత 24 గంటల్లో సగటు పిఎం2.5 సాంద్రత ఒక క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రో గ్రాములకు చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) నిర్దేశించిన భద్రతా పరిమితికి దాదాపు 60 రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ నగరమంతా ఒక రకమైన భయానక వాతావరణం నెలకొంది. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడగా అత్యవసరమైన పనులుంటేనే ఇళ్ల నుండి బయటకు రావాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి తీవ్రత బోధ పడుతుంది. అనివార్య పరిస్థితుల్లో జాతీయ రాజధాని పరిధి (ఎన్‌సిఆర్) లోని ఢిల్లీ నగరమంతా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి-2) నిబంధనలను అమలులోకి తీసుకువచ్చి సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యుఎం) రంగంలోకి దింపాల్సి వచ్చింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రజానీకం శ్వాసకోస సమస్యలతో ఆసుపత్రుల ముందు బారులు తీరుతున్నారు. వీరిలో వృద్ధులు, పసిపిల్లలు ఎక్కువగా ఉన్నారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సిపిసిబి తాజాగా చేసిన విశ్లేషణ ప్రకారం దీపావళి తరువాత సగటు పిఎం2.5 స్థాయి ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది.

అయితే, గత ఐదేళ్ళ కాలంలో ఈ స్థాయిలో పెరుగుదల లేదు. 2021లో 454.5, 2022లో 168, 2023లో 319.7, 2024లో 220 మైక్రోగ్రాములుగా మాత్రమే నమోదైంది.

నిజానికి, దీపావళికి ముందే ఈ ఏడాది దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రంగా నమోదైంది. అయినా, అత్యున్నత న్యాయస్థానం ముందు జరిగిన విచారణలో ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఢిల్లీలో టపాసుల అమ్మకాల మీద నిషేధాన్ని ఎత్తివేయించేందుకు శక్తివంచన లేకుండా పాటుపడ్డాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పండగపూట టపాసులు కాల్చనీయకుండా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపించిన బిజెపి నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధంగా వ్యవహరించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కూడా దీపావళిని దీపాలతో సరిపెడితే ఎలా అని బాహాటంగానే ప్రశ్నించారు. కేంద్రంతో పాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ వైఖరితో గ్రీన్‌క్రాకర్స్ అమ్మకాలకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. గత ఏడాది ఆప్ ప్రభుత్వం దీపావళికి కొద్దిరోజుల ముందు అన్ని రకాల బాణాసంచా విక్రయాలపై నిషేధం విధించినా, ఆ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగిదంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ మతమూ వాతావరణాన్ని కలుషితం చేయమని చెప్పదని, ప్రాథమిక హక్కుయైన ఆరోగ్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వాలు కాపాడి తీరాలని అప్పట్లో స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం తాజాగా దానినుండి వైదొలగడం గమనార్హం.

సుప్రీంకోర్టు గ్రీన్ క్రాకర్స్‌కే అనుమతి ఇచ్చినప్పటికీ ఆ పేరుతో అన్ని రకాల బాణాసంచా ఢిల్లీ నగరంలోకి ప్రవేశించింది. కొన్ని పరిమిత గంటల్లోనే బాణాసంచా కాల్చడానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన అనుమతి సైతం ఆచరణలో అమలు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు చేయి దాటే ప్రమాదం కనపడుతుండటంతో సాక్షాత్తు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో పాటు ప్రభుత్వంలోని మరికొందరు పంజాబ్ రైతులను గడ్డి తగలపెట్టేలా ఆప్ నేతలు ఒత్తిడి చేశారని, దాని ఫలితంగానే ఢిల్లీలో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించడం దుర్మార్గం. ప్రజలను చీల్చి లబ్ధి పొందే ఎత్తుగడలు కాషాయదళానికి కొత్త కాకపోయినప్పటికీ, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశాలను కూడా ఇలా వాడుకోవడం దారుణం. ఢిల్లీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా శాశ్వత ప్రాతిపదికన సమగ్ర చర్యలు చేపట్టాలి, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. లేని పక్షంలో దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య రాజధానిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

మంచి మాట



నిరసన తెలపడం
నీ కర్తవ్యం అయినప్పుడు
మౌనంగా వుండడం పాపం.
- అబ్రహం లింకన్,
అమెరికా పూర్వ అధ్యక్షుడు.

Abraham Lincoln

అమెరికా ప్రజాగ్రహం 'నో కింగ్స్'

అంతర్జాతీయం

వి. రాంభూపాల్

'ప్రజాస్వామ్యం రాచరికం కాదు' నినాదాలతో ఈ నెల 18వ తేదీ యావత్ అమెరికా హోరెత్తిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదని, అమెరికా భూతల స్వర్గమని, అక్కడ ఉద్యమాలకు స్థానం లేదని చేస్తున్న ప్రచారం బూటకమని తేలిపోతున్నది. ముఖ్యంగా 2008 సంక్షోభం అమెరికా మేడిపండు అని రుజువుచేసింది. 2011 వాల్‌స్ట్రీట్ ముట్టడి, 2020లో నల్లజాతీయుడు జార్జి ఫ్లాయిడ్ హత్య, పాలస్తీనా సంఘీభావ కార్యక్రమాలు అమెరికా ప్రజాగ్రహానికి ప్రతిరూపాలు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రత్యామ్నాయం కోసం విశ్వవిద్యాలయాలు వేదికలవుతున్నాయి. వేమూరి మేఘన లాంటి అనేకమంది గొంతు విప్పుతున్నారు.

తాజాగా 18వ తేదీన అమెరికాలోని మొత్తం 50 రాష్ట్రాల్లో 2,700 ప్రాంతాల్లో సుమారు 70 లక్షల మంది 'నో కింగ్స్' ప్లకార్డులు, బ్యానర్లు, హోర్డింగులతో అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 250 సంవత్సరాల దేశ చరిత్రలో ఇది అతి పెద్ద శాంతియుత ప్రదర్శన. 'మేము అమెరికాను ప్రేమిస్తున్నాము కాబట్టి ఇక్కడ ఉన్నాము' అని ఈ ప్రదర్శనలకు నాయకత్వం వహించిన బెర్నీ సాండర్స్ ప్రకటించారు. ఈ ప్రదర్శనలు ఒక్క అమెరికాకే పరిమితం కాలేదు. కెనడా, జపాన్, ఇంగ్లాండ్, మెక్సికో, బెర్లిన్, రోమ్, దక్షిణాఫ్రికా, పారిస్, స్వీడన్, ఐర్లాండ్, ఫిన్లాండ్, ఇటలీతో సహా 22 దేశాలలో ఈ ప్రదర్శనలు జరిగాయి. వివిధ దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల వద్ద జరిగిన నిరసనల్లో వందల సంఖ్యలో పాల్గొన్నారు. ప్రపంచాధిపత్యం కొనసాగించాలని, అన్ని దేశాల వాణిజ్యాలు, విదేశీ వ్యవహారాలు తన నియంత్రణలో వుండాలని ఉవ్విళ్లూరుతున్న ట్రంప్‌నకు అమెరికన్ల నుండే గట్టి ప్రతిఘటన ఎదురైంది. ఇప్పటికైనా మన దేశ పాలకులు ట్రంప్ ఒత్తిళ్లను ధీటుగా ఎదుర్కోవాలి. దేశ ఆర్థికాభివృద్ధికి, సార్వభౌమత్వ పరిరక్షణకు తోడ్పడే విధానాలను అనుసరించాలి.

'నో కింగ్స్' అంటే...?

అమెరికాలో గత కొంత కాలంగా జరుగుతున్న ఉద్యమాలకు ట్రంప్ కొంత కారణమైనా, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క సంక్షోభ తీవ్రత అసలు కారణాలు. ఈ సంవత్సరం జనవరిలో రెండవసారి డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చెపట్టారు. ఆయనకు అత్యంత సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు వైట్‌హౌస్‌లో ప్రత్యేక పీట వేసి ఉభయులు కలిసి వేలాది మంది ఉద్యోగులను తొలగించారు. పౌరసత్వం, ట్రాన్స్‌జెండర్ల రక్షణ, అక్రమ వలసల అంశాల్లో అనేక మార్పులు చేశారు. వలసదారులపై పెద్ద ఎత్తున వేధింపులు పెంచారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు అమెరికా ఆర్థిక స్థితిని పునరుద్ధరించకపోగా మరింత దిగజార్చారు. ఆ దేశ కార్పొరేట్ కంపెనీల, ఆర్థిక సంస్థల ప్రయోజనాలు కాపాడేందుకు ట్రంప్ చేస్తున్న ప్రకటనలు, తీసుకుంటున్న నిర్ణయాలు రాజరికాన్ని తలపిస్తున్నాయి. వీటిని ప్రపంచ దేశాల ప్రజలే కాదు. అమెరికా ప్రజలు కూడా అంగీకరించడంలేదు. మన ప్రధాని లాగే తాను దైవ కార్యం కోసం జన్మించానంటూ చెప్పుకున్నాడు. రాజ్యాంగంలో లేని అధికారాలను చెలాయిస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాశాడు. రాష్ట్ర గవర్నర్ల అభ్యంతరాలను ఖాతరు చేయడంలేదు. ఈ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమాన్ని 'నో కింగ్స్' పేరుతో పిలుస్తున్నారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడరల్ రిజర్వు బ్యాంకు (మన రిజర్వ్ బ్యాంకు లాంటిది)ను ఒత్తిడి తెచ్చాడు. అందుకు అంగీకరించని బోర్డు సభ్యులను ఏకపక్షంగా తొలగించాడు. ఫెడరల్ బ్యాంకు స్వయంప్రతిపత్తికి భిన్నంగా ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం చెల్లదని అక్కడి కోర్టు తీర్పు ఇచ్చింది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల పట్ల ఫిబ్రవరి 17, ఏప్రిల్ 19న అనేక ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. అమెరికా ఆర్మీ 250వ వార్షికోత్సవ పరేడ్ జరిగే రోజు, ట్రంప్ 79వ పుట్టినరోజు అయిన జూన్ 14న 50 రాష్ట్రాల్లో 50 ప్రదర్శనలు చేయాలని "50501" (అంటే 50 రాష్ట్రాలలో 50 నిరసనలు, 1 ఉద్యమం) అనే బృందం పిలుపునిచ్చింది. ఈ పిలుపునకు ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చింది. అప్పటి నుండి 50501, థర్డ్ యాక్ట్ మూవ్‌మెంట్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్, సోషల్ సెక్యూరిటీ వర్కర్స్, కమ్యూనికేషన్స్ వర్కర్స్ ఆఫ్ అమెరికా, అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, పబ్లిక్ సిటిజన్, మూవ్ ఆన్ వంటి 200 గ్రూపులతో ఏర్పడిన విశాల వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 18న జరిగిన 'నో కింగ్స్' ప్రదర్శనలు ఆ దేశ చరిత్రలోనే అతి పెద్దవి. ట్రంప్ పరిపాలనా విధానాలను, ఆయన అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం తమ లక్ష్యాలుగా ఈ ఉద్యమ నిర్వాహకులు ప్రకటించారు.

ఈ నెల 18న అమెరికాలోని ప్రధాన నగరాలన్నింటిలో భారీ సంఖ్యలో జనం రోడ్లపైకి వచ్చారు. "ప్రజాస్వామ్యం రాచరికం కాదు", "రాజ్యాంగం నీ స్వంతం కాదు" వంటి నినాదాలు హోరెత్తాయి. మన దేశ పాలకుల లాగే అక్కడ కూడా ఈ ప్రదర్శనకారులను 'అమెరికా వ్యతిరేకులని', 'దేశ ద్రోహులని' 'వామపక్షీయులని' నిందలు మోపారు. ట్రంప్ అనుకూల మీడియా "ద్వేషపూరిత అమెరికా ర్యాలీ" అంటూ విషం కక్కారు. అనేక రాష్ట్రాల్లో పోలీసులు, సైన్యం పెద్ద ఎత్తున మోహరించినా ఏ మాత్రం ఖాతరు చేయకుండా లక్షల మంది ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

> **మతం, జాతి పేరుతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టడం ఎల్లకాలం సాగదని అమెరికా అనుభవం చెబుతుంది. నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు ప్రజా ఉద్యమాలకు కారణమవుతాయి. మతతత్వాన్ని రెచ్చగొట్టి కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని దోచిపెడుతున్న మన దేశ పాలకులకు అమెరికా ప్రజాగ్రహం గుణపాఠం కావాలి. ప్రజాస్వామ్యంలో రాజరికానికి, మతోన్మాదానికి చోటు లేదని గుర్తించాలి.**

అమెరికా ఆర్థిక వ్యవస్థ

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన అనుకూల పరిస్థితులను ఉపయోగించుకుని సుమారు ఏడు దశాబ్దాలకు పైగా అమెరికా ఆర్థికంగా, సైనికంగా అగ్రరాజ్యంగా కొనసాగింది. రష్యాలో సోవియట్ ప్రభుత్వం కూలిపోవడంతో ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ లను ఉపయోగించుకుని ప్రపంచ దేశాలను తీవ్రంగా దోచుకుంది. అంతులేని లాభాపేక్షతో ఆధునిక సాంకేతికతతో కార్మికుల శ్రమను చౌకగా దోచుకుని ప్రపంచ ప్రజల కొనుగోలు శక్తిని తీవ్రంగా దెబ్బతీసింది. ఈ పరిస్థితి అనేక దేశాల్లో సంక్షోభాలకు కారణమైంది. ఈ సంక్షోభ భూతం అమెరికాలోనే ముందుగా తిష్టవేసింది. ఆ దేశంలోని 4వ అతి పెద్ద బ్యాంకు లెమాన్ బ్రదర్స్ రూ.29,43,400 కోట్ల అప్పుల్లో కూరుకుపోవడం, వాషింగ్‌టన్ మ్యూచువల్, వాకోవియా, మోర్గాన్ స్టాన్లీ, ఫ్రెడ్డీ మాక్ లాంటి దిగ్గజ అమెరికా ఆర్థిక సంస్థలు దివాలా తీశాయి. వీటిని రక్షించేందుకు 700 బిలియన్ డాలర్ల 'బెయిల్ అవుట్' ప్యాకేజీలు ఇచ్చింది. 2008 దేశ బడ్జెట్‌లో రూ.86,40,000 కోట్లు (1.8 ట్రిలియన్ డాలర్లు) కేటాయించింది. దీంతో ఆర్థిక అసమానతలు మరింత తీవ్రమయ్యాయి. 2011 ఆగస్టులో 'మేము 99 శాతం, మీరు ఒక్క శాతం' అంటూ వాల్‌స్ట్రీట్ ఉద్యమం వచ్చింది.

ట్రంప్ అధికారంలోకి వచ్చే నాటికి ఆ దేశ ఆర్థికాభివృద్ధి వేగంగా దిగజారింది. 2021లో 6.2 శాతం వున్న ఆర్థికాభివృద్ధి 2022లో 2.5, 2023లో 2.9, 2024లో 2.8, 2025లో 2 శాతంతో కొట్టుమిట్టాడింది. 2021లో 4.4 శాతం వున్న పారిశ్రామిక ఉత్పత్తి 2022లో 3.4, 2023లో 0.2, 2024లో 0.3 శాతానికి పడిపోయింది. అమెరికన్ పెట్టుబడిదారులు ఆ దేశంలో పెట్టుబడులు పెట్టడం తగ్గించేశారు. సేవా రంగంలోకి ప్రవేశించిన కార్పొరేట్ దిగ్గజాలు అమెరికా బయట ఐ.టి నిపుణుల శ్రమను చౌకగా కొల్లగొట్టి బలపడగా, అమెరికా బలహీనపడింది. కరెంట్ అకౌంట్ బ్యాలెన్స్ లోటు పెరిగిపోయింది. 2020లో 593 బిలియన్ డాలర్ల లోటుతో వున్న ఆ దేశ ఆర్థిక పరిస్థితి 2021లో 859, 2022లో 993, 20223లో 928, 2024 నాటికి 1,185 బిలియన్ డాలర్ల లోటుకు చేరింది. అమెరికా ప్రభుత్వ అప్పు ఆ దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 121 శాతానికి పెరిగి ప్రపంచంలో అతి పెద్ద రుణగ్రస్త దేశంగా మారింది. ఈ పరిస్థితులకు మూలమైన కారణాలను పరిష్కరించకుండా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే జాత్యహంకార ప్రకటనలు, సామ్రాజ్యవాద దురహంకార నిర్ణయాలతో ప్రపంచాన్ని తన ఆధిపత్యంలో వుంచుకోవాలని ట్రంప్, ఆయన వెనుక వున్న కార్పొరేట్ సంస్థలు నిర్ణయించుకున్నాయి.

> **తాము సృష్టించిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలకు తామే ఇప్పుడు అడ్డు తగులుతున్నారు. 'అన్నీ మాకే, అన్నింటా మేమే ముందు' అంటూ అమెరికన్ కంపెనీల మాటలనే ట్రంప్ వల్లె వేస్తూ 'మన దేశ ఉద్యోగాలన్నీ మనకే, అధిక సుంకాలతో మన దేశాన్ని దోచుకున్నార'ని అమెరికన్లను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. వీసా సాకుతో విదేశీ ఉద్యోగులకు సంకెళ్ళు వేసి తరిమేశాడు. ఈ చర్యలు అమెరికా ప్రజలను సంతృప్తిపరచకపోగా ఆగ్రహాన్ని పెంచాయి. అందుకే ఆ దేశ ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నారు. 'నువ్వు రాజువు కాదు, మేము ఎన్నుకున్న సేవకుడివి' అంటూ గర్జిస్తున్నారు.**

తాము సృష్టించిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలకు తామే ఇప్పుడు అడ్డు తగులుతున్నారు. 'అన్నీ మాకే, అన్నింటా మేమే ముందు' అంటూ అమెరికన్ కంపెనీల మాటలనే ట్రంప్ వల్లె వేస్తూ 'మన దేశ ఉద్యోగాలన్నీ మనకే, అధిక సుంకాలతో మన దేశాన్ని దోచుకున్నారని' అమెరికన్లను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. వీసా సాకుతో విదేశీ ఉద్యోగులకు సంకెళ్ళు వేసి తరిమేశాడు. ఈ చర్యలు అమెరికా ప్రజలను సంతృప్తిపరచకపోగా ఆగ్రహాన్ని పెంచాయి. అందుకే ఆ దేశ ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నారు. 'నువ్వు రాజువు కాదు, మేము ఎన్నుకున్న సేవకుడివి' అంటూ గర్జిస్తున్నారు.

మన పాలకులు గుర్తించాలి

మతం, జాతి పేరుతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టడం ఎల్లకాలం సాగదని అమెరికా అనుభవం చెబుతుంది. నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు ప్రజా ఉద్యమాలకు కారణమవుతాయి. మతతత్వాన్ని రెచ్చగొట్టి కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని దోచిపెడుతున్న మన దేశ పాలకులకు అమెరికా ప్రజాగ్రహం గుణపాఠం కావాలి. ప్రజాస్వామ్యంలో రాజరికానికి, మతోన్మాదానికి చోటు లేదని గుర్తించాలి.

★

అదానీ అంబుజానా! ప్రజల ప్రాణాలా!

విశ్లేషణ

విశాఖపట్నం పెదగంట్యాడ దగ్గర సిమెంట్ గ్రైండింగ్ అండ్ ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటుకు అంబుజా సిమెంట్ కంపెనీ సిద్ధపడింది. అంబుజా అదానీ గ్రూపులో భాగం. అదానీ ప్రియ మిత్రులు నరేంద్ర మోడీ, ఈయన అనుంగు మిత్రులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ బిజెపి కూటమి ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. గంగవరం పోర్టు కోసం పెదగంట్యాడ మండలంలో సేకరించిన భూమిలో 20 ఎకరాలు దీనికి కేటాయించారు. ఎ.పి కాలుష్య నియంత్రణ మండలి ద్వారా అక్టోబరు 8న ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధపడ్డారు. అయితే వేల సంఖ్యలో యువత, మహిళలు, పురుషులు ప్లకార్డులు, బ్యానర్లు, పోస్టర్లతో తమ వ్యతిరేకతను తెలియచేశారు. "గో బ్యాక్ అదానీ సిమెంట్-అదానీ సిమెంట్ కంపెనీ వద్దే వద్దు. అదానీకి అనుమతులు రద్దు చేయాలి. ప్రజల ప్రాణాలకు రక్షణ కావాల"ంటూ నినదించారు.

ప్రజలు ఎందుకు వద్దంటున్నారు?

ఎం. జగ్గునాయుడు

అదానీ గంగవరం పోర్టు రసాయనాలు, బొగ్గు, దుమ్ము, ధూళి గంగవరం, పెదగంట్యాడ, గాజువాక, కూర్మన్నపాలెం, షీలానగర్, మింది, శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా ప్రాంతాల ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్నది. లక్షల రూపాయలు వెచ్చించి కొన్న అపార్టుమెంట్లు, నిర్మించుకున్న ఇళ్లలోకి ఈ బూడిద ప్రవేశిస్తున్నది. ఇంట్లో వున్నా తులుపులు, కిటికీలు, మూసుకోవాల్సిందే. ఇళ్లతో పాటు ప్రజల తాగే నీరు, తినే ఆహారం, పీల్చే గాలి లోకి కాలుష్యం చేరుతోంది. దీనివలన పక్షవాతం, క్యాన్సర్, ఊపిరితిత్తులు, శ్యాసకోశ, కిడ్నీ, మెదడు, గుండెపోటు వ్యాధుల బారినపడుతున్నారు. చివరకు తల్లిగర్భంలోని శిశు మరణాలు కూడా పెరిగాయి. దీనికి తోడు అదానీ సిమెంటు కంపెనీ కూడా వస్తే తమకు నరకం తప్పదని గ్రహించిన ప్రజలు వద్దని ఆగ్రహించారు.

ఇ.ఐ.ఎ నివేదిక ప్రభావాలు

అంబుజా సిమెంట్ కంపెనీ ఎ.పి కాలుష్య నియంత్రణ మండలికి ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఇఐఎ) ముసాయిదాను నివేదించింది. ఈ నివేదికలో పర్యావరణం, ప్రజలపై ప్రభావాల ముప్పులను అతి తక్కువగా చూపించారు. కాలుష్య నియంత్రణ బోర్డు నిబంధనల ప్రకారం జనావాసాలకు 500 మీటర్ల సమీపంలో ఎలాంటి పరిశ్రమలు పెట్టకూడదు. అంబుజా సిమెంటు కంపెనీకి పెదగంట్యాడ జనావాసాలు కేవలం 130 మీటర్లు, గాజువాక జనావాసాలు 290 మీటర్ల సమీపంలో వున్నాయి. గంగవరం పోర్టు కోసం సేకరించిన భూమిలో ఇతర పరిశ్రమలు పెట్టకూడదు. ఇది 30 సంవత్సరాలు లీజుకు తీసుకున్నది. దీనిలో సిమెంటు కంపెనీ ఏర్పాటుకు సిద్ధపడుతున్నారు. ఇది సంవత్సరానికి 4 మిలియన్ (40 లక్షలు) టన్నుల సిమెంటు, రోజుకి 4.38 లక్షల బస్తాలు ఉత్పత్తి చేస్తుంది. దీనికి కావాల్సిన ముడిసరుకు జిప్సం రోజుకి 2 వేల టన్నులు, ఫ్లై యాష్ 5 వేల టన్నులు, స్లాగ్ రోజుకి 5 వేల టన్నులు కావాలి. వీటిని రోడ్డు, రైలు, సముద్ర మార్గాల ద్వారా సేకరిస్తారు. రోడ్డు రవాణాలో భారీ ట్రక్కులు, లారీలు వినియోగిస్తారు. స్లాగ్ విశాఖ ఉక్కు నుండి, యాష్ ఎన్.టి.పి.సి నుండి సేకరిస్తారు.

తవ్వకం, బ్యాక్ ఫిల్లింగ్, కాంక్రీటింగ్, నిర్మాణం, ఆపరేషన్ సమయంలో పరిసర ప్రాంతాల్లో తీవ్ర శబ్దాలు పెరుగుతాయి. రోడ్డు రవాణా సాంద్రత పెరుగుతుంది. రోడ్ల విస్తరణ లేదు. ప్రాజెక్టు భూమిలో చెట్లు పొదలు, మూలికలు, వృక్ష సంపద, మడ అడవులున్నాయి. పరిశ్రమలో ఆమ్లాలు, రసాయనాలు, మండే ద్రవాలుంటాయి. పర్యావరణ, ఇతర ప్రభావాలను నియంత్రిస్తామని ఇ.ఐ.ఎ లో పేర్కొన్నారు. కానీ! ఆచరణలో అమలు జరగవని గంగవరం పోర్టు నిరూపించింది.

సిమెంటు పరిశ్రమ ఏర్పాటు వలన భూగర్భ జలాలు, తాగునీరు, బావులు, బోర్లు, గాలి, పర్యావరణం కలుషితమవుతాయి. ప్రజలు అనేక వ్యాధుల బారిన పడతారు. చుట్టు పక్కల గ్రామాలకు వరద ముప్పు, పొంచి వుంటుంది. ప్రమాదాలు, మరణాలు పెరుగుతాయి. అడవులు, వృక్షాలు, జంతు జాతులు కనుమరుగవుతాయి. వ్యవసాయం, మత్స్యకారుల ఉపాధి నాశనమవుతుంది. సంతానోత్పత్తి తగ్గుతుంది. గర్భస్రావాలు, పిల్లలు పెరుగుదలలో లోపాలు ఏర్పడతాయి.

ఉపాధి - అభివృద్ధి

పరిశ్రమ ఏర్పడితే వేల సంఖ్యలో ఉపాధి రావాలి. ఆ ప్రాంతాల అభివృద్ధి జరగాలి. ఈ సిమెంట్ కంపెనీ ఉత్పత్తి ప్రక్రియలో 60 మందికి పర్మినెంటు, 200 మందికి కాంట్రాక్టు ఉపాధి లభిస్తుంది. అదానీకి సంపద పెరుగుతుంది. కానీ! దీనివలన 10 లక్షల మంది ప్రజల ప్రాణాలు, పర్యావరణం ప్రమాదంలో పడతాయి. గంగవరం పోర్టు కాలుష్యం వలన ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే భూములు, ఇళ్ల ధరలు పడిపోయాయి. పలువురు తక్కువ ధరలకే అమ్ముకుని కాలుష్య రహిత ప్రాంతాలకు పోతున్నారు. గంగవరం పోర్టులో జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులు, రవాణా, నిల్వ రసాయనాలు గాలిలోకి చేరుతున్నాయి. సిమెంట్ కంపెనీకి ఇవన్నీ ఉంటాయి. వీటితో పాటు భారీ చిమ్నీలు (గొట్టాలు) ఏర్పాటు చేస్తారు. కాలుష్యం పెదగంట్యాడకే పరిమితం కాదు. గాజువాక అసెంబ్లీ, విశాఖ వెస్ట్ నియోజకవర్గంలోని సింధియా నుండి గోపాలపట్నం, కంచరపాలెం వరకు సుమారు 10 లక్షల మంది ప్రజలతోపాటు, జంతు జీవాల ప్రాణాలను, పర్యావరణాన్ని హరిస్తుంది.

> **సిమెంటు కంపెనీ వద్దని ప్రజలు ఎంతగా మొత్తుకున్నా, 15 రోజుల్లో మరల పబ్లిక్ హియరింగ్ చేపడతామని ప్రకటించారు. స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 'ప్రజాభిప్రాయమే ఫైనల్' అంటూనే 'పరిశ్రమ అధికారులు ముందు ప్రజలకు అవగాహన కల్పించి ఉండాల్సింది. కావాలని కొందరు కాలుష్యం వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారు. కాలుష్యం రాదు. రాకుండా కంపెనీ యాజమాన్యం తగు చర్యలు తీసుకుంటుంది. ప్రజలు భయపడనవసరం లేద'ని ప్రకటించారు. విశాఖ వెస్ట్‌కు సంబంధించిన మరో ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు), రాష్ట్రంలో భారీ మెజారిటీతో గెలిచిన విశాఖ ఎంపీ శ్రీభరత్ నోరు విప్పడంలేదు. వీరంతా గత ఎన్నికల్లో అదానీ, గంగవరం పోర్టు కాలుష్యం బారి నుండి ప్రజలను కాపాడతామని హామీనిచ్చిన వారే. అధికారం చేపట్టాక అదానీ బాట పట్టారు.**

కూటమి ప్రభుత్వ ఆరాటం

రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి పాలకులకు ప్రజలకన్నా అదానీ సేవకే ఆరాటం ఎక్కువ. సిమెంటు కంపెనీ వద్దని ప్రజలు ఎంతగా మొత్తుకున్నా, 15 రోజుల్లో మరల పబ్లిక్ హియరింగ్ చేపడతామని ప్రకటించారు. స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 'ప్రజాభిప్రాయమే ఫైనల్' అంటూనే 'పరిశ్రమ అధికారులు ముందు ప్రజలకు అవగాహన కల్పించి ఉండాల్సింది. కావాలని కొందరు కాలుష్యం వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారు. కాలుష్యం రాదు. రాకుండా కంపెనీ యాజమాన్యం తగు చర్యలు తీసుకుంటుంది. ప్రజలు భయపడనవసరం లేద'ని ప్రకటించారు. విశాఖ వెస్ట్‌కు సంబంధించిన మరో ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు), రాష్ట్రంలో భారీ మెజారిటీతో గెలిచిన విశాఖ ఎంపీ శ్రీభరత్ నోరు విప్పడంలేదు. వీరంతా గత ఎన్నికల్లో అదానీ, గంగవరం పోర్టు కాలుష్యం బారి నుండి ప్రజలను కాపాడతామని హామీనిచ్చిన వారే. అధికారం చేపట్టాక అదానీ బాట పట్టారు.

సిమెంట్ కంపెనీలపై ప్రభావం - ప్రతిఘటన

పెదగంట్యాడలోనే కాదు. దేశంలో పలుచోట్ల ఈ సిమెంట్ కంపెనీలపై ప్రజాప్రతిఘటన వుంది. ఇదే అదానీ కంపెనీ మహారాష్ట్ర, ముంబయి సమీపంలోని కళ్యాణ్ వద్ద నిర్మించదలిచే సిమెంట్ ఫ్యాక్టరీని ప్రజలు అడ్డుకున్నారు. గుజరాత్‌లో వడినార్ దగ్గర వున్న అంబుజా సిమెంట్ కాలుష్యంపై ప్రజా ఉద్యమం జరుగుతోంది. హిమాచల్ ప్రదేశ్, దార్లా ఘాట్ సమీపాన వున్న రౌరీ అంబుజా సిమెంటు కాలుష్యంపై అక్కడ కాలుష్య నియంత్రణ మండలి కేసు నమోదు చేసి జరిమానా విధించింది. 2018 గ్రీన్‌పీస్ నివేదిక ప్రకారం మధ్యప్రదేశ్ సత్నా జిల్లాలో గాలి నాణ్యత అత్యంత నాసిరకంగా వుంది. ప్రజల్లో శ్వాసకోశ వ్యాధులు తీవ్రంగా పెరిగాయి. తమిళనాడు అరిమలూరు సిమెంట్ పరిశ్రమ వలన కళ్లు, చర్మ వ్యాధులు పెరిగాయి. వ్యవసాయం దెబ్బ తింది. పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, గుజరాత్ అంబుజా సిమెంట్ పరిశ్రమలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పలు కేసులున్నాయి. పెదగంట్యాడ సిమెంటు ఫ్యాక్టరీ వీటికి మినహాయింపు కాదు.

సిపిఎం, ప్రజా సంఘాల కృషి

ఈ సిమెంటు కంపెనీ పట్ల ప్రజలకు జరిగే హానిని ప్రజల ముందుంచింది. ఇంటింటికి కరపత్రాలు, పాదయాత్రలు, వీధి మీటింగులు, కార్మికుల సమావేశాలు, ఆటో జాతాలు తదితర రూపాల్లో విస్తృత క్యాంపెయిన్ నిర్వహించింది. మరోవైపు వార్వా, నివాస్, జెవివి, గ్రామ సంఘాలు, అసోసియేషన్లు, పెన్షనర్లు, కార్మిక, మహిళా, విద్యార్థి, యువజన, నిర్వాశిత సంఘాలు, కళాకారులు వివిధ రూపాల్లో ప్రజలను చైతన్యపరిచాయి. ఒక ఎజెండా, వాతావరణం ఏర్పడింది. ప్రజల వ్యతిరేకతను గమనించిన కూటమి పార్టీల స్థానిక కార్పొరేటర్లు, నాయకులు ఆందోళనలో కలిశారు.

కూటమి నేతల పన్నాగాలు

ఈ సిమెంట్ కంపెనీ కాలుష్యాన్ని, ప్రమాదాన్ని తగ్గించి చెప్పే ప్రచారంలో కూటమి నేతలు పలువురు వున్నారు. 'పెదగంట్యాడ దగ్గర కంపెనీ వలన ఇతర ప్రాంతాలకు నష్టం వుండదు. ఉపాధి రావాలంటే కంపెనీలు రావాలి. స్థానికులకు ఉపాధి అభివృద్ధి కోసమే ఈ సిమెంటు కంపెనీ' అంటూ ఈ పోరాటాన్ని బలహీనపరిచే కుయుక్తులు పన్నుతున్నారు. గంగవరం పోర్టు వచ్చినప్పుడు కూడా ఇలాగే అన్నారు. కాలుష్యం గంగవరంకే పరిమితం కాలేదు. రెండు అసెంబ్లీ నియోజక వర్గాల ప్రజలను ముంచేస్తోంది. స్థానికులకు 600 మందికి ఉద్యోగాలు ఇచ్చి వారందరినీ తిరిగి తొలగించే వరకు యాజమాన్యం నిద్ర పోలేదు. ఈ పోర్టులో నేడు వేల మంది స్థానికేతరులు, ఇతర రాష్ట్రాలవారే వున్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు చేయరు. అదానీ సిమెంటు కంపెనీ వస్తే దీనికి భిన్నంగా ఏమీ వుండదని ప్రజలు తమ అనుభవం ద్వారా గ్రహిస్తున్నారు. ఉపాధి కల్పన, ప్రజల ఆరోగ్యాల రక్షణే ప్రభుత్వ ధ్యేయమైతే...విశాఖ స్టీల్ ఫ్యాక్టరీలో 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను, నిర్వాసితులను ఎందుకు తొలగించింది. పారిశ్రామిక కాలుష్యాన్ని అరికడతానని శపథం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అదానీ గంగవరం పోర్టు కాలుష్యంపై నోరు విప్పరు. అదానీ బలవంతుడు, మోడీకి మిత్రుడు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మోడీ చేతిలో వున్నారు. పోరాడి మీరేం సాధించగలరని పిరికి మందు పోస్తున్నవారు కొందరున్నారు. ఈ బలాలు, స్నేహాలు, ప్రజాగ్రహం ముందు మట్టి కరుస్తాయని మన పొరుగు దేశాలు శ్రీలంక, నేపాల్ ప్రజలు నిరూపించలేదా!

తమకు అధికారం కట్టబెట్టిన ప్రజల అభీష్టానికి, ప్రాణాలకు విలువనిచ్చి...అదానీ సిమెంట్ కంపెనీ రద్దు, గంగవరం పోర్టు కాలుష్య నియంత్రణకు...చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వం పూనుకుంటుందో లేదా అదానీ పక్షాన నిలుస్తుందో తేల్చుకోవాలి.

/ వ్యాసకర్త సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి /

సామాజిక అసమానతల తొలగింపునకు శంకరన్ కృషి

● 91వ జయంతి సభలో వక్తలు

శంకరన్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - విజయవాడ : ఉన్నతాధికారి హోదాలో ఎస్.ఆర్.శంకరన్ అమలు చేసిన పలు విప్లవాత్మక విధానాలు సామాజిక అసమానతల తొలగింపునకు దోహదం చేశాయని పలువురు వక్తలు కొనియాడారు. అటువంటి మహోన్నతమైన అధికారిని స్మరించుకోవడం ద్వారా నేటితరం స్ఫూర్తిపొందాలన్నారు. పేదల అభ్యున్నతికి ఎన్నో చట్టాలు, పథకాలను రూపొందించిన మాజీ ఐఎఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ 91వ జయంతి బుధవారం విజయవాడ బిఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ జక్కత భవన్‌లో ఘనంగా జరిగింది. ఎస్.ఆర్.శంకరన్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐఎఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని శంకరన్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాకి సురేశ్ మాట్లాడుతూ... అణగారిన వర్గాల ప్రజల కోసం అనేక చట్టాలను తీసుకురావడంలో శంకరన్ కీలకపాత్ర పోషించారన్నారు. అన్ని శాఖలపై మంచి పట్టు సాధించి సామాన్యుల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక విధానాలను తీసుకొచ్చారని కొనియాడారు. ఎస్సీ కమిషన్ కార్యదర్శి చినరాముడు మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి శంకరన్ ఎంతో కృషి చేశారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఆదర్శవంతమైన జీవితానికి శంకరన్ నిలువెత్తు నిదర్శనమని వివరించారు. ప్రస్తుత ఉన్నతాధికారులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజల సమస్యలను శాస్త్రీయ కోణంలో విశ్లేషించి అనేకమైన చట్టాల రూపకల్పనలో శంకరన్ కీలకంగా వ్యవహరించారని తెలిపారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... అత్యున్నత సామాజిక వర్గంలో జన్మించి అత్యంత వెనుకబడిన వర్గాల కోసం పని చేసిన ఘనత శంకరన్‌కు దక్కుతుందన్నారు. ఏపి ఎన్జీఒ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పద్మభూషణ్ ఇచ్చి గౌరవించినా దానిని తిరస్కరించి ప్రజాధికారిగా ఉండటమే గొప్ప భాగ్యంగా భావించారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రజల అధికారిగా శంకరన్ పేరు తెచ్చుకున్నారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొలనుకొండ శివాజీ మాట్లాడుతూ... భూ పంపిణీకి శ్రీకారం చుట్టి పేదలకు భరోసా కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కె.సుబ్బారావు, బుట్టి రాయప్ప, సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం శంకరన్ : విజయానంద్

నిరంతరం ప్రజాసేవలోనే ఉంటూ పేదల కోసం పరితపించిన శంకరన్ అందరికీ ఆదర్శప్రాయులని పలువురు వక్తలు అన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ జయంతి సభ బుధవారం నగరంలోని ఆంధ్ర లయోలా కళాశాలలో మెమోరియల్ కమిటీ ఆధ్వర్యాన జరిగింది. ఈ కార్యక్రమంలో కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎం.విజయానంద్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... పేదల అభ్యున్నతికి ఎన్నో చట్టాలను రూపొందించారని కొనియాడారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ... శంకరన్ నిరుపేదల ఐఎఎస్‌గా పేరుతెచ్చుకున్నారని అన్నారు. అట్టడుగు వర్గాల ప్రజల కోసం పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు ఎస్ఎస్-ఎల్ఐయు విజిటింగ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.ఎం.సౌజన్య, రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ చక్రపాణి, లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ జి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం ఎప్పుడు..?

● ప్రభుత్వం చెబుతున్నదొకటి.. చేస్తున్నదొకటి
● సిఆర్‌డిఎ గ్రామసభలో రాజధాని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

'11 ఏళ్లుగా సమస్యలపై ఏకరువు పెడుతూనే ఉన్నాం.. నమోదు చేసుకున్నామని చెప్పడమే తప్ప పరిష్కరించడం లేదు.. అధికారులు మారి కొత్తవారు వస్తున్నా సమస్యలు మాత్రం తీరడం లేదు...' అని సిఆర్‌డిఎ కమిషనర్ కె.కన్నబాబు వద్ద రాజధాని రైతులు వాపోయారు. 'ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల పరిష్కారం కోసం గ్రామసభను రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరంలో సిఆర్‌డిఎ అధికారులు బుధవారం నిర్వహించగా రైతులు తమ సమస్యలను కమిషనర్ ఎదుట ఏకరువుపెట్టారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారని, వాటినే తమకివ్వాలని, వేరేచోట వద్దని అన్నారు. 2014లో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చినా ఇప్పటి వరకూ ఒక్క కంపెనీ కూడా తమ ప్రాంతానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో గృహాల వద్ద మురుగు నీటి పారుదల సదుపాయం కల్పించాలని కోరారు. భూముల రేట్లు పడిపోయాయని, గూగుల్ వాళ్లు వచ్చి చూసినా ప్రాజెక్ట్ ప్రారంభం కాలేదని, ఎల్అండ్‌టి వారు 15 ఎకరాలు తీసుకున్నా ఏ పని చేయడం లేదని, ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేస్తోంది మరొకటని వాపోయారు. భూములు తీసుకునేప్పుడు ఉన్న అధికారులు వేరు, ఇప్పుడున్నవారు వేరని రామారావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పారా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. 2014లో చెప్పిన సమస్యలు ఇప్పటికీ అలాగే ఉన్నాయని, రైతులను సిఆర్‌డిఎ అధికారులు చులకనగా చూస్తున్నారని విమర్శించారు. ప్లాట్లను పిల్లల పేర్ల మీదకు మార్చుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. మహిళా రైతు వెంకాయమ్మ మాట్లాడుతూ.. 3.70 ఎకరాలు ల్యాండ్ పూలింగ్‌లో ఇస్తే 3.37 ఎకరాలకే కౌలు చెక్కు ఇచ్చారని, ఐదేళ్లుగా సిఆర్‌డిఎ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదని కన్నీటి పర్యంతమయ్యారు. రైతుల సమస్యలను నమోదు చేసుకున్నామని, పరిష్కారానికి అవసరమైన నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించామని కమిషనర్ చెప్పారు. రాజధాని గ్రామాల్లో రూ.940 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు డిపిఆర్‌లు సిద్ధం చేస్తున్నామని, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు సామాజిక సంక్షేమం విభాగం ఆధ్వర్యంలో జాబ్‌మేళా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. భూ సమీకరణలో ఇవ్వని భూములను భూ సేకరణ ద్వారా తీసుకుంటామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందినవారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ల్యాండ్స్ డైరెక్టర్ (క్యాపిటల్ సిటీ) వసంత రాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.పద్మావతి, సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్ వి.రాములు, డిసిడిఒ బొర్రా శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (ఎల్‌ఎ) ఎస్.రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలు, మంత్రులకు అధునాతన నివాసాలు

● రూ.411 కోట్లతో జి ప్లస్-1 భవంతులు
● నేలపాడు, వెలగపూడిలో 76 మందికి అవకాశం


నిర్మాణంలో ఉన్న మంత్రుల నివాస భవనాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో ప్రభుత్వ నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయి. ప్రధానంగా హైకోర్టు న్యాయమూర్తులకు, హైకోర్టులో పనిచేసే ఇతర అధికారులకు ఒక అంతస్తుతో నివాస గృహాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. నేలపాడు గ్రామంలో ప్రస్తుతం ఉన్న హైకోర్టుకు సమీపంలోనే న్యాయమూర్తుల భవనాల నిర్మాణం చేపట్టారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తుల భవనాలు, మంత్రులు, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ తదితరుల కోసం మొత్తం 76 నివాస బంగ్లాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.411 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ పనులకు బిఎస్ఆర్ కంపెనీ కాంట్రాక్టు పొందింది. ఈ నిర్మాణాలు విల్లాల తరహాలో సువిశాలంగా నిర్మిస్తున్నారు. ప్రతి భవనానికీ ముందు సెక్యూరిటీగార్డుకు, ఆఫీసుకు కూడా రూములను నిర్మిస్తున్నారు. నేలపాడులో న్యాయమూర్తులు, ఇతర అధికారుల కోసం 40 నివాస భవనాలు నిర్మిస్తుండగా, వెలగపూడిలో మరో 36 భవనాలు మంత్రులు, ఇతర ప్రముఖుల కోసం నిర్మాణాలు చేపట్టారు. ఒక్కోచోట ఒక్కో మోడల్ భవంతిని నిర్మించి సందర్శకులకు నమూనాగా చూసేందుకు అందుబాటులో ఉంచారు. భవనాలకు మౌలిక సదుపాయాలు, అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఒక్కో భవంతిని నిర్మించడానికి సగటున రూ.5.40 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. దిగువ అంతస్తులో కొన్ని బెడ్‌రూములు, ఆఫీసు రూం, మీటింగ్ హాలు, పైఅంతస్తులో మరొకొన్ని బెడ్‌రూములు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రతి భవనానికీ పూర్తి స్థాయిలో ప్రహరీ, కారు పార్కింగ్ షెడ్లు, భారీ గేట్లు, లైటింగ్ ఇతర వసతులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనాల్లో కొన్నింటికి మొదటి స్లాబ్ పూర్తి కాగా, మరికొన్నింటికి గోడలు పూర్తయి స్లాబ్ వరకు నిర్మాణం జరిగింది. వచ్చే జూన్ కల్లా 76 భవనాలు నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. నేలపాడులో హైకోర్టుకు సమీపంలోనే ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు ఒకే ప్రదేశంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. వెలగపూడిలో మంత్రులకు కూడా ఒకే ప్రదేశంలో ఎదురెదురుగా నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ ఒకేచోట ఉండడం వల్ల సెక్యూరిటీకి ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

Union Bank of India (यूनियन बैंक ऑफ इंडिया — भारत सरकार का उपक्रम — A Government of India Undertaking)

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋుణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋుణగ్రహీత : **1. శ్రీ మల్లిపెద్ది కార్తీక్, తండ్రి : మల్లిపెద్ది వి.ఆర్. ప్రసాద్,** డి.నెం.3-499, ఉండవల్లి మెయిన్ రోడ్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రక్కన, తాడేపల్లి మండలం, ఉండవల్లి రూరల్, తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522501, **2. శ్రీ మల్లిపెద్ది కార్తీక్, తండ్రి : ఎం.వి. రమణ ప్రసాద్,** హౌస్ నెం.6-418/3, గ్రౌండ్ ఫ్లోర్, ఎం.ఎల్.ఆర్ కాలని రోడ్డు నెం.2, మీర్‌పేట్, హైదరాబాద్-97, తెలంగాణ స్టేట్.

విషయం: **బ్యాంక్ వారికి శ్రీ మల్లిపెద్ది కార్తిక్ ఋుణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.05-09-2024**న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ముల ను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.20-09-2025**న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకోవడమైనది.

ఆస్తిని **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

స్థిరాస్తి వివరములు

తనఖావుంచబడిన ఆస్థి వివరములు: షెడ్యూలు-ఎ : కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామము మరియు పంచాయతీ, ఆర్.యస్.నెం.503/1, అసెస్‌మెంట్ నెం.71, డోరు నెం.1-73, సమీప డోరు నెం.1-47/14 నందు మొత్తం విస్తీర్ణము **676.00 చ॥గ॥ల (ఐటమ్-1 : 371.38 చ॥గ॥లు మరియు ఐటమ్-2 : 304.00 చ॥గ॥లు)** గల స్థలములో అవిభాజ్యపు మరియు అనిఅర్ధేశ్యపు భాగమైన 30.00 చ॥గ॥ల విస్తీర్ణముగల ఇంటి స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఐటమ్-1 యొక్క 371.38 చ॥గ॥లు విస్తీర్ణమునకు హద్దులు: తూర్పు:** ఐటమ్-2 యొక్క ఆస్తి, **దక్షిణం:** రాజ వీధి, **పడమర:** పుల్లగూర తిరుపతమ్మ యొక్క ఆస్తి, **ఉత్తరం:** పుల్లగూర లక్ష్మయ్య యొక్క ఆస్తి.

ఐటమ్-2 యొక్క 304.00 చ॥గ॥లు విస్తీర్ణమునకు హద్దులు: తూర్పు: బుడ్డి ప్రకాశరావు మరియు పుల్లగూర నాగేశ్వరరావు యొక్క ఆస్తి, **దక్షిణం:** రాజ వీధి, **పడమర:** ఐటమ్-1 యొక్క ఆస్తి, **ఉత్తరం:** పుల్లగూర లక్ష్మయ్య యొక్క ఆస్తి.

షెడ్యూలు-బి : షెడ్యూలు-ఎ ఆస్తి లోని మొత్తం విస్తీర్ణము గల **'ఆల్ఫా టవర్స్'** పేరునగల గ్రూప్ హౌస్‌కు చెందిన 2వ అంతస్థు, ప్లింత్ ఏరియా 1200 చ॥అ॥ల విస్తీర్ణముగల ఫ్లాట్ నెం.యస్‌యఫ్-4 కు చెందిన కారు పార్కింగ్ ఏరియా 80 చ॥అ॥లు అందులోని ఉమ్మడి అవసరాలైన ఒవర్ వాటర్, డ్రైనేజి, నడకమార్గం, లిఫ్ట్, ఒపెన్ టెర్రాస్ మరియు మెట్లు మొ॥న వాటితో సహాగల ఫ్లాట్‌కు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** శూన్యాకాశము మరియు బాల్కాని, **దక్షిణం:** ఫ్లాట్ నెం.205, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** శూన్యాకాశము.

స్థలం : విజయవాడ, తేది : **16-10-2025** సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

పెరూలో పెరుగుతున్న నేరాలు

● రాజధాని లిమాలో ఎమర్జన్సీ

లిమా : పెరూ రాజధాని లిమాలో ఆ దేశ నూతన అధ్యక్షుడు జోస్ జెరి మంగళవారం అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. నిరసనలను రేకెత్తించి, తనకి ముందున్న ప్రభుత్వ పతనానికి దారితీసిన హింసాత్మక పరిస్థితులను అడ్డుకునేందుకు తీసుకున్న తాజా చర్యగా దీన్ని పేర్కొన్నారు. లిమాలో ఈ అత్యవసర పరిస్థితి 30 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. పోలీసులకు సాయంగా సైనికులను మోహరించనున్నట్లు, ప్రజల సమావేశాలపై ఆంక్షలు విధించనున్నట్లు ప్రకటించారు. ప్రజల స్వేచ్ఛ, కదలికలు వంటి కొన్ని హక్కులను పరిమితం చేసే చర్యలను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. అనంతరం అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ డిక్రీ జారీ చేశారు. నేరాలను ఎదుర్కొనేందుకు కొత్త విధానాన్ని రూపొందించనున్నట్లు ప్రకటించారు. పెరూలో హింస, అవినీతికి వ్యతిరేకంగా జెన్ జెడ్ కార్యకర్తల నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగిన సంగతి తెలిసిందే. నూతన అధ్యక్షుడు జోస్ జెరీ రాజీనామాను కూడా డిమాండ్ చేస్తూ గత గురువారం నిరసనకారులు లిమాలో ఆందోళన చేపట్టారు. ఈ ప్రదర్శన హింసాత్మకంగా మారడంతో ఒక పౌరుడు మరణించగా, పోలీస్ అధికారులు, జర్నలిస్టులు సహా వందమంది గాయపడ్డారు. తాను రాజీనామా చేసేది లేదని జెరీ స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో పెరూలో హత్యలు, దోపిడీలు, బహిరంగ ప్రదేశాల్లో హింసాత్మక దాడులు పెరిగాయి. జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో 1690 హత్యలు జరిగినట్లు పోలీసులు తమ నివేదికలో తెలిపారు. 2024లో ఇదే సమయంలో 1,502 హత్యలు జరిగాయని అన్నారు. నేరాలను అదుపు చేయలేకపోతున్నామని ప్రకటించిన మాజీ అధ్యక్షురాలు దినా బోలువార్టేను పెరూ కాంగ్రెస్ అభిశంసనతో పదవి నుండి తొలగించింది. ఆ తర్వాత ఆమె స్థానంలో శాసనసభ్యుడు జోస్ జెరిని నియమించింది.

తురకపాలెంలో మళ్లీ జ్వరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మెలియోడోసిస్ బ్యాక్టీరియా వల్ల జ్వరాలతో అధికారికంగా 30 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే తాజాగా పలువురికి జ్వరాలు రావడం బుధవారం కలకలం రేగింది. గ్రామానికి చెందిన ఐదుగురు ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండ్రోజుల వ్యవధిలో ముగ్గురు ఆస్పత్రిలో చేరారు. మంగళ, బుధవారాల్లో శీలం సలోమి, జెట్టి అనూష, శ్యామ్యూల్ జ్వరాలతో ఆస్పత్రికి వచ్చారు. గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం ఐదుగురు చికిత్స పొందుతున్నారని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. వీరి ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఇబ్బందేమీ లేదని చెప్పారు. గ్రామంలో వందలాది మంది జ్వరాల బారిన పడ్డారు. జులై, ఆగస్టు, సెప్టెంబరు నాలుగవ తేదీ వరకు 29 మంది మృతి చెందగా ఇటీవల కృష్ణవేణి (24) మరణించారు. మెలియోడోసిస్ అనే బ్యాక్టీరియా ప్రభావం వల్ల పలువురు అస్వస్థతకు గురై కొద్దిరోజులు చికిత్స పొంది మరణిస్తున్నారనే నివేదికపై ప్రభుత్వం దాదాపు నెల రోజుల పాటు గ్రామంపై దృష్టి సారించింది. దాదాపు 1200 మందికి పరీక్షలు చేసినా జ్వరాలకు కారణాలను నిర్ధారించలేకపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సలోమి అనే మహిళకు జ్వరంతో పాటు వంటి నిండా గడ్డలు రావడంతో ఆమె తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఇద్దరు జర్నలిస్టులకు ఇయు మానవ హక్కుల అవార్డు

బ్రస్సెల్స్ : ఇద్దరు జర్నలిస్టులకు యురోపియన్ యూనియన్ ఉన్నత మానవ హక్కుల అవార్డు లభించింది. యురోపియన్ పార్లమెంట్ అధ్యక్షురాలు రాబర్టా మెట్సొలా బుధవారం ఈ విషయాన్ని ప్రకటించారు. ఆ ఇద్దరు జర్నలిస్టుల్లో ఒకరు బెలారస్‌లో, మరొకరు జార్జియాలో జైలు శిక్షను అనుభవిస్తున్నారు. వీరిద్దరిలో ఒకరు పోలిష్ వార్తాపత్రిక గెజిటా వైబొర్కాజకు విలేకరిగా పనిచేస్తున్న ఆండ్రెజ్ పాక్సోబట్ కాగా, మరొకరు జార్జియాలో స్వతంత్ర మీడియా సంస్థలు రెండింటిని స్థాపించిన ప్రముఖ జర్నలిస్టు ఎంజియా అమగ్లొబెలి. వీరిలో ఆండ్రెజ్‌ను బెలారస్ జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తున్నారన్న కారణంతో అరెస్టు చేశారు. ఆయన ఎనిమిదేళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఇక ఎంజియా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్నపుడు పోలీసు అధికారిపై చేయి చేసుకున్నారనే కారణంతో ఆమెకు రెండేళ్ల జైలుశిక్ష విధించారు. అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తినందుకు, తమ పని తాము చేసుకుంటున్నందుకే ఆ ఇద్దరు జర్నలిస్టులను శిక్షించారని ఇయు అధ్యక్షురాలు పార్లమెంట్‌కు తెలిపారు.

డిసిబి బ్యాంక్ లిమిటెడ్ — DCB BANK

(కార్పొరేట్ అండ్ నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, సేనాపతి బాపత్ మార్గ్, లోవర్ ప్యారెల్, ముంబై-400 013, మహారాష్ట్ర)
జ్యోతి మ్యాజిస్టిక్, బంజారా హిల్స్, హైదరాబాద్, తెలంగాణ- 500 034.

ఇ-వేలం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సాధారణ ప్రజలు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత, హామీదారులకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న ఆస్తి డిసిబి బ్యాంక్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టబడినది, బ్యాంక్ అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 యొక్క నిబంధన క్రింద భౌతింగా స్వాధీనపరుచుకోవడమైనది. దిగువపేర్కొన్న బకాయిలు మరియు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు వ్యయాలు ఇతరత్రముల తిరిగిరాబట్టుకొనుటకు దిగువ పేర్కొన్న ఆస్తి "ఏది ఎక్కడ ఉందో" "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "రిసోర్స్ లేకుండా" "ఏది ఎక్కడ ఉందో ఆ విధంగా" ఎలాంటి వారంటీలు మరియు నష్టపరిహారాలు లేకుండా టెండర్ కం బహిరంగ ఇ-వేలం ద్వారా ఆస్తి అమ్మబడును.

రుణగ్రహీతలు హామీదారుల పేరు : 1. అప్పారావు పిల్ల, 2. పిల్ల రామలక్ష్మి, 3. పిల్ల అప్పలస్వామి, 4. పిల్ల సన్నాయమ్మ

రిజర్వు ధర	బయానా మొత్తం	బిడ్ పెంపెదల మొత్తం	ఇ వేలం తేది మరియు సమయం	స్వాధీనతా విధానం
Rs.9,50,000/-	Rs. 95,000/-	Rs.10,000/-	11-11-2025 & 11.30 am – 1.00 pm	భౌతికం

తనఖా ఆస్తుల వివరణ : కృష్ణాజిల్లా, ఎస్.ఆర్.ఓ. విజయవాడ పరిధిలోని కొత్తపేట, పోతినవారి వీధి, రామాలయం వీధి యొక్క లోపల వైపు లో ఉన్న కొత్త డో.నం.9-11-3, పాత డో.నం.2/33, కొత్త మూల్యాంకనం నం.21537, తదుపరి మూల్యాంకనం నం.1721, పాత మూల్యాంకనం నం.1721, ఎన్.టి.ఎస్.నం.662, బ్లాక్ నం.11, రెవెన్యూ వార్డు నం.1, ప్రస్తుత మున్సిపల్ వార్డు నం.38, మున్సిపల్ వార్డు నం.3, 2 అంశం తో కలిగి ఉన్న ఆ మొత్తం ఎ.ఆర్.సి.సి. రూఫ్ భవనం నిర్మించబడిన పరిధి 71.0 చ.గ.లు. మరియు 4.1 చ.గ.లు. కొరకు మార్గం మరియు మొత్తం పరిధి 75.1 చ.గ.లు. ఉన్న హద్దులు : షెడ్యూల్ : అంశం నం.1 : భవనం కొరకు 71.0 చ.గ.లు. : తూర్పు : మున్సిపల్ రోడ్డు, దక్షిణం : తమ్మిన అచ్చమ్మ మరియు ఇతరుల ఆస్తులు మున్సిపల్ రోడ్డు, పడమర : తమ్మిన ఎన్.వి.డి.హైమవతి ఆస్తి, ఉత్తరం: 2వ అంశంకు చెందిన మార్గం. అంశం నం.2 : అంశం నం.1 యొక్క 1/2 అవిభక్త వాటా పరిధి 4.1 చ.గ.లు. బయట 8.2 చ.గ.లు. కొరకు మార్గం : తూర్పు : మున్సిపల్ రోడ్డు, దక్షిణం : అంశం నం.1, పడమర : తమ్మిన ఎన్.వి.డి. హైమవతి ఆస్తి, ఉత్తరం : పోతిన గోపాలరావు ఆస్తి.

రుణగ్రహీత మరియు హామీదారుల పేరు : 1. శ్రీ.కొల్లి దుర్గారావు, 2. శ్రీమతి. కొల్లి భవాని

రిజర్వు ధర	బయానా మొత్తం	బిడ్ పెంపెదల మొత్తం	ఇ వేలం తేది మరియు సమయం	స్వాధీనతా విధానం
Rs.28,50,000/-	Rs. 2,85,000/-	Rs.15,000/-	11-11-2025 & 11.30 am – 1.00 pm	భౌతికం

తనఖా స్థిరాస్తుల వివరణ : కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిస్ట్రీ, పెనమలూరు మండలం, తాడిగడప గ్రామ పంచాయతీ ఏ రియా, తాడిగడప గ్రామం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.88/6 లో "వైఆర్ఆర్ రెసిడెన్సీ" యొక్క ఒకటవ అంతస్తు లో డో.నం.3-700, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్1 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ తో ప్లింత్ ఏరియా 1,000.0 చ.అ.లు., సాధారణ ప్రాంతం 150.0 చ.అ.లు., పార్కింగ్ ఏరియా 100.0 చ.అ.లు. తో కలిపి అవిభక్త ఉమ్మడి పరిధి 42.0 చ.గ.లు. బయట మొత్తం పరిధి 262.77 చ.గ.లు. ఉన్న హద్దులు : ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : కామన్ కారిడార్, లిఫ్ట్ మరియు మెట్లు.

తనిఖీ తేది మరియు సమయం : అన్నీ ఆస్తులు 25.10.2025 నుండి 06.11.2025, ఉ.11.00 గం. నుండి మ. 3.00 గం. మధ్య, యార్లగడ్డ హరి సందీప్, మొ.7032770025, ఉ.11 గం. నుండి సా.6 గం. మధ్య సంప్రదించగలరు.

ఇఎమ్‌డి ప్రూఫ్ తో ఇఎమ్‌డి దాఖలుకు తేది మరియు సమయం : 10.11.2025, సా.5.00 గం. వరకు పాల్గొనేందుకు అభ్యర్థన లేఖతో పాటు కెవైసి, పాన్ కార్డు తో.

ఆశక్తి ఉన్న కొనుగోలుదారు/బిడ్డరుదారులు అవసరం మేరకు డిడి/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా వారి పేరుతోటి, డిసిబి బ్యాంక్ లిమిటెడ్ పేరుతో మాత్రమే ఇఎమ్‌డిని డిపాజిట్ చేయగలరు.

ఇ-వేలం షరతులు మరియు నిబంధనలు :

1. ఆస్తులు ఎలాంటి వారెంటీలు, నష్టపరిహారాలు లేకుండా "ఎక్కడ ఉన్నాయో అలానే", "ఎలా ఉన్నాయో అలానే", "ఎలా ఉన్నాయో అలానే" ప్రాతిపదికన విక్రయించబడతాయి.
2. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ, పన్నులు మొదలైన వాటితో సహా అన్నీ చట్టబద్ధమైన బకాయిలు/అటెండెంట్ ఛార్జీలు/ఇతర బకాయిలు కొనుగోలుదారుడు భరించాల్సి ఉంటుంది మరియు బ్యాంకుకు తెలియని ఇ-వేలం ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి లేదా మరెవరికైనా ఏదైనా ఛార్జీలు, తాత్కాలిక హక్కులు లేదా ఇతర బకాయిలకు అధీకృత అధికారి లేదా బ్యాంకు బాధ్యత వహించదు, స్వతంత్ర బిడ్డర్ చట్టబద్ధమైన బాధ్యతలు, ఆస్తి పన్ను ఏరియర్లు, విద్యుత్ బకాయిలు మొదలైన వాటితో పాటు ఆస్తిపై ఉన్న బకాయిలకు సంబంధించి వారి స్వంత స్వతంత్ర విచారణలు చేయాలని సూచించారు.
3. (టి.జయప్రకాష్ రెడ్డి, మొ.నం.8142000064 ను సంప్రదించగలరు, బ్యాక్ అండ్ ఆఫీస్ : 8142000066/63/62, కార్యాలయం మెయిల్ ఐడి : info@bankauctions.in మరియు మెయిల్ ఐడి : prakash@Bankauctions.in వారి వెబ్ పోర్టల్ https://bankauctions.in/ 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో పై పట్టికలో పేర్కొన్న తేదిలలో, వేలం పాటలు సమర్పించే ముందు వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతులను లింక్ https://www.dcb.bank.in/సిఎమ్ఎస్/షోపేజ్/పేజ్/కస్టమర్-కార్నర్ ను చూడగలరు.
4. ఆసక్తిగల బిడ్డరుదారులు పోర్టల్లో తమను తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది మరియు వేలం సర్వీస్ ప్రొవైడర్ (4closure.com) మొ.నెం. 8142000064, బ్యాక్ అండ్ ఆఫీస్ : 8142000066/63/62 నుండి ఇ-వేలానికి తప్పనిసరి అయిన లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లు ముందుగానే పొందాలి. భావి బిడ్డరుదారులు తమ నమోదిత మొబైల్ నంబర్ నుండి మాత్రమే ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణ పొందవచ్చు.
5. వేలం ప్రక్రియలో ఆన్‌లైన్ ఇ-వేలంపాటలో పాల్గొనడం తప్పనిసరి, ఇది వెబ్‌సైట్ లో ఆఫర్/టెండర్ డాక్యుమెంట్‌తో పాటు అందుబాటులో ఉన్న సూచించిన ఫార్మాట్ తో దరఖాస్తు చేస్తుంది.

తేది : 23.10.2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

Chola — Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వికా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

స్థిరాస్తి కొరకు అమ్మకం ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (రూల్ 8& 9) లోని రూల్ 8(6) నియమంతో చదవబడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి సాధారణంగా మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతకు/సహ-రుణగ్రహీతకు/ తనఖాదారులకు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ దిగువ పేర్కొన్న తనఖాపెట్టబడిన స్థిరాస్తులను **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి స్వాధీనంలోకి తీసుకున్నారు. అవి ఇకమీదట **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**గా పేర్కొనబడను. సెక్యూర్డ్ ఆస్తులను **"ఎక్కడ ఎలా ఉందో అక్కడ అలాగే"** మరియు **"ఏదైతో ఎలా ఉందో అలాగే"** ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించబడును.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా **వెబ్‌సైట్:** https://bankauctions.in ద్వారా బహిరంగ వేలం నిర్వహించబోతున్నాం.

ఖాతా నెంబరు మరియు రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తనఖాదారుల పేర్లు	బాకీపడిన మొత్తం	స్థిరాస్తి (సెక్యూర్డు అసెట్)కు సంబంధించిన వివరణ	రిజర్వు ధర/ ఈఎండి/ బిడ్ పెంపుదల మొత్తం
Loan Account No. TL01BZA0000059259. **1) మెసర్స్ అంబికా డీజిల్ వర్క్స్ (రుణగ్రహీత)** డోర్ నెం.48-16-3-2, నాగార్జున నగర్, మహానాడు రోడ్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520 010. **2) శ్రీమతి నడకుధిటి సుభాషిణి, (సహ-రుణగ్రహీత)** **3) శ్రీ.నడకుధిటి రామరాజు, (సహ-రుణగ్రహీత)** **2 & 3 వారి నివాసం:** డోర్ నెం.41-30/4-11, బాపరయ్య నగర్, కృష్ణ లంక, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520013.	Rs. 2,44,87,434/- as on 23.09.2025	**ఐటం నెం.1:** ఆర్ఎస్ నెం.16/3, తదుపరి సబ్ డివిజన్ ఆర్ఎస్ నెం.16/3సి, భవానీపురం, అసిస్ట్ నెం.10732 53632, భవానీపురం, విజయవావ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, ఎన్.టి.ఆర్.జిల్లా పరిధిలోని అన్ని ఈసమెంట్ హక్కులతోపాటుగా కమర్షియల్ సైట్ యొక్క **293.33 చ.గ.లు లేదా 245.26 చ.మీ.ల** విస్తీర్ణపు స్థలం మొత్తం. సరిహద్దులు: డోర్ నెం.76-17-50: తూర్పు: ఇతరుల ఆస్తి, దక్షిణం: బెల్లపు వెంకట స్వామి ఆస్తి, పడమర: మున్సిపల్ రోడ్, ఉత్తరం: ఇతరుల ఆస్తి.	Rs.1,87,00,000/- Rs.18,70,000/- Rs.1,00,000/-
		ఐటం నెం.2: ఆర్ఎస్ నెం.16/3, తదుపరి సబ్ డివిజన్ ఆర్ఎస్ నెం.16/3సి, భవానీపురం, అసిస్ట్ నెం.10732 53633, భవానీపురం, విజయవావ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, ఎన్.టి.ఆర్.జిల్లా పరిధిలోని అన్ని ఈసమెంట్ హక్కులతోపాటుగా కమర్షియల్ సైట్ యొక్క **207.77 చ.గ.లు లేదా 173.32 చ.మీ.ల** విస్తీర్ణపు స్థలం మొత్తం. సరిహద్దులు: డోర్ నెం.76-17-50: తూర్పు: ఇతరుల ఆస్తి, దక్షిణం: ఇతరుల ఆస్తి, పడమర: మున్సిపల్ రోడ్, ఉత్తరం: ఇతరుల ఆస్తి.	Rs.1,29,00,000/- Rs.12,90,000/- Rs.1,00,000/-
Loan Account No. PR00025326. **1) మెసర్స్ శ్రీ రామచంద్ర ట్రేడింగ్ కంపెనీ, (రుణగ్రహీత),** డోర్ నెం.4-1-34, తోటకూర దొడ్డి, చిట్టి నగర్, వార్డు 32, విజయవాడ (అర్బన్) మండలం, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520009. **2) శ్రీమతి కునికర్ హేమలత, (సహ-రుణగ్రహీత)** **3) శ్రీ కునికర్ దుర్గా మల్లేశ్వరరావు, (సహ-రుణగ్రహీత)** **2 & 3 వారి నివాసం:** నెం.4-4-4, రాయప్ప రాజు వీధి, కొత్త అమ్మవారి ఆలయం వెనుక వైపు, చిట్టి నగర్, విజయవాడ (అర్బన్), కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520 001.	Rs. 1,08,56,463/- as on 15.10.2025	డోర్ నెం.4-4-4, పాత డోర్ నెం.2/62 కలిగిన అందులోని గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుల ఆర్‌సిసి బిల్డింగ్‌తో పాటుగా రెండు ఐటంలు కలిగియున్న 213-57 చ.గ.లు (178-57 చదరపు మీటర్లు) విస్తీర్ణపు ఆస్తి మొత్తం భాగం, దీని న్యూ అసిస్ట్ నంబర్ 29152, ప్లాట్ నెం.248, బ్లాక్ నెం.7, రెవెన్యూ వార్డ్ నెం.1, మునిసిపాల్ వార్డ్ నెం.5, ప్రస్తుత మున్సిపల్ వార్డ్ నెం.7, ఎన్.టి.ఎస్.నెం.40/1ఎ1సి, రాయప్ప వీధి, టెనోర్‌పేట్, చిట్టినగర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, విజయవాడ జిల్లా-సబ్ రిజిస్ట్రీ, విజయవాడ, కృష్ణా జిల్లా పరిధిలో కలదు. సరిహద్దులుగా: మొదటి ఐటం: గ్రౌండ్ మరియు మొదటిఅంతస్తులు ఆర్.సి.సి.బిల్డింగ్‌తో 193 చ.గ.ల స్థలం. తూర్పు: వాసంశెట్టి పాండు రంగారావు ప్లాట్ నెం.251, దక్షిణం: మానం సత్యనారాయణ ప్లాట్ నెం.249, పడమర: సంకసుబ్బారావుకు చెందిన ప్లాట్ నెం.246, ఉత్తరం: కునికర్‌శ్యామ్‌రాజు ఆస్తి మరియు ఉమ్మడి మార్గం. రెండవఐటం: 41-14చ.గ.ల మార్గం పూర్తి స్థలంలోని 20.58చ.గ.ల అవిభక్త వాటా. తూర్పు: పీతల కనకయ్య ప్లాట్ నెం.252, దక్షిణం: కునికర్ దుర్గా మల్లేశ్వరరావు ఆస్తి, పడమర: కునికర్‌శ్యామ్ రాజు ఆస్తి, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు.	Rs.1,34,00,000/- Rs.13,40,000/- Rs.1,00,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: 04-12-2025 ఉ.11.00గం.ల నుండి మ.12.00గం.ల వరకు (3 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పణకు చివరి తేది: 03-12-2025, ఆస్తిని తనిఖీచేయు తేది: ముందస్తు అనుమతి ప్రకారం

1) అందరు ఆసక్తిగల పాల్గొనదారులు/ బిడ్డరుదారులను వెబ్‌సైట్: https://bankauctions.in & www.foreclosureindia.com ను సందర్శించాలని సలహా ఇవ్వడమైనది. ఇ-వేలానికి సంబంధించిన వివరాలు, సహాయం, విధానం& ఆన్‌లైన్ ట్రైనింగ్‌కు ఔత్సాహిక బిడ్డరుదారులు వీరిని సంప్రదించవచ్చు: **మెసర్స్4 క్లోజర్ (సంప్రదించాల్సిన వ్యక్తి: శ్రీ.జయప్రకాష్, ఫోన్ నెం. 8142000064, ఇ-మెయిల్:** prakash@bankauctions.in) సంప్రదించాలి.
2) ఇ-వేలంలో పాల్గొనే క్రమానికి నియమ & నిబంధనలోని తదుపరి వివరాలకు దయచేసి వెబ్‌సైట్‌ను దర్శించండి: https://bankauctions.in/ & https://cholamandalam.com/news/ auction-notices లేదా సంప్రదించండి: **శ్రీ.షేక్ హుస్సేన్ బాషా - ఫోన్: 9885543145 / శ్రీ. కాళహస్తి రవితేజ - ఫోన్: 9533326591 / శ్రీ.వాస నరేంద్ర బాబు-ఫోన్ నెం.9849211556**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002లోని రూల్ 8(6), రూల్ 8& 9 ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటనగా కూడా దీనిని పరిగణించడును.

తేదీ: 23-10-2025,
ప్రదేశం: చెన్నై
సం/- అధీకృత అధికారి,
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola — Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం : "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (రూల్ 8 మరియు 9) యొక్క రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.

దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టినట్లు సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ తాకట్టు పెట్టిన వారు (లు)కి నోటీసు ఇవ్వబడింది, **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి స్వాధీనం తీసుకున్న దాన్ని ఇకపై చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా ఇక్కడ సూచించబడుతుంది. తాకట్టు ఆస్తులు **"ఏది ఉంటే అదే" "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఎక్కడ ఉన్నాయో అక్కడే"** పద్ధతిలో ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయి.

బహిరంగ ఈ-వేలం ను మేము **వెబ్‌సైట్: https://bankauctions.in/** ద్వారా నిర్వహించబోతున్నామని దీని ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేయడం జరిగింది.

అకౌంట్ నం. మరియు రుణగ్రహీత, సహ రుణగ్రహీత, తనఖాదారుల పేరు	బకాయి మొత్తం	స్థిరాస్తి (సెక్యూర్డ్ అసెట్) వివరణ	రిజర్వు ధర/ఇఎమ్‌డి/ బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం
లోన్ అకౌంట్ నం.లు: PR00026229 **1) మెసెర్స్.శ్రీ సాయి రాఘవేంద్ర జ్యూవెలర్స్ (రుణగ్రహీత),** నం.2-69, మెయిన్ రోడ్డు, బంటుమిల్లి, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521 324. **2. శ్రీ.సబ్బిశెట్టి జోషి వెంకట ప్రభాకర్ (సహ రుణగ్రహీత), 3. శ్రీమతి. సబ్బిశెట్టి నాగ వెంకట శైలజ (సహ రుణగ్రహీత),** క్ర.సం.2 మరియు 3 నివాసం : నం.2-54/1, పాత రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, బంటుమిల్లి, జయపురం, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521 324. **4. శ్రీమతి. సబ్బిశెట్టి హేమలత కుమారి (సహ రుణగ్రహీత),** నం.4-92, గాంధీ చౌక్, బంటుమిల్లి, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521 324.	Rs. 99,63,586/- as on 09.10.2025	కృష్ణాజిల్లా, బంటుమిల్లి సబ్ రిజిస్ట్రీ, బంటుమిల్లి మండలం, బంటుమిల్లి గ్రామ పంచాయతీ యొక్క ఆర్.ఎస్.నం.155/1, మూల్యాంకనం నం.1006, ట్యాక్స్ రసీదు ప్రకారం డో.నం. 4-122 బేరింగ్ డో.నం.4-137 అందులో ఆర్.సి.సి. భవనం గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 1596 చ.అ.లు. మరియు ఒకటవ అంతస్తు తో 1596 చ.అ.లు., రెండవ అంతస్తు తో 546 చ.అ.లు. తో పాటు స్థలం మరియు భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ కొలిచే పరిధి **242 చ.గ.లు.** ఉన్న హద్దులు : తూర్పు : అల్లె పాసేజ్, దక్షిణం : పంచాయతీ రోడ్డు, పడమర : విక్రేత మరియు ఉర బల రామకృష్ణమూర్తి ఆస్తి, ఉత్తరం : ఉర పాండురంగారావు ఆస్తి.	Rs. 1,11,00,000/- Rs. 11,10,000/- Rs.1,00,000/-

ఇ వేలం తేది మరియు సమయం : 14.11.2025, ఉ.11.00గం.ల నుండి మ.12.00గం.ల వరకు (ఒక్కొక్కటి 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది : 13.11.2025 ఆస్తి తనిఖీ తేది : ముందస్తు నియామకం ప్రకారం

1. ఆసక్తిగల పాల్గొనేవారు/ బిడ్డరుదారులు అందరూ వెబ్‌సైట్ **https://bankauctions.in & www.foreclosureindia.com** ను సందర్శించవలసిందిగా అభ్యర్థించబడ్డారు. ఇ-వేలం వివరాలు, సహాయం, ప్రక్రియ మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాబోయే బిడ్డరుదారులు : **శ్రీ. మహమ్మద్ రహీస్-81240 00030, మెసెర్స్. 4 క్లోజర్.; (సంప్రదించాల్సిన వ్యక్తి : శ్రీ.జయప్రకాశ్, ఫోన్ నెం.81420 00064, ఇ మెయిల్: prakash@bankauctions.in)** సంప్రదించవచ్చు.
2. నిబంధనలు మరియు షరతులపై తదుపరి వివరాల కోసం ఇ-వేలంలో పాల్గొనడానికి **https://bankauctions.in/ & www.cholamandalam.com/news/auction-notices** ని దయచేసి సందర్శించండి.

సెక్యురిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క (రూల్ 8 మరియు 9), రూల్ 9(1) క్రింద ఇది చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు కూడా

తేది : 23.10.2025
ప్రదేశం : చెన్నై
అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

తమిళనాడులో భారీ వర్షాలు..

- గోడలు కూలి ముగ్గురు మహిళల మృతి

చెన్నై : తమిళనాడులో భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు వేర్వేరు చోట్ల ఇళ్ల గోడలు కూలి ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. కడలూరు జిల్లా పుదుచత్రం సమీపంలోని అందర్ముల్లిపల్లెంలో బుధవారం ఇంటి గోడ కూలి అశోత్తై (69), ఆమె కుమార్తె జయ (40) మరణించినట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నారు. కళ్లకురిచ్చి సమీపంలోని కొంగరపాళయంలో ఇంటి గోడ కూలి 60 ఏళ్ల మహిళ వనమయిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడులో కురుస్తున్న వర్షాలకు 24,149 మంది నిరాశ్రయులయ్యారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం 215 సహాయక శిబిరాలు, 106 కమ్యూనిటీ కిచెన్ సెంటర్లను ఏర్పాటు చేసింది.

ఉగాండాలో ఘోర ప్రమాదం.. 63 మంది మృతి

ఉగాండా : ఉగాండాలో జరిగిన ఘోర ప్రమాదంలో 63 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి సమయంలో ఉత్తర ఉగాండాలోని ప్రధాన నగరమైన గులుకు వెళ్లే హైవేపై రెండు బస్సులు సహా నాలుగు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. వ్యతిరేక దిశలో వెళుతున్న రెండు బస్సులు ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో 63మంది మరణించారు. చాలామందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలిలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏనుగుల హల్ చల్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలో రంగంపేట, కందుల వారిపల్లె, చిన్నరామాపురం, భీమవరం తదితర ప్రాంతాలలో గత మూడు రోజులుగా తొమ్మిది ఏనుగుల గుంపు పంట పొలాలను భీభత్సంగా ధ్వంసం చేస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఏనుగులు గుంపు చిన్న రామాపురం, భీమవరం సమీపంలోని వరి, కొబ్బరి, అరటి పంటలను ధ్వంసం చేసి ఎగువ కూచువారిపల్లి సమీపంలో రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్మెంట్ నెంబర్ 48 నాగపట్ల వెస్ట్ బీట్ లోనికి ప్రవేశించాయని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. చుట్టు ప్రక్కల గ్రామస్తులంతా భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు . సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించి. ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఈ రోజు రాత్రికి రంగంపేట, నాగపట్ల పరిసర ప్రాంతాలలో కూడా సంచరించే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

'విద్యుత్'కు అంతరాయం లేకుండా చర్యలు

- మంత్రి గొట్టిపాటి రవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలపై డిస్కమ్‌ల సిఎమ్‌డిలతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్న సమాచారంతో అధికారులు మరింత సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కూలిన కరెంటు స్థంభాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎమ్‌డిలు శివ శంకర్, ఐ పృథ్వీతేజ్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులు ఈ నెల 28వ తేదీ రాత్రి 11:59 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విశాఖపట్నం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. అభ్యర్థులు షషష.నవీఝం- ంజూశీలీం.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

గరుడ వారధి పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి గరుడ వారధి పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకుగగగ అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ పార్క్ ఎదురుగా గరుడ వారిది ఫ్లై ఓవర్ నుంచి 40-50 మధ్య వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తిగా దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్లైఓవర్ నుంచి కింద పఙక్ష్మ రక్త గాయాలతో కొట్టుకుంటున్న వ్యక్తిని గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ అక్కడికి వచ్చేలోపు ఆ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు.

బిల్లులకు అను'గృహ'మెప్పుడో..!

- ఎన్‌టిఆర్ గృహ పథకం కింద లక్షలాది మందికి ఇళ్లు
- వైసిపి ప్రభుత్వ హయాంలో రెండుసార్లు సర్వే
- గతేడాది సెప్టెంబరులో మూడోసారి తనిఖీ
- రూ.50.33 కోట్లు పెండింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా 2014-19 కాలంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద సుమారు నాలుగు లక్షల మందికి మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బిసిలకు రూ.1.50 లక్షలతో స్కీమ్ ఒకటి కాగా, మరొకటి ఎస్‌సిలకు రూ.రెండు లక్షల పథకం. వాటిలో ఇళ్లు మంజూరై ఒక్క పైసా రాని వారు, కొంతమేర సొమ్ములు వచ్చిన వారూ ఉన్నారు. ఇళ్లు పూర్తయిన వాటికి బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం, అప్పటికి ఇంకా ఎవరూ ఇళ్లను పూర్తి చేయలేకపోవడంతో, లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. దీంతో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా తమ సొంత డబ్బులతో పునాదులు, రూఫ్ లెవల్ పనుల వరకు చేపట్టారు. తమ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉన్నపళంగా ఇంటి నిర్మాణ పనులు ఆపేశారు. కొందరికి పునాదులకు రూ.10 వేలు, 15 సిమెంట్ బస్తాలూ ఇచ్చారు. వారు పునాదులు వేసి వదిలేశారు. బిల్లుల కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రెండుసార్లు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు నాలుగు నెలల పాటు సర్వే చేశారు. సర్వేలో గుర్తించిన లబ్ధిదారులు, వారికి చెల్లించాల్సిన నగదు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ప్రకారం జిల్లాలో రూ.50.35 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి.

రెండు పర్యాయాలు వెరిఫికేషన్

టిడిపి హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించేందుకు తొలుత వైసిపి ప్రభుత్వం నిరాకరించింది. లబ్ధిదారుల నుంచి ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల వినతులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం... బిల్లులు చెల్లించేందుకు అంగీకరించింది. టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించింది. అర్హులను గుర్తించేందుకు 2022 డిసెంబరులో గృహనిర్మాణ శాఖ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించింది. వారంతా అర్హులేనని అధికారులు నిర్ధారించారు. గతేడాది జూన్‌లోనూ మరోసారి పరిశీలించారు. అందులోనూ వారు అర్హులేనని తేల్చారు. సర్వేలు చేసినా లబ్ధిదారులకు డబ్బులు మాత్రం చెల్లించలేదు.

ముచ్చటగా మూడోసారి తనిఖీ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత మూడోసారి ఇళ్ల తనిఖీ ప్రక్రియను చేపట్టింది. గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు గ్రామాల్లో ఈ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాకు సంబంధించి లబ్ధిదారుల వివరాలు, వాటికి సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు నగదు జమ చేయలేదు.

ఇల్లు కట్టి అప్పుల పాలయ్యాం

మాకు 2016లో ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం రూ.రెండు లక్షలు ఇస్తామని చెప్పింది. రెండు విడతల్లో రూ.1.27 లక్షలు మాత్రమే ఇచ్చింది. ఇప్పటికీ మిగిలిన రూ.73 వేలు చెల్లించలేదు. ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షల వరకు అప్పు చేశాం. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

- పి.రాజులు, తుడ్డలి, బూర్జ మండలం

బిల్లులు వెంటనే చెల్లించాలి

మాకు 2015లో ఇల్లు మంజూరైంది. ఇప్పటివరకు రూ.92 వేలు మాత్రమే ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి డబ్బులు చాలక అప్పు చేశాను. వ్యవసాయ, భవన నిర్మాణ కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తే కొంత సాయంగా ఉంటుంది.

- కుప్పిలి రామలక్ష్మి, దొంకలపర్త, బూర్జ

అగ్ని ప్రమాదంలో రేకుల షెడ్డు దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల కేంద్రమైన ముదినేపల్లిలో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.నాలుగు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతో కుటుంబ సభ్యులు కట్టు వస్త్రాలతో బయటపడ్డారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లిలోని మసీదు ఏరియాలో రెండో బజార్‌కు చెందిన మడ్డి నరసమ్మ (60) భోజన హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. భర్త వెంకటరమణ ఎనిమిదేళ్ల క్రితం మరణించారు. ఇంట్లో కుమారునితో కలిసి నివసిస్తుంది. ఉదయం ఏడు గంటల సమయంలో నరసమ్మ ఇంటి నుంచి హోటల్‌లో పనిచేసేందుకు వెళ్లింది. సుమారు ఎనిమిది గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. బీరువా, బీరువాలో దాచుకున్న రూ.నాలుగు లక్షల నగదుతో పాటు ఇంట్లోని ఫ్రిడ్జ్, టివి, ఇతర గృహోపకరణాలన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న కైకలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో అగ్ని బాధితులు కట్టు వస్త్రాలతో బయట పడ్డారు.

కన్న కూతురిపై అత్యాచారయత్నం

- తండ్రికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో కుమార్తెపై అఘాయిత్యానికి యత్నించిన తండ్రికి పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. బాధితురాలికి పరిహారంగా రూ.50వేలు మంజూరు చేస్తూ తీర్పు చెప్పారు. బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న కాసా నర్సింగరావు (42) 2024 జూలై 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రిస్తున్న తన 11ఏళ్ల కుమార్తెపై లైంగిక దాడికి యత్నించినట్లు బాలిక అమ్మమ్మ బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. అనంతరం, బొబ్బిలి సిఐ కె.సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నర్సింగరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి పరిహారంగా రూ.50 వేలును మంజూరు చేస్తూ తీర్పును వెల్లడించారు. పోలీసుల తరుపున ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం.ఖజానారావు వాదనలు వినిపించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన పోలీసు అధికారులను ఎస్‌పి ఎఆర్ దామోదర్ అభినందించారు.

మంచి సాహిత్యంతోనే మానవ సంబంధాలు మెరుగు

- యూనివర్సిటీలు లిటరేచర్ కోర్సులను ప్రవేశ పెట్టాలి
- ఎస్ఆర్ఎం వర్సిటీలో అమరావతి సాహిత్య ఉత్సవం ప్రారంభోత్సవంలో ప్రముఖ రచయిత్రి ఓల్గా పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

ఓల్గాకు జాపికను అందిస్తున్న వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్

విలువలతో కూడిన సాహిత్యం వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయని, సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత రచయిత్రి పి లలితకుమారి (ఓల్గా) అన్నారు. రాజధానిలోని ఎపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం అమరావతి సాహిత్య ఉత్సవాన్ని ఆమె ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓల్గా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రాశ్చాత్య పోకడలు పెరిగి నైతిక విలువలు పతనమవుతున్నాయని, అంతటా హింసా ప్రవృత్తి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, మెడికల్, న్యాయ కళాశాలల్లో మానవ విలువలను పెంపొందించే ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని సూచించారు. మంచి సాహిత్యం మానవ మనుగడను సుసంపన్నం చేస్తుందని, యువత భవితవ్యాలను ఉజ్వలం చేస్తుందని అన్నారు. శ్రీశ్రీ, వేమన, కరుణశ్రీ, గురజాడ వంటివారి సాహిత్యం ఇప్పటికీ ఆధునిక యువతను ప్రభావితం చేస్తోందన్నారు. తన సోదరి ఓల్గా మరణానంతరం ఆమె పేరును తన కలం పేరుగా మార్చుకుని రచనలు చేస్తున్నానని వివరించారు. యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ భాషలు, వాటి సాహిత్య విలువలను విద్యార్థుల్లో ప్రేరేపించే ప్రక్రియలో భాగంగా తొలిసారి వర్సిటీలో అమరావతి సాహిత్య ఉత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. కవులు, విమర్శకులు, సాహిత్యాభిలాషులను ఒకే వేదికపైకి తెచ్చి వారి ఆలోచనల నుంచి వచ్చే నూతన సజనలకు ప్రాణం పోయాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని మూడ్రోజులపాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆమ్లాన్ బైశ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్‌కుమార్, లిబరల్ ఆర్ట్స్ స్కూల్ డీన్ డాక్టర్ బిష్ణుపథ్, విభాగాధిపతి డాక్టర్ శయంటిన్ ఠాగూర్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కేసులో దాల్‌మిల్ సూరి అరెస్టు

- నాలుగు రాష్ట్రాల్లో మొత్తం 57 కేసులు- ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తన వ్యాపార వ్యూహాలతో రైతులు, వ్యాపారస్తులకు అధిక లాభాల ఆశ చూపి, వారి నుండి సరుకులు సేకరించి డబ్బు చెల్లించకుండా మోసం చేసిన కొత్తచెరువు దాల్‌మిల్ సూరిని అరెస్టు చేసినట్లు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. దాల్మిల్ సూరి గత కొన్ని సంవత్సరాల నుండి రైతులు వ్యాపారస్తుల నుండి అప్పు మీద ఆహార ధాన్యాలను కొనుగోలు చేస్తున్నాడని ఎస్‌పి తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారం పేరుతో అమాయక రైతులను, ప్రజలను చిన్నచిన్న వ్యాపారస్తులను మోసం చేసి వారి వద్ద నుండి భారీ మొత్తాలను దోచుకుని వారికి భారీ ఆర్థిక నష్టాన్ని కలగజేయడంతో ఇతనిపై 57 కేసులు నమోదైనట్లు వివరించారు. అంతేకాక అనేక నేరాలు, మోసాలు, వైట్ కాలర్ నేరాలు, ఎస్‌సి, ఎస్‌టిలపై దౌర్జన్యాలకు పాల్పడినట్లు కేసులున్నాయనిచెప్పారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఇతనిపై 26 కేసులు, రాష్ట్రంలోనే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో కలిపి మొత్తం 57 కేసులు నమోదయినట్లు తెలిపారు. వీటిలో కొందరితో రాజీ మార్గంలో వెళ్లి కేసులను ముగించారన్నారు. మరికొన్ని సివిల్ నేరాలుగా పరిగణించి కోర్టులో విచారణ దశలో ఉన్నాయని, మిగిలిన కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయని వివరించారు. కోర్టులో విచారణ దశ లో ఉన్న కేసులను సత్వరమే విచారణ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టి నిందితునికి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. దాల్మిల్ సూరిని ఆర్గనైజ్డ్ క్రిమినల్ గా గుర్తిస్తూ ఇతనిపై ఆర్గనైజ్డ్ క్రైమ్ కింద కేసులు నమోదు చేశామని, పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. దీనిని సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టులో పిటీషన్ వేయగా ఏపీ హైకోర్టు ఇతను నేర చరిత్రను పరిశీలించి పిటిషన్ డిస్మిస్ చేసిందని తెలిపారు. అంతేకాక ఇతని తమ్ముడు పాండు, కుటుంబ సభ్యులు రైతులు వ్యాపారస్తులు మోసగించారని, వారి ఆస్తులు, వారి బినామీల, కుటుంబ సభ్యుల మీద ఆస్తులను జప్తు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మృతదేహంతో పోలీస్టేషన్ వద్ద నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

సుమారు నెల రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహం లభించడంతో ఆ కుటుంబీకులు ఒక్కసారి ఖంగుతున్నారు. ఇది ఆత్మహత్య కాదని అతని మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని, తమకు న్యాయం చేయాలంటూ బుధవారం పోలీస్ స్టేషన్ ముందు మృతుని కుటుంబీకులు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత నెల 19వ తేదీన చినకాపవరానికి చెందిన కొదామ మార్కరాజు (35) కనిపించడం లేదంటూ అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మార్కరాజు చినకాపవరంలోని నిర్వహిస్తున్న తన బేకరీని రాత్రి 9 గంటలకు మూసివేసి స్నేహితులతో కలిసి బయటకెళ్లాడని, తిరిగి కనిపించలేదని 24వ తేదీ పోలీస్‌స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే మార్కరాజు నెల రోజుల తరువాత అనగా ఈనెల 22వ తేదీ బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ క్యాబిన్ రోడ్డు వద్ద పురుగుల మందు తాగినట్లు అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి తమకు ఫోన్ చేశాడని కుటుంబ సభ్యులు అంటున్నారు. వెంటనే అపస్మారక స్థితిలో ఉన్న మార్కరాజును ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లామని, మెరుగైన వైద్యం కోసం ఏలూరు తీసుకువెళ్లాలని డాక్టర్లు చెప్పారని, భీమవరం వర్మ హాస్పటల్‌కు తీసుకెళ్లామని, పరిస్థితి బాగోకపోవడంతో అక్కడ నుంచి విజయవాడ ఆస్పత్రి తీసుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అతను మృతి చెందాడని తెలిపారు. మార్కరాజు మృతిపట్ల అనుమానాలు ఉన్నాయని, అతనికి ఎవరో కావాలని పురుగుల మందు తాగించారని తెలిపారు. విచారణ జరిపి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సిఐ జగదీశ్వరరావు బంధువులకు సద్ది చెప్పి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని భీమవరం పోస్టుమార్టానికి పంపారు. ఎస్ఐ నాగరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదివాసీ మహిళల హక్కులు, రక్షణకు పోరాటాలు

- ఐద్వా జాతీయ కమిటీ కోశాధికారి ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:

గిరిజన ప్రాంతంలో ఆదివాసి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఐద్వా జాతీయ కమిటీ కోశాధికారి ఎస్ పుణ్యవతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో రెండు రోజులు పాటు ఐద్వా మహిళా సంఘం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐద్వా జాతీయ కమిటీ కోశాధికారి ఎస్ పుణ్యవతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలు గిరిజన ప్రాంతంలో చొరబడి హక్కులు, చట్టాన్ని ఉల్లంఘించి సంపదను కొల్లగొట్టాలనే ఆలోచనతో ఉన్నారని, వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం రెండు పార్టీలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయని, దీన్ని గమనించాలన్నారు.మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా పోరాడుతుందని తెలిపారు. మహిళల్లో ప్రశ్నించేతత్వం రావాలని చెప్పారు. మహిళలు హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో నేటికీ విద్య,వైద్యం మహిళలకు అందిన దాఖలు లేదని, నేటికీ గర్భిణీలను డోలిమోతలతోనే ఆస్పత్రికి తరలించవలసిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హేమావతి, జిల్లా నాయకులు వివి జయ, జిల్లా ఉపాధ్యక్షులు దేవుడమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి శశికళ తదితరులు పాల్గొన్నారు.

వజ్రాల వ్యాపారి అప్పగింతకు బెల్జియం అంగీకారం

- బ్యారక్ సిద్ధం చేసిన భారత్

న్యూఢిల్లీ: రూ.13,850 కోట్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని స్వదేశానికి రప్పించడానికి భారత ఏజెన్సీలు ఎనిమిదేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఊపందుకున్నాయి. చోక్సీని భారతదేశానికి అప్పగించడానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేవని, "అతనిపై ఉన్న ఆరోపణలు సమర్థించదగినంత తీవ్రమైనవి" అని బెల్జియం కోర్టు తీర్పు చెప్పిన తర్వాత అప్పగింత ప్రక్రియలో వేగం కనిపిస్తోంది. ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైల్లోని బ్యారక్ నంబర్ 12 లో చోక్సిని ఉంచటానికి చేసిన ఏర్పాట్ల చిత్రాలను కూడా దర్యాప్తు సంస్థలు బెల్జియం కోర్టుకు సమర్పించాయి. భారత జైళ్లు రద్దీగా ఉన్నాయని, తన భద్రతకు సురక్షితం కాదని చోక్సీ చేసిన వాదనలను తిప్పికొట్టడానికి ఈ చిత్రాలను అందజేశాయి. జనవరి 2, 2018న దేశం విడిచి పారిపోయినప్పటి నుంచి.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) , రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (ఆర్ఎడబ్ల్యూ) అనే సంస్థలు చోక్సిని వెంటాడుతున్నాయి. కోర్టు ఉత్తర్వులో చోక్సీ బెల్జియన్ పౌరుడు కాదని, విదేశీ పౌరుడని పేర్కొంది. భారత ఏజెన్సీల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 11, 2025న ఆంట్వెర్ప్‌లో అతన్ని అరెస్టు చేశారు. భారతదేశంలో 4,000 దుకాణాలతో కూడిన రిటైల్ జ్యువెలరీ సంస్థ గీతాంజలి గ్రూప్‌నకు చోక్సీ యజమాని. అతను తన మేనల్లుళ్లు నీరవ్ మోడీ, నీషల్ మోడీలతో కలిసి పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులతో కలిసి రూ.13,850 కోట్లకు పైగా మోసం చేశాడు. ఈ కుంభకోణం భారతదేశ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్దదిగా చెప్పబడుతోంది.

ప్రభుత్వం భయాన్ని సృష్టిస్తోంది

- సోనమ్ వాంగ్‌చుక్ బుల్లెట్‌కు బుల్లెట్‌తో సమాధానం చెప్పరు
- లడఖ్ పోరాటం శాంతియుతంగా కొనసాగుతుంది
- సోనమ్ భార్య గీతాంజలి జె ఆంగ్మో

న్యూఢిల్లీ : ప్రభుత్వం భయ వాతావరణాన్ని సృష్టిస్తున్నప్పటికీ.. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద రక్షణల కోసం లడఖ్ పోరాటం శాంతియుతంగా కొనసాగుతుందని లడఖ్ ఉద్యమ నేత, పర్యావరణ, సామాజిక కార్యకర్త అయిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య, హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ లడఖ్ సహ వ్యవస్థాపకురాలు, సీఈఓ అయిన గీతాంజలి జె ఆంగ్మో అన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ ప్రస్తుతం జైలులో ఉన్న విషయం విదితమే. గతనెల 26న కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇటీవల జోధ్‌పూర్ జైలులో వాంగ్‌చుక్‌ను ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఓ ఆంగ్ల వార్త సంస్థతో ఆమె మాట్లాడారు. ఇది ఆయన (వాంగ్‌చుక్)ను పోరాడుతున్న లక్ష్యానికి మరింత కట్టుబడి ఉండేలా చేసిందని చెప్పారు. ఆరో షెడ్యూల్ కింద రాజ్యాంగ రక్షణ కోసం డిమాండ్ చేస్తూ నిరసనకు నాయకత్వం వహించిన వాంగ్‌చుక్.. 35 రోజుల పాటు నిరాహారదీక్షలో ఉన్నారు. గతనెల 24న శాంతియుత నిరసనలు హింసాత్మకంగా మారడంతో నలుగురు మరణించగా.. 70 మందికి పైగా గాయపడ్డారు.

నిరసనకారులను అరెస్ట్ చేస్తూ, వారిని టార్చర్‌కు గురి చేస్తూ, కర్ఫ్యూలు, బలాన్ని ఉపయోగించి గొంతులను అణచివేయడం ద్వారా లడఖ్ ప్రజలలో ప్రభుత్వం, యంత్రాంగం భయాన్ని సృష్టిస్తున్నని గీతాంజలి జె.ఆంగ్మో ఆరోపించారు. వాంగ్‌చుక్ అరెస్ట్‌కు సరైన కారణాలు లేవనీ, అధికార యంత్రాంగాలు ఆయన చేసిన ప్రకటనలను తప్పుగా అర్థం చేసుకొని ఆయనపై దేశవ్యతిరేకి అనే ముద్ర వేశాయని అన్నారు. 35 రోజుల పాటు నిరాహార దీక్షలో, ఇప్పుడు జైలులో ఉన్నప్పటికీ.. లడఖ్, అక్కడి ప్రజల రక్షణ కోసం పోరాటానికి కట్టుబడే ఉన్నారని చెప్పారు. వారి పోరాటం గాంధీ సిద్ధాంతాలక అనుగుణంగా శాంతియుత మార్గంలో నడుస్తుందనీ, బుల్లెట్‌కు బుల్లెట్‌తో సమాధానం చెప్పరని అన్నారు. మీడియాతో మాట్లాడకుండా తనను నిరోధించడంపై గీతాంజలి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం పని చేసే తీరు ఇది కాదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తీరును ఆమె విమర్శించారు. వాంగ్‌చుక్ డిటెన్షన్ ఆర్డర్‌ను న్యాయపరంగా సవాలు చేస్తానని చెప్పారు. 'ది స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడఖ్ (ఎస్ఈసీఎంఓఎల్)కు ఫారీన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) లైసెన్స్ పునరుద్ధరించడం కోసం పోరాడతానని ఆమె తెలిపారు. విద్యా రంగంలో సంస్కరణల కోసం వాంగ్‌చుక్ స్థాపించిన సంస్థే ఎస్ఈసీఎంఓ. కాగా లడఖ్‌కు ఎట్టకేలకు స్వతంత్ర లేదా రాష్ట్ర హోదా వస్తుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. లడఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలనీ, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్ పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న పోరాటంలో వాంగ్‌చుక్ ముందున్న విషయం తెలిసిందే.

యువకుడిపై ఫోక్సో కేసు

- పరారీలో నిందితుడు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణంలోని రామాపురం కాలనీలో తొమ్మిదేళ్ల బాలికపై వరుసకు అన్నయ్య అయిన యువకుడే అఘాయిత్యానికి పాల్పడిన దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 19న జరిగిన ఈ ఘటనపై బాధిత బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సారిక వీధికి చెందిన దంపతుల తొమ్మిదేళ్ల కుమార్తె రామాపురం కాలనీలో గల తన అమ్మమ్మ ఇంటి వద్ద చదువుకుంటోంది. 19న రాత్రి అమ్మమ్మ పక్కన పడుకున్న బాలికను డోనక పవన్ కుమార్ అనే యువకుడు తన ఇంటి మేడపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే బయటకు విసిరిస్తానని బెదిరించడంతో భయపడిన బాలిక మొదట చెప్పలేదు. రెండు రోజుల పాటు బాలికలో మార్పు గమనించిన తల్లిదండ్రులు గట్టిగా అడగ్గా అసలు విషయం వెల్లడించింది. నిందితుడు డోనక పవన్‌కుమార్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని, 2018లో వృద్ధురాలిపై అత్యాచారం కేసులో ఏడాది పాటు రిమాండ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో సిఐ కె.మురళీధర్ నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుడు పరారీలో ఉన్న ట్లు పోలీసులు తెలిపారు.

శబరిమల అయ్యప్పను దర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తిరువనంతపురం : కేరళలోని ప్రసిద్ధ క్షేత్రం శబరిమలలో అయ్యప్ప స్వామిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం దర్శించుకున్నారు. బుధవారం ఉదయం పంబ నుంచి ఇరుముడితో ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాల ధరించి ఇరుముడితో 18 మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించుకున్నారు. అక్కడ ఇరుముడి సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనతో శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి భారత రాష్ట్రపతిగా ముర్ము నిలిచారు. రాష్ట్రపతి పర్యటన నిమిత్తం ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతికి తప్పిన ప్రమాదం..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రమాదం తప్పింది. బుధవారం ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కొచ్చిలోని ప్రమదం స్టేడియంలో ల్యాండింగ్ అయింది. ఆ సమయంలో ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా.. హెలిప్యాడ్ ఉన్నట్టుండి కుంగిపోయింది. దీంతో హెలికాప్టర్ చక్రం అందులో ఇరుక్కుపోయింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది రాష్ట్రపతిని సురక్షితంగా హెలికాప్టర్ నుంచి దించారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో పంబకు బయల్దేరారు.

తీవ్ర పేదరిక నిర్మూలనలో కేరళ రికార్డ్

- దేశంలో తొలి రాష్ట్రంగా ఘనత
- 1న ప్రకటించనున్న సిఎం పినరయి విజయన్



తిరువనంతపురం : ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ పాలనలో ఇప్పటికే అనేక రంగాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న కేరళ మరో ఘనత సాధించడానికి సిద్ధంగా ఉంది. రాష్ట్రం నుంచి తీవ్ర పేదరికాన్ని నిర్మూలించడం ద్వారా చరిత్ర సృష్టించే స్వర్ణ క్షణాన్ని త్వరలో అందుకోనుంది. కేరళ నుంచి తీవ్ర పేదరికాన్ని నిర్మూలించినట్లు నవంబర్ 1న ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించనున్నారు. రాజధాని తిరువనంతపురంలో సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో విజయన్ ఈ విషయాన్ని ప్రకటిస్తారని రాష్ట్ర స్థానిక స్వపరిపాలన మంత్రి ఎంబి రాజేష్ బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటులు కమల్‌హాసన్, మమ్ముట్టి, మోహన్‌లాల్ ముఖ్య అతిధులుగా హాజరవుతారు. రాష్ట్ర మంత్రులందరూ పాల్గొంటారు. ప్రధాన వేడుకకు ముందు, తరువాత కూడా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. నవంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానిక స్వపరిపాలన కార్యాలయాల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు.

నాలుగేళ్లలో లక్ష్యాన్ని సాధించిన ప్రభుత్వం

2021లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన మొదటి మంత్రివర్గ సమావేశంలో కేరళను అత్యంత పేదలు లేని రాష్ట్రంగా మార్చాలని నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం శాస్త్రీయ, సమగ్ర సర్వే ద్వారా 64,006 అత్యంత పేద కుటుంబాలను గుర్తించారు. ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి, గృహ నిర్మాణం వంటి అంశాల ఆధారంగా మనుగడ కష్టంగా ఉన్న కుటుంబాలను అత్యంత పేదలుగా పరిగణించారు. ఈ కుటంబాలకు అవసరమైన సహాయం, సేవలను అందించడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో స్థానిక స్వపరిపాలన శాఖ చొరవతో ఈ లక్ష్యం కోసం అన్ని ప్రభుత్వ వ్యవస్థలు, విభాగాలను, స్వచ్ఛంద సేవకులు, ప్రజలను సమీకరించారు. గుర్తించిన 64,006 కుటుంబాల్లో 4,421 కుటుంబాలు (వీటిలో ఎక్కువగా ఒంటరి సభ్యుల కుటుంబాలు) మరణించాయి. 261 సంచార కుటుంబాల జాడ తెలియడం లేదు. ఇవి ఇతర రాష్ట్రాలకు వలసపోయినట్లుగా భావిస్తున్నారు. స్థానిక సంస్థలు ఈ జాబితాలోని కుటుంబాల్లో ఇతర సభ్యులను చేర్చిన సంఘటనలు 47 కేసులు ఉన్నాయి. దీంతో అత్యంత పేద కుటుంబాలు 59,277ను ప్రత్యేక ప్రణాళిక అమలు చేయడం ద్వారా అభివృద్ధి చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఎంబి రాజేష్‌తో పాటు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, మంత్రి వి శివన్‌కుట్టీ, జనరల్ కన్వీనర్ టింకు బిస్వాల్ పాల్గొన్నారు.

నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల జోరు

- 211 మంది 321 నామినేషన్ పత్రాలు దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు భారీఎత్తున నామినేషన్‌లు దాఖలయ్యాయి. 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్‌లను వేశారు. చివరి రోజు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన వారికే టోకెన్‌లు ఇచ్చి నామినేషన్‌లను స్వీకరించారు. 13వ తేదీన ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో మొదటి రోజు 11 మంది 22 నామినేషన్లు దాఖలు చేయగా.. 18వ తేదీ వరకు మొత్తం 127 నామినేషన్లు దాఖలయ్యాయి. 22న చివరిరోజు 117 మంది అభ్యర్థులు 194 నామినేషన్లు దాఖలు చేశారు. ఆది, సోమవారం సెలవు కావడం, మంగళవారం ఒక్కరోజే అవకాశం ఉండటంతో అభ్యర్థులు భారీఎత్తున తరలివచ్చారు. అభ్యర్థులతోపాటు వారిని బలపరిచేందుకు వచ్చిన వారితో ఎన్నికల అధికారి కార్యాలయం ఆవరణ ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా కిటకిటలాడింది. నామినేషన్‌లను పరిశీలించే క్రమంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్‌లపై ఇరువైపులా కొన్ని అభ్యంతరాలు వచ్చినప్పటికీ, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బిఆర్‌ఎస్ నుంచి మాగంటి సునీత నామినేషన్‌లను ఎన్నికల అధికారులు ఆమోదించారు.

పలువురు అభ్యర్థుల ఆందోళన

వివిధ కారణాలతో కొంతమంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. దాంతో ఎలాంటి కారణాలూ లేకుండా తమ నామినేషన్ తిరస్కరించారని కొంతమంది అభ్యర్థులు ఆర్‌ఒ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. పత్రాలన్నీ సరిగ్గా ఉన్నప్పటికీ కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. రిటర్నింగ్ అధికారి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. ఇదిలావుండగా, 24న నామినేషన్ల విత్ డ్రా చేసుకునే వారి సంఖ్య సైతం భారీగానే ఉండొచ్చని చర్చ జరుగుతోంది. కనీసం 150 మంది వరకు పోటీలో ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు.

చార్జిషీట్ కారణంతో ఒసిఐ రద్దు వద్దు!

- రిజిస్ట్రేషన్ రద్దు నోటిఫికేషన్‌పై సిపిఎం ఆందోళన
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ లేఖ

న్యూఢిల్లీ : నిర్దిష్ట నేరాల్లో ఛార్జిషీట్ దాఖలు చేశారనే కారణంతో ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసిఐ) రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడానికి అనుమతిస్తూ కేంద్రప్రభుత్వం ఇటీవల పౌరసత్వ చట్టం, 1955 కింద నోటిఫికేషన్ జారీ చేయడంపై సిపిఎం పార్లమెంట్ సభ్యులు జాన్ బ్రిట్టాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన హోం మంత్రి అమిత్ షాకు ఒక లేఖ రాశారు. ఇటువంటి చర్య తీసుకోవడం వల్ల తీవ్రమైన చట్టపరమైన, రాజ్యాంగపరమైన, విధానపరమైన ఆందోళనలు తలెత్తుతాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఓసిఐ కార్డుదారులను ప్రభావితం చేసే ఏ చర్య అయినా కచ్చితంగా చట్టానికి అనుగుణంగా వుండేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సరైన అధికార పరిధి కలిగిన న్యాయస్థానం సముచితమైన న్యాయ నిర్ణయం తీసుకున్న తర్వాత మాత్రమే ఈ చర్యలు వుండాలని సూచించారు. "దీనికున్న చట్టపరమైన బలహీనతలే కాకుండా, ఈ చర్య సహజ న్యాయం, సముచితమైన ప్రక్రియ, దామాషా సూత్రాల కింద కూడా ఆందోళనలను లేవనెత్తుతోంది. రిజిస్ట్రేషన్ రద్దుకు ముందుగా న్యాయపరమైన నిర్ధారణ లేకపోతే ఒసిఐ కార్డుదారులు ఏకపక్షంగా లేదా పక్షపాతంతో కూడిన చర్యలకు గురవుతారు. తద్వారా చట్టం ముందు అందరూ సమానమే అంటూ న్యాయానికి రాజ్యాంగపరంగా ఇచ్చిన హామీలు దెబ్బతింటాయి. ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్యక్రమం సుదీర్ఘకాలంగా భారతదేశ పారదర్శకతకు, అందరినీ కలుపుకునిపోయే తత్వానికి, నాగరికత కొనసాగింపునకు, మన శక్తిని బలోపేతం చేసేందుకు, విదేశాల్లోని మన వారితో గల భావోద్వేగ బంధాలను మరింత పరిపుష్టం చేసేందుకు ఒక చిహ్నంగా నిలిచివుంది." అని బ్రిట్టాస్ ఆ లేఖలో పేర్కొన్నారు.

ఎవరు దోషులో న్యాయపరమైన నిర్ధారణ జరగకుండా కేవలం ఛార్జిషీట్ దాఖలు చేశారనే కారణంతోనే ఒసిఐ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడం అనేక చట్టపరమైన, రాజ్యాంగపరమైన అంశాలను లేవనెత్తుతుందని సిపిఎం ఎంపి పేర్కొన్నారు. "కేవలం పోలీసు డాక్యుమెంట్‌గా వుండే ఛార్జిషీట్‌లో ఎలాంటి సాక్ష్యాధారాలు లేదా న్యాయపరమైన తుది తీర్పు వుండవు. మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన-1948 ప్రకారం, శిక్షార్హమైన నేరానికి పాల్పడిన ప్రతి ఒక్కరూ చట్టానికి అనుగుణంగా సాగే బహిరంగ విచారణా ప్రక్రియలో దోషులని తేలేంతవరకు వారు అమాయకులేనని భావించాల్సి వుంటుందనే సూత్రం పొందుపరచబడిందని, వారి రక్షణకు అవసరమైన అన్ని హామీలనూ అమలు చేయాల్సి వుంటుందని " ఆయన పేర్కొన్నారు.

కేంద్రం జారీ చేసిన ఈ నోటిఫికేషన్ పార్లమెంట్ అనుమతి లేకుండానే మాతృక చట్టాన్ని సమర్థవంతంగా సవరిస్తోందని ఎంపి పేర్కొన్నారు. ఎందుకంటే, చార్జిషీట్ దాఖలైందంటూ రిజిస్ట్రేషన్ రద్దుకు కొత్త కారణాలను చూపేందుకు చట్టం అధికారాన్ని ఇవ్వలేదన్నారు. ఒసిఐ కార్డుదారుడు తన తల్లిదండ్రులను, బంధువులను చూసేందుకు తరచుగా భారతదేశాన్ని సందర్శిస్తాడని, ఇక్కడ సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొంటాడని, భారత సంస్థల్లో పెట్టుబడులు పెడుతూ దేశాభివృద్ధికి గణనీయంగా దోహదపడతాడని బ్రిట్టాస్ తన లేఖలో పేర్కొన్నారు.

"భారతదేశ ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో అత్యంత అంకిత భావం కలిగిన భాగస్వాములుగా నిరంతరంగా సేవలందిస్తూ వుండే అంతర్జాతీయ ప్రవాస భారతీయుల్లో ఈ నిబంధన తీవ్రమైన ఆందోళన రేకెత్తించింది. ఒసిఐ కార్డుదారులు భారత్‌తో కుటుంబ సంబంధాల పరంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా, ఆర్థికపరంగా లోతైన సంబంధాలను కలిగివున్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలోనే భారత్‌కు వీరి ద్వారా 135.46 బిలియన్ల డాలర్ల చెల్లింపులు అందాయి. గతేడాది కన్నా ఇది 14శాతం ఎక్కువ. ఇది, దేశ జిడిపిలో మూడు శాతానికి మించి వుంది. తద్వారా అంతర్జాతీయంగా ఇటువంటి చెల్లింపులు అందుకునే దేశాల్లో భారత్ అగ్రస్థానంలో వుంది. స్వదేశానికి ఇలా పంపే మొత్తాలే కాకుండా, వారి పెట్టుబడులు, దాతృత్వం, సాంకేతిక సహకారం ఇవన్నీ కూడా భారతదేశ ఆర్థిక, సామాజిక కూర్పును అంచనాలకు మించి బలోపేతం చేస్తున్నాయి." అని ఆ లేఖ పేర్కొంది.

ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఒసిఐ) అంటే విదేశీ పౌరసత్వం కలిగిన భారత సంతతి ప్రజలకు మంజూరుచేసే శాశ్వత నివాస హోదా. ఒసిఐ కార్డుదారులు పూర్తిస్థాయి భారత పౌరులు కాదు. వారు ఇక్కడ ఓటు వేయలేరు. ప్రభుత్వ పదవులను నిర్వహించలేరు, వ్యవసాయ భూమిని కొనుగోలు చేయలేరు. కానీ వీసా లేకుండా వారు భారత్‌కు ప్రయాణం చేయగలరు. ఎంతకాలం కావాలంటే అంతకాలం వుండొచ్చు, ప్రవాస భారతీయుల మాదిరిగానే చాలా హక్కులు కలిగి వుంటారు. అంటే ఇక్కడ పనిచేయడం, చదువుకోవడం, స్వంతంగా వ్యవసాయేతర ఆస్తులను కలిగివుండడం వంటివి వుంటాయి. భారత్‌కు, అంతర్జాతీయంగా ఇతర దేశాలకు మధ్య పటిష్ట సంబంధాలు కొనసాగించేందుకు ఈ పథకం ఉద్దేశించబడింది.

సుదీర్ఘమైన పనిగంటల నుండి రిలీఫ్ !

- ప్రైవేటు ఉద్యోగుల కోసం కేరళ అసెంబ్లీలో బిల్లు

తిరువనంతపురం : సుదీర్ఘమైన పనిగంటలతో తీవ్రంగా పని ఒత్తిళ్లను ఎదుర్కొంటూ వ్యక్తిగత జీవితానికి, వృత్తి జీవితానికి మధ్య సమతుల్యతను పాటించలేకపోతున్న ప్రైవేటు ఉద్యోగులకు ఉపశమనం కలిగించేందుకు కేరళ అసెంబ్లీలో ఒక బిల్లును ప్రవేశపెడుతున్నారు. కేరళ రైట్స్ టు డిస్‌కనెక్ట్ బిల్ పేరుతో తీసుకువచ్చే ఈ ప్రైవేటు మెంబర్ బిల్లును చీఫ్ విప్, కంజిరాపల్లి ఎంఎల్‌ఎ డాక్టర్ ఎన్.జయరాజ్ ప్రవేశపెట్టనున్నారు. ఆఫీసు పనిగంటలకు మించి అధికంగా శ్రమిస్తున్న ప్రైవేటురంగ ఉద్యోగులను కాపాడడమే ఈ బిల్లు లక్ష్యం. ఆఫీసు పనిగంటలు ముగిసిన తర్వాత పనికి సంబంధించిన కాల్స్, ఇ మెయిల్స్, సమావేశాలు, లేదా సందేశాలు వీటన్నింటినీ ఉద్యోగులు పట్టించుకోకుండా, విస్మరించే హక్కును ఈ బిల్లు కల్పిస్తుంది. తమను విధుల నుండి తొలగిస్తారేమో, ప్రమోషన్లు ఇవ్వరేమో అనే భయం లేకుండా ఉద్యోగులు ఈ చర్యలు తీసుకోవచ్చు. మితిమీరిన పనిభారం, లేఆఫ్‌లు లేదా ఎలాంటి చెల్లింపులు లేకుండా ఓవర్‌టైమ్ చేయడం వంటి వాటికి సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రాంతీయ జాయింట్ లేబర్ కమిషనర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇబ్బందుల పరిష్కార కమిటీలను ఏర్పాటు చేయాలని కూడా ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడే గణనీయమైన చర్యగా ఉద్యోగ సంఘాలు ఈ బిల్లును అభివర్ణించాయి. కేరళ రాష్ట్ర ఐటి ఉద్యోగుల సంక్షేమ సంస్థ అయిన ప్రతిధ్వని దీనిపై ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టింది.

ఇంధన ట్యాంకర్ బోల్తాపడి 35 మంది మృతి

- నైజీరియాలో విషాదం

అబుజా : నైజీరియాలోని ఉత్తర నైజర్ రాష్ట్రంలో మంగళవారం ఒక ఇంధన ట్యాంకర్ బోల్తా పడి 35 మంది మరణించారని ఫెడరల్ రోడ్ సేఫ్టీ పోలీసులు తెలిపింది. రోడ్డుపై బోల్తా పడిన ట్యాంకర్ నుండి పెట్రోల్ లీక్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. దీంతో తీవ్ర ప్రాణ నష్టం సంభవించింది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆఫ్రికాలోని అత్యంత జనాభా కలిగిన ఆ దేశంలో ఇటువంటి సంఘటనలు సర్వసాధారణమని రాయిటర్స్ పేర్కొంది. ఇక్కడ పరిమిత పైప్‌లైన్ మౌలిక సదుపాయాల కారణంగా పెట్రోలియం ఉత్పత్తులు రోడ్డు ద్వారా రవాణా చేయబడతాయని, గుంతలతో రోడ్లు ఉండటంతో ప్రమాదాలు సర్వసాధారణమని తెలిపింది.

జీవికా దీదీలకు నెలకు రూ.30వేలు

(మొదటిపేజి తరువాయి)

పార్టీల మధ్య సుమారు 10 సీట్లలో స్నేహ పూర్వక పోటీ ఉండవచ్చని, ఈ అంశాన్ని విభేదాలుగా చూడకూడదని చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నాటికి సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. బుధవారం లాలూతో సమావేశానికి ముందు తేజస్వి యాదవ్‌తో కూడా గెహ్లాట్ సమావేశమయ్యారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

మంగళవారంతో బీహార్‌లో రెండో దశ ఎన్నికలకు కూడా నామినేషన్ ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీకి దిగింది. ఆర్‌జెడి 143 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించగా.. సిపిఐ తొమ్మిది, సిపిఎం నాలుగు స్థానాల్లో బరిలోకి దిగాయి. బీహార్ కాంగ్రెస్ ప్రతినిధి అసిత్ తివారీ మాట్లాడుతూ.. తాము ఎల్లప్పుడూ సంకీర్ణ ధర్మాన్ని అనుసరిస్తామన్నారు. బీహార్‌లో నవంబరు 6, 11వ తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

సిఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను అంగీకరిస్తున్నాం : సిపిఐ(ఎంఎల్)

ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్‌ను ఇండియా బ్లాక్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆమోదిస్తున్నామని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య బుధవారం ప్రకటించారు. పాట్నాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి అభ్యర్థిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుంది. ఎన్నికల్లో ఇండియా వేదిక మెజార్టీ సాధిస్తుందని, తేజస్వి యాదవ్ ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర ప్రజలకు తెలుసు. ఇందులో ఎటువంటి గందరగోళం లేదు' అని చెప్పారు.

సిబిఐ కోర్టు దోషిగా నిర్ధారించిన సహానీని పార్టీలో చేర్చుకున్న బిజెపి

స్వచ్ఛ రాజకీయాలంటూ ఊరూవాడా ప్రచారం చేసే బిజెపి... ఒక మోసం కేసులో సిబిఐ కోర్టు దోషిగా నిర్ధారించిన మాజీ ఎంపి, ఆర్‌జెడి నాయకుడు అనిల్ సహానీని బుధవారం పార్టీలో చేర్చుకుంది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, అసెంబ్లీ ఎన్నికల బిజెపి ఇన్‌ఛార్జ్, జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తవ్డే సమక్షంలో సహానీ కాషాయ పార్టీలో చేరారు. రాజ్యసభ ఎంపిగా ఉన్న సమయంలో లీవ్ ట్రావెల్ కన్సెషన్ పొందేందుకు ప్రయాణం చేయకుండానే నకిలీ విమాన టిక్కెట్లను దాఖలు చేశారనే కేసులో సిబిఐ కోర్టు 2012లో సహానీ దోషిగా నిర్ధారించింది. దీంతో మూడేళ్ల పాటు సహాని నిషేధం ఎదుర్కొన్నారు.

కాలుష్య సంక్షోభంపై ట్యునీసియాలో ప్రజాగ్రహం

- గేబ్స్ నగరంలో స్తంభించిన జనజీవనం
- ప్రజల ప్రాణాలను ముప్పు కలిగిస్తున్న కర్మాగారాన్ని మూసివేయాలని డిమాండ్

ఆందోళన చేస్తున్న ప్రజలు

ట్యునిస్ : ప్రభుత్వం నడుపుతున్న ఓ రసాయన కర్మాగారంపై ట్యునీసియాలోని గేబ్స్ నగరంలో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఈ కర్మారాగం కాలుష్యాన్ని వెదజల్లుతూ ప్రాణాలకు ముప్పుగా పరిణమించిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య సంక్షోభానికి కారణమవుతున్న రసాయన కర్మాగారాన్ని తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది ప్రజలు మంగళవారం సమ్మె బాట పట్టారు. దీంతో నగరంలో జనజీవనం స్తంభించింది. దుకాణాలు, మార్కెట్లు, పాఠశాలలు, కేఫ్‌లను మూసివేశారు.ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయి. యుజిటిటి కార్మిక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో ఆందోళన జరుగుతోంది.

గేబ్స్ నగరంలో ప్రభుత్వం జిజిటి ఫాస్ఫేట్ ప్లాంటును నిర్వహిస్తోంది. ఇది అనేక సంవత్సరాలుగా కాలుష్యాన్ని వెదజల్లుతూ స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. దీని కారణంగా వేలాది ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా వేలాది మంది స్థానికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'జీవించాలని గేబ్స్ కోరుకుంటోంది', కాలుష్య ప్లాంట్లను ధ్వంసం చేయండి' అంటూ వారు నినాదాలు చేశారు. సమ్మెతో గేబ్స్ నగరం స్తంభించిందని, విద్యా వ్యాపార సంస్థలు మూతపడ్డాయని యూజీటీటీ స్థానిక ప్రతినిధి సాసీన్ నైసర్ చెప్పారు. నగరంలో నెలకొన్న పర్యావరణ విపత్తు పరిస్థితిపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.

దేశాధ్యక్షుడికి నిరసన సెగలు

గేబ్స్ నగర జనాభా సుమారు నాలుగు లక్షలు. ఇటీవలి కాలంలో అక్కడ తరచూ ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్లాంటును తక్షణమే మూసివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 2021లో అసాధారణ అధికారాలను చేజిక్కించుకున్న దేశాధ్యక్షుడు కయిస్ సయిద్‌కు ఈ నిరసనలు సవాలుగా నిలిచాయి. ప్రస్తుత పరిస్థితిని ఆయన 'పర్యావరణ హత్య'గా అభివర్ణించారు. కాలుష్యం కారణంగా ప్రజలు క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, దీనికి గత పాలకులే కారణమని ఆరోపించారు. స్థానిక పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినడానికి వారే కారకులని నిందించారు.

ఉత్పత్తిని మరింత పెంచే యోచన

గేబ్స్‌లో 1972లో ప్రారంభమైన రసాయన కర్మాగారం ఎరువులను ఉత్పత్తి చేస్తోంది. దీని నుంచి వెలువడుతున్న రేడియో ధార్మిక వ్యర్థాలు, ఫాస్ఫోజిప్సమ్ (ఫాస్ఫేట్ ఎరువుల ఉత్పత్తిలో వచ్చే ఓ రసాయన పదార్థం) సముద్రంలోనూ, గాలిలోనూ కలుస్తున్నాయి.

అవి విష వాయువుల వ్యాప్తికి, క్యాన్సర్ కేసులు పెరగడానికి, సముద్ర జీవనం నాశనం అవడానికి కారణమవుతున్నాయి. తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతోనూ, విష వాయువుల ప్రభావంతోనూ ఇటీవలి కాలంలో 200 మందికి పైగా ప్రజలు ఆస్పత్రుల పాలయ్యారు. ఈ కర్మాగారం చెట్లు, సముద్రం... చివరికి ప్రజలను కూడా విషతుల్యం చేస్తోంది. దానిమ్మ పండ్ల రుచి కూడా మారిపోతోంది. ప్లాంటును దశల వారీగా మూసివేస్తామని 2017లో ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు. పైగా ఈ సంవత్సరం ఉత్పత్తిని పెంచాలని యోచిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఫాస్ఫేట్ మూలస్తంభమని అధికారులు వాదిస్తున్నారు. వాయు ఉద్గారాలను అదుపు చేయడానికి అత్యవసర చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయంలో సాయపడేందుకు చైనా కంపెనీలను రప్పించామని అధికారులు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో దారుణం

- దళితుడిపై దాడి..మూత్రం తాగాలని బలవంతం
- ముగ్గురి అరెస్ట్.. నిందితులపై కేసులు నమోదు
- కొనసాగుతున్న దర్యాప్తు

భోపాల్ : బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో అమానవీయ ఘటన చోటు చేసుకున్నది. ఓ దళిత యువకుడి(25)పై దాడి చేసిన కొందరు దుండగులు.. బాధితుడితో బలవంతంగా మూత్రం తాగించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. భిండ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. బాధిత వ్యక్తి తన వద్ద డ్రైవర్‌గా పని చేయడం మానేసిన తర్వాత ప్రధాన నిందితుడు ఆ వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్నాడని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడనీ, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

వివరాల్లోకెళ్తే... సోమవారం ముగ్గురు వ్యక్తులు బాధితుడిని గ్వాలియర్ నుంచి అపహరించారు. ఆ తర్వాత ఆయనను వాహనంలో భిండ్‌కు తీసుకొచ్చారు. అక్కడ బాధితుడిని కొట్టి, ఆయనతో బలవంతంగా మూత్రం తాగించారు. బాధితుడు భిండ్‌లోని సుర్పురా పోలీస్ స్టేషన్ పరిధిలోని అకుత్‌పురా గ్రామ నివాసి. "గ్వాలియర్‌లోని దీన్‌దయాళ్ నగర్ ప్రాంతం నుంచి నన్ను అపహరించారు. ఓ వాహనంలో భిండ్‌కు తీసుకెళ్లారు. ఆ తర్వాత అక్కడ నన్ను ప్లాస్టిక్ పైపుతో కొట్టారు. ముగ్గురు వ్యక్తులు వాహనాన్ని మధ్యలో ఆపి.. బాటిల్‌లో మూత్రం తాగాలని బలవంతం చేశారు" అని బాధితుడు ఆరోపించాడు. ఆ తర్వాత నిందితులు.. ఆ వ్యక్తిని అకుత్‌పురా గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఇనుప గొలుసుతో కట్టేసి బాధితుడి చేత మళ్లీ బలవంతంగా మూత్రం తాగించారు.

బాధితుడు.. దత్తావలి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు సోను బారువా దగ్గర డ్రైవర్‌గా పని చేశాడు. ఇటీవలే ఆయన వద్ద పనిని మానేశాడు. అయితే తన వద్ద డ్రైవర్‌గా పని చేయకపోవడంతో సోను బారువా.. బాధితుడిని లక్ష్యంగా చేసుకున్నాడు. కాగా బాధితుడికి ఆస్పత్రిలో చికిత్స అందుతున్నట్టు పోలీసులు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద నిందితులపై కేసులు నమోదు చేసినట్టు పోలీసు అధికారులు చెప్పారు. అరెస్టయిన ముగ్గురు నిందితులను సోను బారువా, అలోక్ వర్మ, చోటు ఓజాగా గుర్తించినట్టు తెలిపారు.

రాష్ట్రంలో దళితులపై వరుసగా జరుగుతున్న దాడులు ఆందోళనను కలిగిస్తున్నాయి. కట్ని జిల్లాలో అక్రమ మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న దళిత యువకుడిని నలుగురు వ్యక్తులు కొట్టి మూత్ర విసర్జన చేసిన కొన్ని రోజుల తర్వాతే ఈ ఘటన జరగటం గమనార్హం. బీజేపీ పాలనలో దళితులు, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళితులపై ఇలాంటి అమానుష ఘోరాలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఒప్పందం కుదిరినా ప్రాణభయంతోనే పాలస్తీనియన్లు

- బందీల మృతదేహాల అప్పగింతలు

రోదిస్తున్న మృతుల బంధువులు

గాజా, జెరూసలేం : కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి పది రోజులు గడిచినా తమ జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులేమీ కనిపించడం లేదని పాలస్తీనియన్లు వాపోతున్నారు. ఇజ్రాయిల్ బలగాలు చెదురుమదురుగా కాల్పులు జరుపుతునే వున్నాయని, ఆహార ట్రక్కులు రాకుండా అడ్డుకుంటునే వున్నాయని, దాంతో తమకు పాట్లు తప్పడం లేదని వారు పేర్కొంటున్నారు. గాజాలోకి ప్రవేశించేందుకు ఆరు వేలకు పైగా ట్రక్కులు వేచి వున్నాయని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. ఇదిలావుండగా, దాడుల సమయంలో శిథిలాల గుట్టల కింద చిక్కుకునిపోయి మరణించిన తమ వారి మృతదేహాలను వెలికి తీయడం రోజురోజుకు సవాలుగా మారుతోంది. ఇంకా వేలాది మృతదేహాలు అక్కడే వున్నాయని గాజా పౌర రక్షణ దళ సభ్యుడు తెలిపారు. పరిమితమైన పరికరాలు వుండడంతో పని సాగడం లేదని చెప్పారు. హమాస్ తన వద్ద గల మరో ఇద్దరు బందీల మృతదేహాలను ఇజ్రాయిల్‌కు గత రాత్రి అప్పగించింది. వీరిలో ఒకరు సైనికుడు కాగా, మరొకరు సామాన్య పౌరుడు. మరోవైపు ఇజ్రాయిల్ కూడా మరో 30మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగించింది. వారి శరీరాలపై వేధించిన, కొట్టిన గుర్తులు కనిపిస్తున్నాయని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. కళ్లకు గంతలు కట్టేసి, చేతులకు సంకెళ్లు వేసి కూడా వున్నాయని పేర్కొన్నారు. గాజాలో టుఫా ప్రాంతంలో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించారు. హిజ్బుల్లా కార్యకర్తను లక్ష్యంగా చేసుకుని దాడి చేశామని ఇజ్రాయిల్ చెప్పింది. గత రాత్రి, తెల్లవారుజామున జరిపిన దాడుల్లో ఒక చిన్నారితో సహా 45మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి.

నెతన్యాహు, హెర్జోగ్‌లతో వాన్స్ భేటీ

అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ బుధవారం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌లతో విడివిడిగా భేటీ అయ్యారు. ఈ ప్రాంతానికి, ఇజ్రాయిల్‌కు, పొరుగున గల పాలస్తీనియన్లకు ఆశలు చిగురించేలా, మన ముందుతరాల భవిష్యత్తు కోసం మనం ముందుకు సాగాల్సి వుందని ఈ సందర్భంగా హెర్జోగ్ వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని సజావుగా అమలు చేయడం అంత సులభం కాదని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ నిలబెట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆయుధాలు అప్పగించాలి లేదా లాక్కుంటాం : ట్రంప్

హమాస్ ఆయుధాలన్నింటినీ అప్పగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. లేదంటే తాము బలవంతంగా లాక్కుంటామని బెదిరించారు. హమాస్ ఇంతవరకు దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

తిరుపతి జిల్లాలో కుండపోత

(మొదటిపేజి తరువాయి)

ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఆకస్మిక వరదలు రావచ్చనే హెచ్చరికల నేపథ్యంలో రాత్రింబవళ్లు సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లాల అధికారులకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి భారీ వర్షాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ దక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాల నేపథ్యంలో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అన్నారు. జిల్లాల్లో కంట్రోల్ రూములు అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్‌ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాల కోరారు.

పిడుగుపాటుకు ఇద్దరు మహిళా వ్యవసాయ కార్మికులు మృతి

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఇటికెంపాడులో పిడుగుపాటుకు పొన్నూరు పట్టణానికి చెందిన వలపర్ల కమల అలియాస్ మరియమ్మ (45), షేక్ ముజాహిద (45) మృతి చెందారు. పొన్నూరు శివారులోని ఇటికెంపాడులో వరి పొలాల్లో కలుపుతీత పనులు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన నీలం మాణిక్యమ్మను పొన్నూరు ఆస్పత్రికి తరలించారు

గురుకుల విద్యార్థినిపై అత్యాచారం

(మొదటిపేజి తరువాయి)

అదుపులోకి తీసుకొని పోస్కో, అత్యాచారం, కిడ్నాప్ కేసులు నమోదు చేశామని డిఎస్‌పి తెలిపారు.

48 గంటల్లో నివేదిక ఇవ్వాలని మహిళా కమిషన్ ఆదేశం

ఈ ఘటనలపై తాము సుమోటోగా కేసును స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ ఎస్‌పితో ఫోన్లో ఆమె మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హేయమైన చర్యలకు పాల్పడిన వారు ఏ స్థాయివారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనన్నారు. బాధిత విద్యార్థినికి తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను, చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆదేశించారు. ఈ ఘటనపై 48 గంటల్లో నివేదిక అందజేయాలని జిల్లా పోలీస్ శాఖకు నోటీస్ జారీ చేశారు.

షాక్‌కు గురయ్యా.. : మంత్రి లోకేష్

తుని రూరల్ గురుకుల పాఠశాల విద్యార్థినిపై తాటిక నారాయణరావు అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు తెలిసిన వెంటనే షాక్‌కు గురైనట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘటన వివరాలు తెలిసిన వెంటనే పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలకు పాల్పడినవారిపై ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. బాధితురాలు ధైర్యంగా ఉండేలా కౌన్సెలింగ్ ఇచ్చి, అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థినులకు పటిష్టమైన భద్రత కల్పించాల్సిందిగా అధికారులకు ఆదేశించారు.

మీకోసం

ధనియాలు నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటే నోటి దుర్వాసన తగ్గుతుంది.

జీవన సౌరభం

ఓ మంచి ఆలోచన లక్షలాదిమందిని కదిలిస్తుంది. లక్షలాది మందిలో కదలిక ఒక సమాజాన్ని కదిలిస్తుంది.

JEEVANA జీవన the family

కిట్టూ

రాజారాం గ్రామంలో కిట్టూ అనే చిన్న అబ్బాయి ఉన్నాడు. కిట్టూకు ఆడుకోవడమంటే చాలా ఇష్టం. కానీ వాళ్ళ ఇంటి చుట్టూ ఉన్న మురికి నీటి వల్ల సాయంత్రం కాగానే బోలెడన్ని దోమలు వచ్చేవి. అవి కుట్టడం వల్ల కిట్టూకి జ్వరం వచ్చింది. కిట్టూ మంచం మీద పడుకుని బాధపడుతుంటే, వాళ్ళ అమ్మ వచ్చి, 'దోమలను తరిమేయడానికి ఏదైనా చేయాలి. ముందు మన ఇంటి చుట్టూ ఉన్న నిల్వ నీటిని పారబోయాలి' అంది. అమ్మ మాటలకి కిట్టూ చాలా ఆశ్చర్యపోయాడు. 'అదేంటి అమ్మా? దోమలకు నీటితో ఏంటి సంబంధం?' అని అడిగాడు. అప్పుడు అమ్మ నవ్వి, 'దోమలు నిల్వ వున్న మురికి నీటిలో గుడ్లు పెడతాయి. ఆ గుడ్ల నుండి పిల్ల దోమలు వస్తాయి. మనం ఆ నీటిని లేకుండా చేస్తే, కొత్త దోమలు పుట్టవు కదా! అందుకే ఇంటి చుట్టూ, బకెట్లలో, పాత వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం లేదా కనీసం వారానికి ఒకసారి శుభ్రం చేయడం అనేది దోమలను నియంత్రించడానికి సరైన మార్గం' అని చెప్పింది.

కిట్టూ కోలుకున్నాక, వాళ్ల అమ్మతో కలిసి ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ డబ్బాల్లో, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోశాడు. డ్రైనేజీ కాలువలపై మట్టి పోశాడు. కొన్ని రోజులకు ఆ పరిసరాల్లో దోమలు తగ్గిపోయాయి. కిట్టూ సంతోషంగా ఆడుకోవడం మొదలుపెట్టాడు. పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం. 'సమస్య మూలాన్ని సరిచేస్తే, సమస్య తీరుతుంది' అని కిట్టూ గ్రహించాడు.

– డా. చిట్యాల రవీందర్,
77988 91795.

నేను గీసిన బొమ్మ

– పి.అక్షిత, 6వ తరగతి
తెలంగాణ గురుకుల
సాంఘిక సంక్షేమ పాఠశాల,
చింతకుంట, కరీంనగర్.

– నారంశెట్టి వైభవ్,
3వ తరగతి,
శ్వేత చలపతి సంస్థానం
ఇంగ్లీష్ మీడియం స్కూలు, బొబ్బిలి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పేదరికాన్ని జయించేలా చేశారు ...

దేశం నిజమైన అభివృద్ధి, ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలోనే ఉందని కేరళ ప్రభుత్వం నిరూపించింది. దేశంలో 100 శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా ఇప్పటివరకు చరిత్ర సృష్టించిన కేరళ- ఇప్పుడు మరో మైలురాయి అందుకుంది. ఈ నవంబరు 1 నాటికి నీతి ఆయోగ్ ప్రతిపాదించిన తీవ్ర పేదరిక రహిత లక్ష్యాలని సాధించిన రాష్ట్రంగా నిలవనుంది. పేదరిక నిర్మూలన అంటే అంత ఆషామాషీ కాదు. కానీ కేరళ సాధించింది. పరిపాలనా వికేంద్రీకరణ, సమగ్రమైన, పటిష్ట పాలన అందించడం, వ్యవసాయం, కార్మికరంగం, ప్రజా సంక్షేమ పథకాలు, ఆహారం, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు ... ఇలా ప్రతి రంగం పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకుంది. కేరళ ప్రభుత్వం సాధించిన ఈ విజయం ఇప్పుడు దేశ ప్రజలనే కాదు, ప్రపంచం దృష్టిని కూడా ఆకర్షిస్తోంది.

మే 2021లో తీవ్ర పేదరిక నిర్మూలన ప్రాజెక్టు (ఇపిఇపి)ని కేరళ ప్రారంభించింది. తీవ్ర పేదరికాన్ని గుర్తించడం, పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాజెక్టులో భాగం చేసిన కుటుంబాల వివరాలని 2024లో కేరళ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ప్రచురించింది. స్థానిక వార్డుల నుండి 1,18,309 పేద కుటుంబాలని ఈ ప్రాజెక్టులో భాగం చేశారు. వీటిల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న వారిని మినహాయించారు. ఆహారం, ఆదాయం, ఆశ్రయం, ఆరోగ్య సంరక్షణ లేని కుటుంబాలనే తుది జాబితాలో చేర్చారు. దీని ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని 81 శాతం (64,006) కుటుంబాలు తీవ్ర పేదరికంలో ఉన్నాయని తేలింది. 40 వేల కుటుంబాలని ఆరోగ్య సంక్షోభాలు ప్రభావితం చేశాయి. 34,523 గృహాల్లో ఆహార అభద్రత ఉంది. 15,091 కుటుంబాలకి తగినంత ఆశ్రయం లేదు. ఈ గణాంకాలే ప్రతి ఇంటికి సూక్ష్మ స్థాయి ప్రణాళికలని రూపొందించేలా చేశాయి.

పేదలని గుర్తించడం ఒక ఎత్తయితే, వారి జీవనప్రమాణాలని పెంచడం మరో ఎత్తు. ఆ దిశలో కేరళ వేసిన ప్రతి అడుగుకి ఎంతోమంది జీవితాలు ప్రభావితమయ్యాయి.

కేరళలో మేం లేకపోతే మా బిడ్డ ప్రాణాలు పోయేవి..

కేరళలో అమలవుతున్న 'హృదయం' ప్రాజెక్టు గురించి ఉత్తరప్రదేశ్ నుండి వలస వచ్చిన శిశుపాల్ కుటుంబం ఇలా చెబుతోంది. శిశుపాల్ రెండేళ్ల క్రితం కసరగడ్‌లోని కొత్తూర్‌కి వలస వచ్చాడు. గడ్డి కోసే యంత్రాన్ని ఆపరేట్ చేసే పనికి కుదిరాడు. భార్య గృహిణి. వాళ్లకి ఐదు నెలల బాబు రామ్‌రాజ్ ఉన్నాడు. తనకి పుట్టుకతోనే గుండె సంబంధించిన వ్యాధి ఉంది. ఊపిరి తీసుకోవడం కూడా చాలా కష్టం. కడుపునిండా పాలు కూడా తాగలేని ఆ బిడ్డ అవస్థ అంతాఇంతా కాదు. ఈ పరిస్థితుల్లోనే రామ్‌రాజ్‌ని ములియార్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అక్కున చేర్చుకుంది. 'హృదయం' ప్రాజెక్టులో ఆ బిడ్డ పేరు నమోదుచేశారు. రామ్‌రాజ్‌ని మొదట కన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుండి రోజుల వ్యవధిలోనే కోజీకోడ్ అస్టర్ ఎంఐఎంఎస్ హాస్పటల్‌కి చేర్చారు. అక్కడ రామ్‌రాజ్‌కి గుండె ఆపరేషన్ నిర్వహించారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పథకంలో ఈ చికిత్స జరిగింది. ఈ మొత్తం వ్యవహారాన్ని దగ్గరుండి చూసిన శిశుపాల్ ఆస్పత్రి నుండి వచ్చేటప్పుడు రెండు చేతులు పైకెత్తి కేరళ ఆరోగ్య వ్యవస్థకి దణ్ణం పెట్టాడు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి అత్యున్నత వసతులు గల ఆస్పత్రి వరకు అడుగడుగునా వైద్య సిబ్బంది చూపించిన ఆదరణకి ఆ క్షణంలో అతని కళ్లు వర్షించాయి.

అక్కడే ఉన్న శిశుపాల్ భార్య రుచి ధారాపాతంగా వస్తోన్న కన్నీళ్లని ఆపుకుంటూ ఇలా అన్నది. 'మేము మా రాష్ట్రం (ఉత్తరప్రదేశ్)లోనే ఉంటే మా బిడ్డని కోల్పోయేవాళ్లం. ఎందుకంటే మేము పేదవాళ్లం. మాలాంటి ఎంతోమంది అక్కడ సరైన వైద్య సౌకర్యాలు లేక బిడ్డలని పోగొట్టుకున్నారు. కానీ మేము మాత్రం ఇక్కడికి వచ్చి మా బిడ్డని బతికించుకున్నాం' అని చెబుతున్నప్పుడు ఆమె గొంతు దు:ఖంతో వణికింది. ఆరోగ్యరంగంలో కేరళ సాధించిన విజయానికి రామ్‌రాజ్ ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే!

57 వయసులో చదువు..

కేరళ అక్షరాస్యత మిషన్ గురించి తెలుసుకుంటే ఎన్నో విజయగాథలు మన కళ్లముందు ఉంటాయి. కొల్లాంకి చెందిన పూతక్కులమ్ పంచాయతి ప్రెసిడెంట్ అమ్మి కథ అందులో ఒకటి. అక్షరాస్యత మిషన్ ప్రాజెక్టు పనిమీద కోఆర్డినేటర్ శోభా పూతక్కులమ్ పంచాయతిని సందర్శించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మధ్యలో ఆపేసిన మహిళలని తిరిగి చదువుబాట పట్టించడం ఈ ప్రాజెక్టు లక్ష్యాలలో ఒకటి. అప్పుడు 'ఇందులో నేను కూడా భాగం కావొచ్చా?' అని అమ్మి అడిగింది. అప్పుడు ఆమె జీడిపప్పుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికురాలు. అమ్మి పరిస్థితి ప్రతి చోటా ఉంది. ఉన్నత చదువులు చదువుకోవాలనుకున్న ఆడపిల్లలు చదువు మధ్యలోనే ఆపేసి కుటుంబ బాధ్యతల్లో తలమునకలవుతారు. పెళ్లి, పిల్లల బాధ్యతల్లో మునిగిపోయి, ఆర్థిక వెసులుబాటు లేక వాళ్ల చదువు కోరిక అలాగే ముగిసిపోతుంది. కానీ అమ్మికి అలా అవ్వలేదు. 57 ఏళ్లు వచ్చినా తన చదువును కొనసాగించింది. ప్రాజెక్టులో భాగంగా ఉచితంగా ఉన్నత చదువులు చదివింది. చదువు ఆమెని ఎంతలా అందలం ఎక్కించిదంటే.. 2020లో ఆమె పూతుక్కులమ్ పంచాయతి ప్రెసిడెంట్‌గా ఎన్నికైంది. ఇంకా అమ్మి తన చదువుని కొనసాగిస్తోంది. ఒక మహిళ ఆకాంక్షలకి, ఆలోచనలకి కేరళ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం అది. మహిళా అక్షరాస్యతలో కేరళ రాష్ట్రం సాధించిన ప్రగతికి ఇటువంటి ఉదాహరణలు ఎన్నో.

ఆ రాష్ట్రంలో కౌలు రైతులకి భూమి యాజమాన్య హక్కులని మంజూరు చేశారు. భూమి లేని వ్యవసాయ కార్మికులకి మిగులు భూమిని పున:పంపిణీ చేశారు. ఈ చర్యలు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలని గణనీయంగా మెరుగుపరిచాయి. కార్మిక చట్టాల అమలులో కూడా కేరళ ముందంజలో ఉంది. అక్కడ అనేక రంగాల్లో కనీసవేతనాలు అమలవుతాయి. మహిళల ఆరోగ్యం, విద్య, ఉపాధిలో కూడా ప్రత్యేక కార్యాచరణ ఉంది. అభివృద్ధి అంటే మనం ఒక్కళ్లమే ఆర్థికంగా పుంజుకోవడం కాదు.. మన చుట్టూ ఉన్న కుటుంబాలు, సమాజాలు కూడా ఎదగాలి. అది కూడా 'ఆరోగ్యంగా, సంక్షేమంగా, ఉపాధియుతంగా ఉండాలి' అని కేరళ నిరూపించింది.



సామాజిక అంశాలను పట్టిచూపాం : సిద్ధూ

'ప్రాచీనకాలం నుంచి నేటి సమాజం వరకూ సమాజంలో కొనసాగుతున్న కుల సమస్యను 'చౌదరి గారి అమ్మాయి' సినిమాలో పట్టిచూపాం. ఇంత అభివృద్ధి చెందిన సమాజంలో ఇంకా ఇలాంటి కుల, మత, ప్రాంత బేధాలు ఎందుకని అంతిమంగా ప్రశ్నిస్తూ సందేశాత్మకంగా రూపొందించాం. మంచిగా కథ వచ్చింది. సమాజంలో ఎలాంటి బేధాలు, బేషజాలు, ఇతరులను చులకనగా చూసేలా, వివక్షతా భావాలు ఉండకూడదనే సందేశాన్ని అంతిమంగా తెలియజేశాం' అని దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని అన్నారు. ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి'. ట్రైలర్‌ను వినయ్‌తేజ్, రిషితలతో కలిసి దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని ఆవిష్కరించారు.

కరుప్పు నుంచి 'గాడ్‌మోడ్' సాంగ్ రిలీజ్

కథానాయకుడు సూర్య నటించిన కొత్త సినిమా 'కరుప్పు'. త్రిష కథానాయిక. ఆర్‌జే బాలాజీ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్‌ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్‌ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. నటి స్వాశిక, ఇందిరన్స్, యోగిబాబు, శివదా, సుప్రీత్‌రెడ్డి, అనకా, మాయారవి, నట్టి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల కోసం చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేస్తోంది. దీపావళి పండగ సందర్భంగా 'గాడ్ మోడ్' అంటూ సాగే ఫస్ట్ సాంగ్‌ను మేకర్లు విడుదల చేశారు. నల్లని దుస్తులు, చేతిలో కత్తితో సూర్య నటించిన ఊరమాస్ ట్యూన్స్‌తో రూపొందించారు. సూర్య ఈ చిత్రంతో పాటు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ద్విభాషా చిత్రంనూలో నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ కూడా కొనసాగుతోంది.

'లవ్ ఓటీపీ' అందరినీ అలరిస్తుంది : రాజీవ్ కనకాల

"లవ్ ఓటీపీ' చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో చిత్రీకరించాం. ఈ ప్రయాణంలో నన్ను అనీష్, అతని టీం మెంబర్స్ ఎంతో సపోర్ట్ చేశారు. ఇందులో నేను కొడుకుని కూతురిలా చూసుకునే ఓ డిఫరెంట్ ఫాదర్ కారెక్టర్‌ను చేశాను. థియేటర్లో అందరూ ఎంజాయ్ చేసేలా, పగలబడి నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది. భావప్రీత బ్యానర్‌పై విజయ్ ఈ మూవీని భారీ ఎత్తున నిర్మించారు. అనీష్ తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. జాన్వికకి తెలుగులో మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఆనంద్ మ్యూజిక్ చాలా బాగుంటుంది. నా సినిమాలకు, రోషన్ చిత్రాలకు మ్యూజిక్ చేసే అవకాశాన్ని ఆనంద్‌కు ఇస్తానని మాటిస్తున్నాను. హర్ష విజువల్స్ అద్భుతంగా వచ్చాయి' అని సినీ నటుడు రాజీవ్ కనకాల అన్నారు. పుష్ప మణిరెడ్డి సమర్పణలో భావప్రీత ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అనీష్ కథానాయకుడిగా స్వీయదర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'లవ్ ఓటీపీ'. విజయ్ ఎం.రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల కీలకపాత్రలో నటించారు. జాన్విక, నాట్యరంగ తదితరులు నటించారు. నవంబర్ 14న విడుదల కానున్న ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను చిత్ర నిర్మాతలు బుధవారం విడుదల చేశారు.

సురేందర్‌రెడ్డితో రవితేజ సినిమా



రవితేజ, సురేందర్‌రెడ్డి కాంబినేషన్ మళ్లీ పునరావృతం కానుంది. 2009లో విడుదలైన 'కిక్' బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ మరో మాస్ ఎంటర్‌టైనర్ కోసం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. 'ఏజెంట్' తర్వాత సురేందర్ రెడ్డి కొంత గ్యాప్ తీసుకొని స్టార్ హీరోలకు కథలు వినిపించారు. పవన్‌కళ్యాణ్‌తో సినిమా ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో, రవితేజ సినిమాను ముందుగా పట్టాలెక్కించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం రవితేజ రెండు కొత్త ప్రాజెక్టులలో బిజీగా ఉన్నారు. 'కిక్' మూవీ రీమేక్‌ల రూపంలో తమిళం, హిందీ భాషల్లో కూడా విజయాలు సాధించింది. అయితే ఆ తర్వాత రవితేజ, సురేందర్‌రెడ్డి కాంబోలో వచ్చిన 'కిక్ 2' మాత్రం ఆ స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది.

చిత్రీకరణలో 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'

శివాజీ, లయ జంటగా శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 2గా కొత్త చిత్రం తెరకెక్కుతోంది. సుధీర్ శ్రీరామ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ను మోషన్ పోస్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ చిత్రానికి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో శివాజీ పంచాయతీ సెక్రెటరీ శ్రీరామ్ పాత్రలో కనిపించనున్నారు. '90' సిరీస్‌లో శివాజీతో కలిసి నటించిన రోహన్‌తో పాటు అలీ, ధనరాజ్, రఘుబాబు, 30 ఇయర్స్ పృధ్వీ, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, రాజ్ తిరందాసు, కరణ్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రంజిన్ రాజ్ సంగీతం అందిస్తున్నారు.

గెలిస్తే సెమీస్ బెర్త్

- నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా కీలక పోరు
- మధ్యాహ్నం 3.00గం॥లకు
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

నవీ ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన కీలకపోరుకు సిద్ధమైంది. సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే న్యూజిలాండ్‌తో గురువారం జరిగే మ్యాచ్‌లో గెలుపు తప్పనిసరి. ఎందుకంటే సెమీస్‌కు చేరుకోవాలంటే ఇక్కడ్నుంచి మిగిలిన రెండు మ్యాచులూ భారత మహిళా జట్టుకు గెలవడం అత్యంత కీలకం. టాప్-4లో స్థానం కోసం న్యూజిలాండ్ కూడా ఈ రేసులో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సమీకరణాలతో సంబంధం లేకుండా టీమిండియా నేరుగా సెమీస్‌కు చేరుతుంది. చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించడం పెద్ద కష్టమేం కాదు. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లు సెమీస్‌కు చేరాయి. ప్రస్తుతం భారత్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), న్యూజిలాండ్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), శ్రీలంక (6 మ్యాచుల్లో 4 పాయింట్లు) నాలుగో బెర్తు కోసం పోటీపడుతున్నాయి. బంగ్లా, పాక్ ఇప్పటికే ఎలిమినేట్ అయిపోయాయి. ఒకవేళ న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా.. భారత్ తన చివరి మ్యాచ్‌లో బంగ్లాను ఓడిస్తే చాలు సెమీస్‌కు చేరుతుంది. మరోవైపు కివీస్ చివరి మ్యాచ్‌లో పటిష్ట ఇంగ్లండ్‌ను ఓడించినా.. భారీగా రన్‌రేట్‌ను పెంచుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో హర్మన్‌ప్రీత్ సేన న్యూజిలాండ్‌తో మ్యాచ్‌ను సీరియస్‌గా తీసుకొని గెలుపుతో ముగించాలని కోరుకుందాం..

పాయింట్ల పట్టిక

	దేశం	ఆ	గె	ఓ	రద్దు	పా	నె.ర.
1.	ఆస్ట్రేలియా	6	5	0	1	11	+1.70
3.	దక్షిణాఫ్రికా	6	5	1	0	10	+0.27
2.	ఇంగ్లండ్	6	4	1	1	9	+1.02
4.	ఇండియా	5	2	3	0	4	+0.52
5.	న్యూజిలాండ్	5	1	2	2	4	-0.24
7.	శ్రీలంక	6	1	3	2	4	-1.03
6.	బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.57
8.	పాకిస్తాన్	5	0	3	2	2	-1.88

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా గెలుపు

సెమీస్‌కు చేరిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ పై చేయి సాధించింది. ఇంగ్లండ్ మహిళలు నిర్దేశించిన 245 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 40.3 ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. అంతకుముందు ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంలో ఇంగ్లండ్ జట్టు 50 ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 244 పరుగులు చేసింది. బ్యూమౌంట్(78) అర్ధసెంచరీ చేయగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సథర్లాండ్‌కు దక్కింది.

జట్లు(అంచనా)...

భారత్: ప్రతీకా, మంధాన, హర్లీన్, హర్మన్ (కెప్టెన్), దీప్తి, రిచా, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్.

న్యూజిలాండ్: డివైన్(కెప్టెన్), ఇసాబెల్లా గాజే(వికెట్ కీపర్), అమేలియా, గ్రీన్, కెర్ర్, బ్రీలింగ్, కర్సన్, తహుహు, రోవో, ఇంగ్లిస్, జేమ్స్.

బ్యాటర్లపైనే భారం..

నేడు ఆస్ట్రేలియాతో రెండో వన్డే
ఉదయం 9.00గం॥లకు

అడిలైడ్: తొలి వన్డేలో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడిన భారత్ ఇక రెండో వన్డేపై దృష్టి సారించింది. మూడు వన్డేల సిరీస్ చేజారకుండా ఉండాలంటే టీమిండియా ఈ వన్డేను తప్పక గెలవాల్సిందే. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేకు వర్షం అడ్డంకి నిలవడంతో ఆ మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 26 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం.. ఆస్ట్రేలియాకు 131 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 21.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యతలో నిలువగా.. టీమిండియా తాడో-పేడో తేల్చుకోవాల్సి పరిస్థితి. ఈ క్రమంలో అడిలైడ్ వేదికగా గురువారం రెండో వన్డే మ్యాచ్ జరగనుంది. బుధవారం కేవలం 20 శాతం మాత్రమే వర్షం పడినట్లు ఇక్కడి వాతావరణ శాఖ తెలిపింది. దీంతో గురువారం జరిగే ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు తక్కువగానే ఉన్నట్లు పేర్కొంది. అడిలైడ్ ఓవల్ పిచ్ బ్యాటింగ్ కోసం ఆస్ట్రేలియాలో అత్యుత్తమమైన పిచ్‌లలో ఒకటి. మ్యాచ్ ప్రారంభమైన 10ఓవర్లపాటు బౌన్సర్ బంతులు వచ్చినా.. ఆ తర్వాత బ్యాట్స్‌మెన్ బ్యాటింగ్ చేయడం సులభమే. అడిలైడ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే పిచ్. భారత్ స్పిన్ పటిష్టంగా ఉంది.

జట్లు(అంచనా)...

భారత్ : రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, సుందర్/కుల్‌దీప్, నితీశ్ కుమార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్.

ఆస్ట్రేలియా : మార్ష్(కెప్టెన్), హెడ్, షార్ట్, ఫిలిప్పే(వికెట్ కీపర్), రెన్‌షా, కాన్నే, ఓవెన్, స్టార్క్, ఎల్లిస్, కెహ్నెమన్, హేజిల్‌వుడ్.

అభినవ్ బింద్రాకు అరుదైన గౌరవం
2026 వింటర్ ఒలింపిక్స్ టార్చ్ బేరర్‌గా ఎంపిక



మిలన్: భారత మాజీ షూటర్, ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన అభినవ్ బింద్రాకు అరుదైన గౌరవం దక్కింది. 2026 వింటర్ ఒలింపిక్స్ టార్చ్ బేరర్‌గా ఎంపికయ్యాడు. వింటర్ ఒలంపిక్స్ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా అభివన్ బింద్రా.. 'మిలన్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్ టార్చ్ రిలేకు టార్చ్ బేరర్‌గా ఎంపిక నిజంగా నమ్మలేకపోతున్నా... ఒలింపిక్ జ్యోతి ఎల్లప్పుడే నా హృదయంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుందని ట్విట్టర్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. వింటర్ ఒలింపిక్స్‌కు ఇటలీ ఆతిథ్యమివ్వడం ఇది నాల్గోసారి. 2022 వింటర్ ఒలింపిక్స్‌లో 16 క్రీడలకు సంబంధించి మొత్తం 116 పతకాలకు పోటీలు జరిగాయి. ఈసారి ఒక విభాగంతోపాటు ఏడు క్రీడా ఈవెంట్‌లు అదనంగా చేర్చబడ్డాయి. 2008 బీజింగ్ ఒలింపిక్స్ 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో అభినవ్ బింద్రా బంగారు పతకాన్ని సాధించాడు. 2026 ఫిబ్రవరి 6నుంచి 22 వరకు ఇటలీలోని మిలన్ వేదికగా వింటర్ ఒలింపిక్స్ జరగనున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68